


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పట్ల అంబేద్కర్ దార్శనికత, సవాళ్లు

చైనాకు భారత ఎగుమతులు పెరిగాయా!

06

సంపుటి 09, సంచిక: 03 | శనివారం | 29-11-2025 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## పంచాయతీ ఎన్నికలపై 'స్టే' ఇవ్వలేం

- ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనందున జోక్యం చేసుకోలేం
- హైకోర్టు సిజె ధర్మాసనం స్పష్టీకరణ

**హైదరాబాద్ :** పంచాయతీ ఎన్నికలపై స్టే ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనందున జోక్యం చేసుకోలేమని సిజె ధర్మాసనం పేర్కొంది. పంచాయతీ ఎన్నికల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 46ను సవాల్ చేస్తూ అత్యంత వెనుకబడిన కుల సంఘాలు పిటిషన్ దాఖలు చేశాయి. ఈ పిటిషన్‌పై సిజె ధర్మాసనం విచారణ చేపట్టింది. పంచాయతీరాజ్ చట్టంలోని 285 'ఎ' ప్రకారం రిజర్వేషన్లు కల్పించారని బిసిలలో ఉన్న 'ఎబిసిడి' గ్రూపుల ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించలేదని పిటిషనర్ తరపు న్యాయవాది సుదర్శన్ కోర్టుకు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ వారం క్రితం తరువాయి 12లో

## జనవరి ఒకటిన లొంగిపోతాం

**సమయమివ్వండి.. సాయుధపోరాటాన్ని విరమించుకుంటాం**

- ఆయుధాలు అప్పగించి పునరావాసాన్ని అంగీకరిస్తాం
- అప్పటివరకు భద్రతా బలగాలు అరెస్టులు, ఎన్‌కౌంటర్లు వంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడండి
- మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రులకు మావోయిస్టుల లేఖ
- మూడు రాష్ట్రాల మావోయిస్టు కమిటీ తరపున అనంత్ పేరుతో లేఖ బహిర్గతం



ప్రజాపక్షం/ ఖమ్మం

లొంగుబాటుపై మావోయిస్టులు కీలక ప్రకటన చేశారు. జనవరి ఒకటవ తేదీ వరకు సమయమివ్వండి.. లొంగిపోతామంటూ మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖ రాశారు. అనంత్ పేరుతో ఈనెల 17న మావోయిస్టులు విడుదల చేసిన లేఖ బహిర్గతమైంది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఛత్తీస్ గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి లకు మావోయిస్టులు ఒక లేఖను విడుదల చేశారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మావోయిస్టు పార్టీ కమిటీ పేరుతో అనంత్ పేరున ఒక లేఖ విడుదలైంది. 2026 జనవరి ఒకటి నాటికి సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా విరమించుకుని ప్రధాన స్రవంతిలో కలిసేందుకు నిర్ణయించుకున్నామని, అప్పటి వరకు మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు సమన్వయం పాటించాలని జనవరి ఒకటి వరకు భద్రతా దళాలు అరెస్టులు, ఎన్‌కౌంటర్లు వంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా చూడాలని ఆ లేఖలో తరువాయి 2లో

### చైతుతో పాటు మరో తొమ్మిది మంది లొంగుబాటు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్ జిల్లా జగద్దల్ పూర్‌లో మావోయిస్టు నేత చైతు అలియాస్ శ్యామ్ దాదా పోలీసులు ఎదుట లొంగిపోయారు. ఆయనతో పాటు పది మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు బస్తర్ ఐజి సుందర్ రాజన్ తెలిపారు. దర్భా డివిజన్ ఇంచార్జ్ గా ఉన్న చైతు 2013 జిరామ్ వ్యాలీ దాడిలో 30 మంది కాంగ్రెస్ నేతలపై దాడి చేసి హతమార్చిన ఘటనలో ప్రధాన నింధితుడు. 2013 మే 15న జరిగిన దాడిలో చనిపోయిన వారిలో ప్రధానంగా ఆ రాష్ట్ర మంత్రి మహేందర్ ఖర్మ, కాంగ్రెస్ చీఫ్ నందకుమార్ పటేల్, విద్యాచరణ్ శుక్లా ఉన్నారు.

## 3000 మంది ప్రముఖులకు ఆహ్వానం

- ఆహ్వానితుల్లో బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లేర్, ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ డైరెక్టర్ ఎరిక్ స్విడర్, పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాయల్ ఫ్యామిలీ సభ్యులు
- ''తరలిరండి.. ఉజ్వల తెలంగాణలో పాలుపంచుకోండి'' నినాదంతో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు
- ప్రపంచ స్థాయి వేడుకగా భారీ ఏర్పాట్లు

ప్రజాపక్షం/హైదరాబాద్

''తరలి రండి ఉజ్వల తెలంగాణలో పాలుపంచుకొండి'' అనే నినాదంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' ను నిర్వహిస్తోంది. డిసెంబర్ 8, 9 తేదీలలో హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించేందుకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్ చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. దేశ విదేశాలకు చెందిన దాదాపు 3 వేల మంది ప్రముఖులను ప్రభుత్వం ఈ సదస్సుకు ఆహ్వానిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, టెక్నాలజీ రంగం ప్రముఖులు ఈ జాబితాలో ఉన్నారు. బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లేర్, ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ డైరెక్టర్ ఎరిక్ స్విడర్, పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాయల్ ఫ్యామిలీ సభ్యులు, వివిధ కంపెనీల అంతర్జాతీయస్థాయి సిఇఓలు సదస్సుకు హాజరుకానున్నారు. వివిధ రంగాల ప్రముఖులను సదస్సుకు ఆహ్వానించేందుకు స్వయంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేరుతో ప్రభుత్వం ఆహ్వాన లేఖలను పంపిస్తోంది.

**ప్రముఖులకు సిఎం ఆహ్వాన లేఖలు**

'వికసిత్ భారత్ 2047 జాతీయ వృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా మా ప్రజా ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ 2047' డాక్యుమెంట్‌ను తయారు చేసింది. ఆర్థిక వృద్ధి, అన్ని రంగాల ప్రగతి, అన్ని వర్గాల సంక్షేమం, సాధికారత, సమ్మిళిత వృద్ధి లక్ష్యంగా భవిష్యత్తు తెలంగాణకు రోడ్ మ్యాప్‌ను రూపొందించింది. ఈ లక్ష్యాలను కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పాన్ని ప్రపంచ వేదికపై ప్రదర్శించేందుకు డిసెంబర్ 8, 9 తేదీలలో హైదరాబాద్‌లో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ –2025'ను నిర్వహిస్తున్నాము. తప్పకుండా తరలిరండి.' అనే ఆహ్వాన సందేశంతో ముఖ్యమంత్రి పేరుతో ప్రభుత్వంలేఖలు పంపించింది.

**సిఎం ఆహ్వానానికి స్పందించిన ప్రముఖులు**

ప్రభుత్వం పంపించిన ఆహ్వానం అందుకున్న ప్రముఖులలో కొందరు సదస్సుకు హాజరవుతున్నట్లు ప్రకటించారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాజవంశానికి చెందిన షేక్ తారిక్ అల్ ఖాసిమీ, రాస్ అల్ ఖైమా, డాయిచ్ బోర్స్ గ్రూప్ హెడ్ తరువాయి 2లో



## రిజర్వేషన్‌లు సరిదిద్దాలి

ఆ తర్వాతే ఎన్నికలు

బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎన్నికలను నిలుపుదల చేయడంతో పాటు ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి, రిజర్వేషన్లలో జరిగిన తప్పులను సవరించి ఎన్నికలకు వెళ్లాలని బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ సూచించారు. మహాత్మ జ్యోతిబా పూలే 135వ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం తెలంగాణ బిసి కమిషన్ కార్యాలయంలో పూలే చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించడం జరిగిందన్నారు. అనంతరం బిసి కమిషన్ సభ్యులతో చైర్మన్ జి.నిరంజన్ సమావేశమై స్థానిక సంస్థల్లో బిసిలకు కల్పించిన రిజర్వేషన్ల విషయమై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 సంవత్సరం పంచాయతీ ఎన్నికల్లో బిసిలకు 22. 78 శాతం రిజర్వేషన్లు లభిస్తే తరువాయి 12లో

## డ్రగ్స్ సరఫరాకు నైజీరియన్ల భారీ కుట్ర

- న్యూ ఇయర్ వేడుకలే లక్ష్యం
- ఢిల్లీలో ముమ్మరంగా 'ఈగల్' దాడులు
- డ్రగ్స్ ఆపరేషన్‌లో వెలుగు చూస్తున్న సంచలనాలు
- పట్టుబడిన 50 మంది నేడు హైదరాబాద్‌కు



ప్రజాపక్షం/హైదరాబాద్

న్యూఢిల్లీ కేంద్రంగా నూతన సంవత్సర వేడుకల్లో దేశ వ్యాప్తంగా డ్రగ్స్‌ను సరఫరా చేసేందుకు నైజీరియన్ల భారీ కుట్రను తెలంగాణ పోలీసులు చేధించింది.డ్రగ్స్ నిర్మూలన కోసం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్' (ఈగల్ టీ) పోలీసులు బృందాలు ఢిల్లీలో మూడు రోజులుగా ముమ్మరంగా దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో పట్టుబడిన 50 మంది నైజీరియన్లను శనివారం హైదరాబాద్‌కు తరలించేందుకు ఈగల్ టీం సిద్ధమైంది. వీరంతా న్యూఢిల్లీలోని 20 ప్రాంతాల్లో సోదాలు చేయగా ఈగల్ టీంకు చిక్కారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణను మార్చేందుకు ఈగల్ టీమ్ వ్యూహాత్మకంగా అడుగులు తరువాయి 2లో

## జిల్లాలకు సిఎం

డిసెంబర్ 1 నుంచి ఆరు జిల్లాల్లో రేవంత్‌రెడ్డి పర్యటన



ప్రజాపక్ష/హైదరాబాద్

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పరిపాలన పూర్తయిన సందర్భంగా డిసెంబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు 'ప్రజా పాలన వారోత్సవాల'ను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి డిసెంబర్ 1వ తేదీ నుంచి ఆరు రోజుల పాటు జిల్లాలలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా జిల్లాలలో నిర్వహించే బహిరంగ వారోత్సవాలలో నిర్వహించే బహిరంగ సభలలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. డిసెంబర్ 1న మహబూబ్ నగర్ జిల్లా మక్తల్, 2వ తేదీన ఖమ్మం జిల్లా కొత్తగూడెం, 3వ తేదీన కరీంనగర్ జిల్లా హుస్నాబాద్, 4వ తేదీన ఆదిలాబాద్, 5వ తేదీన తరువాయి 2లో

## 'కాళోజీ' వ్యవహారంపై సిఎం ఆగ్రహం


యూనివర్సిటీ విసి రాజీనామా!

ప్రజాపక్షం/హైదరాబాద్/హనుమకొండ

ఇటీవల వరుసగా కాళోజీ వర్సిటీ వ్యవహారాలపై పత్రికల్లో వస్తున్న కథనాలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్ష పేపర్ల మూల్యాంకనంలో అవకతవకలు, ఇష్టారీతిగా ఇన్ ఛార్జీల నియామకం తదితర ఘటనలపై వస్తున్న ఆరోపణలపై సిఎం ఆరా తీశారు. ఈ అంశంపై వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల నుంచి రేవంత్ రెడ్డి వివరణ కోరారు. ఉన్నతమైన వర్సిటీలో అస్తవ్యస్త పరిస్థితులకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఎం ఆదేశించారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే ఘటనల వెనుక ఎంతటి వారున్నా ఉపేక్షించే సమస్యే లేదని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.. ఉన్నత స్థాయి సంస్థల్లో పని చేసేవారు తరువాయి 2లో

## రికార్డులు బద్దలు

- కోకాపేటలో ఆకాశాన్నంటుతున్న భూముల ధరలు
- రెండోవిడత వేలంలో ఎకరాకు రూ.151 కోట్లు పలికిన ధర



ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌లో భూముల ధరలు రికార్డు సృష్టిస్తున్నాయి. గతంలో భూముల ధరల రికార్డులను కోకాపేటలో ప్రస్తుత ధరలు బ్రేక్ చేస్తున్నాయి. కోకాపేట పరిసర ప్రాంతాల్లో కోట్లు పలుకుతున్నాయి. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండిఏ) శుక్రవారం నిర్వహించిన ఇ వేలంలో కోకాపేట నియోపోలీస్ భూములు రికార్డు స్థాయి ధర పలికాయి. హైదరాబాద్ కోకాపేట్ లో ఉన్న భూముల రెండో విడత ఇ వేలం శుక్రవారం ముగిసింది. రెండో విడత వేలంలో ఎకరాకు ఏకంగా రూ.151 కోట్ల పలికాయి. నియోపోలిస్ దగ్గర ఉన్న ప్లాట్ నెంబర్ 15 లో ఎకరానికి 151 కోట్ల 25 లక్షలు పలికిన ఎకరం ధర పలికి రికార్డు సృష్టించింది. అదే విధంగా ప్లాట్ నెంబర్ 16 లో ఎకరం ధర 147 కోట్ల 75 లక్షలు పలికింది. ఫ్లాట్ నంబర్ 15, 16లో మొత్తం 9.06 ఎకరాల భూమికి వేలం నిర్వహించారు. 15వ నెంబర్ ప్లాట్‌లో ఎకరం తరువాయి 2లో

## మెగా జిహెచ్‌ఎంసి 2000 చదరపు కిలోమీటర్లు

- పరిపాలనా సౌలభ్యం కోసం ఒకే కార్పొరేషన్ ఏర్పాటు యోచనలో ప్రభుత్వం
- 'మహా' నగరంలో మున్సిపల్ సంస్థల విలీనంపై ముమ్మరంగా సాగుతున్న కసరత్తు



ప్రజాపక్షం/హైదరాబాద్

మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి)లో శివారు కార్పొరేషన్లు, మునిసిపాల్టీల విలీనం నిర్ణయం నేపథ్యంలో, తదుపరి కార్యాచరణపై ప్రభుత్వ విభాగాలు దృష్టి సారించాయి. విలీనం పూర్తి చేసే కసరత్తు ముమ్మరంగా సాగుతోంది. గత మూడు రోజులుగా డివిజన్‌ల పునర్విభజన కసరత్తు ప్రారంభించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సిజిజి) కార్యాలయంలో జిహెచ్‌ఎంసికి చెందిన టౌన్‌ప్లానింగ్ యాంత్రాంగం తరువాయి 2లో

## సిఇసి చేతికి రక్తపు మరకలు




- బెంగాల్‌లో 40'సర్' సంబంధిత మరణాలు
- భారత ఎన్నికల సంఘాన్ని కలిసిన టిఎంసి

**న్యూఢిల్లీ :** ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ప్రక్రియ కొనసాగుతున్న 9 రాష్ట్రాలు, మూడు యుటిల్లో పలువురు బిఎల్‌ఒలు మృత్యువాత పడుతున్నారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో ఇప్పటి వరకు దాదాపు 40 మంది సర్ సంబంధిత మరణాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం తృణమూల్ కాంగ్రెస్ ప్రతినిధి బృందం ఢిల్లీలో భారత ఎన్నికల కమిషన్ సమావేశమైంది. తమ రాష్ట్రంలో చోటు చేసుకున్న మరణాలను వివరించింది. చీఫ్ ఎలక్షన్ కమిషన్ చేతులుకు అంటుకున్న రక్తపు మరకలు అని ఆరోపించింది. పశ్చిమ బెంగాల్‌లో కొనసాగుతున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక తరువాయి 12లో

## శ్రీలంక, ఇండోనేషియాలో ప్రకృతి విలయం



**కొలంబో/జకార్త:** శ్రీలంక, ఇండోనేషియాలో ప్రకృతి విలయం భారీ నష్టాన్ని మిగిలిస్తున్నది. శ్రీలంకలో వరదలు, కొండ చరియలు విరిగిపడడం వంటి ఘటనల్లో 56 మంది మృతి చెందగా, పదుల సంఖ్యలో గల్లంతయ్యారు. ఇండోనేషియాలో కనీసం 79 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురి ఆచూకీ తెలియడం లేదు. పరిస్థితుల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అన్ని సంస్థలనూ అప్రమత్తం చేసింది. ముందస్తు చర్యగా అత్యవసర సర్వీసులను మినహాయించి మిగతా అన్ని సంస్థలకు తరువాయి 12లో



## భారత్‌కు పుతిన్

**డిసెంబరు 4 నుంచి రెండు రోజుల పర్యటన**

ద్వైపాక్షిక అంశాలపై పలు కీలక నిర్ణయాలు !

**న్యూఢిల్లీ :** భారత్–రష్యాల స్నేహసంబంధం మరింత పటిష్ఠం కానుంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెండు రోజుల పర్యటన కోసం భారతదేశానికి రానున్నారు. డిసెంబర్ 4నుండి నరేంద్ర మోదీతో వార్షిక సమావేశాలలో ఆయన పాల్గొనబోతున్నారు. ఈ పర్యటన ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో గణనీయమైన ఫలితాలను ఇస్తుందని భావిస్తున్నారు. శుక్రవారం రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌ను సందర్శించనున్న విషయాన్ని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఇఏ) ప్రకటించింది.పుతిన్ భారత పర్యటన రష్యాభారత్‌ల మధ్య ప్రత్యేక, విశేష వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి దార్శనికతను నిర్దేశిస్తుందని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆహ్వానం మేరకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ డిసెంబర్ 4 నుండి 5 వరకు భారతదేశం రష్యా శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు భారత్‌లో అధికారిక పర్యటన చేయనున్నారు అని ఆ ప్రకటన తెలిపింది. రాష్ట్రపతి తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## గీత దాటొద్దు: జపాన్‌కు చైనా హెచ్చరిక

**బీజింగ్:** తైవాన్ విషయంలో గీత దాటితే జపాన్ భారీ మూల్యాన్ని చెల్లించు కోవల్సి వస్తుందని చైనా హెచ్చరించింది. తైవాన్ తీరానికి 100 కిమీల దూరంలో ద్వీపంపై క్షిపణుల మోహరింపునకు జపాన్ యోచిస్తుండటంతో చైనా రక్షణ శాఖ ఈ విధంగా స్పందించింది. తైవాన్‌పై చైనా దాడి చేస్తే టోక్యో సైన్యం బదులిస్తుందని జపాన్ ప్రధాని సనే తకైచీ ఇటీవల వ్యాఖ్యానించారు. రెండు దేశాల మధ్య దౌత్య సంక్షోభం దృష్ట్యా ఈ పరిణామానికి ప్రాధాన్యత ఏర్పడింది. తైవాన్ కంటే అనేక రెట్లు అధికంగా చైనా రక్షణ వ్యయం ఉంటుందని తైవాన్ మెయిన్‌ల్యాండ్ అఫైర్స్ కౌన్సిల్ అధికార ప్రతినిధి లియాంగ్ వెన్-చీ అన్నారు. క్రాస్-స్ట్రెయిట్ శాంతికి చైనా ప్రాధాన్యత ఇస్తే ఈ డబ్బును మెయిన్‌ల్యాండ్ ఆర్థిక పరిస్థితులు, ప్రజల జీవితాలను మెరుగు పర్చడం కోసం వినియోగించుకోవచ్చన్నారు. తైవాన్ చుట్టూ సముద్ర జలాల్లో, గగనతలంలో చైనా సైన్యం తిరుగుతూనే ఉంటుందని చెప్పారు.

## ఇక కఠిన వలస విధానం

**అన్ని తృతీయ ప్రపంచ దేశాల నుండి వలసలను శాశ్వతంగా నిలిపివేస్తానని డొనాల్డ్ ట్రంప్ ప్రకటన**




**న్యూయార్క్/ వాషింగ్టన్:** వైట్‌హౌస్ సమీపం లోఅఫ్గానిస్థాన్‌జాతీయుడు రహ్మానుల్లా లకాన్వాల్ జరిపిన కాల్పుల్లో గాయపడిన ఇద్దరు వెస్ట్ వర్జీనియా నేషనల్ గార్డ్స్‌లో ఒకరు మృతిచెందినట్టుఅమెరికాఅధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. థాంక్స్ గివింగ్‌ఉత్సవం సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ, 20 ఏళ్ల సారా బెక్‌స్ట్రామ్ మృతి చెందగా, స్టాఫ్ సార్జెంట్ ఆండ్రూ ఓల్ఫ్ (24) ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. అతని పరిస్థితి కూడా ఆందోళనక రంగాఉందన్నారు. 'సారా ఇప్పుడు మన మధ్య లేదు. ఆమె మరణ వార్త నాకు ఇప్పుడే తెలిసింది' అన్నారు. ఈ ఘటనను ఉగ్రవాద చర్యగా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. 'ఇది మానవత్వానికి వ్యతిరేకంగా జరిగినదాడి. తీవ్రంగా ఖండిస్తున్నాం. నిందితుడు అత్యంత ప్రమాదకర అఫ్గానిస్థాన్‌కు చెందినవాడు. జో బైడెన్ హ యాంలో అమెరికా వచ్చాడు. అప్పుడు వచ్చిన అఫ్గాన్లు అందరినీవిచారించాలి' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. శరణార్థులు తమ మనుగడకే ప్ర మాదకరమని ప్రకటించారు. అందుకే, ఇక కఠిన వలస విధానాన్ని అమలు చేస్తామని, అన్ని తృతీయ ప్రపంచ దేశాల నుండి వలసలను శాశ్వతంగా నిలిపివేస్తానని స్పష్టం చేశారు,అమెరికాకు భద్రతా ముప్పుగా ఉన్న విదేశీయులను బహిష్కరిస్తానని హెచ్చరించారు. పూర్వ బైడెన్ ప్రభుత్వ కాలంలో వచ్చిన లక్షలాది వలసదారుల ప్రవేశాలను కూడా రద్దు చేస్తానని తెలిపారు. యుఎస్ సిఐఎస్ కొత్త మార్గదర్శకాలను అనుసరిస్తుందని, అఫ్గానిస్థాన్ సహా 19 అధిక ప్రమాద దేశాల నుండి వచ్చిన వలస అభ్యర్థనలపై కఠినంగా 'పునర్మూల్యాంకనం' జరుగుతుందని స్పష్టంచేశారు.వలస విధానాలు దేశంలో నేరాలు, సామాజిక సమస్యలు, వనరులపై ఒత్తిడి పెంచుతున్నాయని ఆరోపించారు.

### పాకిస్తాన్ ఖండన

**ఇస్లామాబాద్:**అమెరికాలో నేషనల్ గార్డ్స్‌పై అఫ్గాన్‌కు చెందిన రహ్మానుల్లా లకాన్వాల్ కాల్పులు జరిపిన ఘటనను పాకిస్తాన్ ఖం డించింది. ఇది ముమ్మాటికీ ఉగ్రవాద చర్యేనని తెలిపింది. తమ దేశంలోనూ జరిగిన ఎన్నో ఉగ్రవాద దాడులకు అఫ్గానిస్థానే కారణమని ఆరోపించింది. అత్యంత సంక్లిష్టమైన పరిస్థితుల్లో,అమెరికాకుఅన్నివిధాలా సాయంగా ఉంటామని తన ప్రకటనలో పేర్కొంది.

## 'హాంకాంగ్' ఘటనకు పరంజాయే కారణం!



**హాంకాంగ్:** హాంకాంగ్‌లోని ఒక అపార్ట్‌మెంట్ సముదాయంలో జరిగిన ఘోర అగ్నిప్రమాదానికి కారణాలపై దర్యాప్తు జరుగుతున్నది. అయితే, ఈ ప్రమాదంలో కనీసం 94 మంది మరణించడంతో, అక్కడ విస్తృతంగా ఉపయోగించే 'బాంబూ స్కాఫోల్డింగ్' (వెదురు పరంజా) భద్రతపై తీవ్ర ప్రశ్నలు తలెత్తాయి. 32 అంతస్తుల భవనం వెలుపల ఉన్న పరంజాలో అగ్ని ప్రారంభమై, గాలుల కారణంగా భవనం లోపలికీ, అపై ఆరు ఇతర టవర్లకూ వేగంగా వ్యాపించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. తేలికగా ఉండటం, చవక కావడం, రద్దీగా ఉన్న హాంకాంగ్ వీధుల్లో సులభంగా అమర్చగలగడం వంటి కారణాలతో శతాబ్దాలుగా వెదురు పరంజాల వాడకం కొనసాగుతున్నది. ఇవి అగ్నిప్రమాదాలకు లోనయ్యే ప్రమాదం ఎక్కువ. 2018 నుంచి ఇలాంటి బాంబూ స్కాఫోల్డింగ్ ప్రమాదాల్లో కనీసం 23 మంది మరణించారు. హాంకాంగ్ ఇప్పటికే దశలవారీగా మెటల్ స్కాఫోల్డింగ్‌కు మారాలని ప్రణాళిక చేస్తోంది. అధికారులు బాంబూతో పోలిస్తే మెటల్ అగ్ని నిరోధకతలో మరింత సురక్షితమని నిపుణులు పేర్కొన్నారు. ప్రమాదం అధికంగా ఉన్న ప్రాంతాల్లో మెటల్ స్కాఫోల్డింగ్ తప్పనిసరి కావాలని సూచించారు. అగ్ని వేగంగా వ్యాపించడానికి ప్లాస్టిక్ నెట్‌లు, ప్లాస్టిక్ ఫోమ్ ప్యానెల్లు వంటి ఇతర దహన సామగ్రి కూడా కారణమై ఉండవచ్చని అధికారులు తెలిపారు. ఫైర్ సేఫ్టీ ప్రమాణాలను ఉల్లంఘించారనే అనుమానంతో ముగ్గురు నిర్మాణ సంస్థాధికారులను పోలీసులు అరెస్టు చేశారు. ఇలా వుంటే, ఈ ఘటన బాంబూ స్కాఫోల్డింగ్ భవిష్యత్తు పై పెద్ద చర్చను రేకెత్తించింది. పరిశోధన తుది ఫలితాలు ఏమైనా కావచ్చుగానీ, హాంకాంగ్‌లో బాంబూ స్కాఫోల్డింగ్ యుగం ముగింపునకు చేరువలోనే ఉందని నిపుణులు భావిస్తున్నారు.

## దక్షిణ సిరియాలో ఇజ్రాయెల్ దాడి

### కనీసం 10 మంది మృతి

### దళాలపై నిరసన వెల్లువ

**డమాస్కస్:** దక్షిణ సిరియాలోని బెయిత్ జిన్ గ్రామంలో శుక్రవారం జరిగిన దాడిలో ఇజ్రాయెల్ దళాలు కనీసం 10 మందిని హతమార్చాయి. స్థానికులు, సిరియా మీడియాను అనుసరించి, గ్రామంలో కొంతమందిని అరెస్ట్ చేయడానికి ప్రవేశించిన ఇజ్రాయెల్ దళాలపై ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. వారిపై సైనికులు కాల్పులు జరిపారు. ఈ ఘటనల నేపథ్యంలో అనేక కుటుంబాలు ప్రాంతం విడిచి పారిపోయాయి. కాగా, ఇజ్రాయెల్ సైనికాధుల ప్రకటనను ప్రకారం, తమ పౌరులపై దాడులకు కుట్ర చేసిన జమా– ఎ– ఇస్లామియ్యా మద్దతుదారులు ఉన్నారన్న ఇంటెలిజెన్స్ వర్గాలు ఇచ్చిన సమాచారం ఆధారంగా ఆపరేషన్ చేపట్టారు. కాల్పుల్లో ఆరుగురు ఇజ్రాయెల్ సైనికులు గాయపడ్డారు. ప్రతిస్పందనలో ఇజ్రాయెల్ వైమానిక సహాయంతో దాడి చేసి, అనేక మిలిటెంట్లను హతమార్చి, ఇతరులను అదుపులోకి తీసుకుంది. 2024లో బషర్ అల్ అసద్ పతనమైన తర్వాత సిరియాలో ఏర్పడిన కొత్త ప్రభుత్వంపై ఇజ్రాయెల్ అప్రమత్తంగా ఉంది. అప్పటి నుండి ఇజ్రాయెల్, 1974 ఒప్పందంలో ఉన్న యుఎన్ బఫర్ జోన్‌ను స్వాధీన పరుచుకుని, దక్షిణ సిరియాలో అస్త్రాలు లేని ప్రాంతం కోసం ఒత్తిడి చేస్తోంది.

సిరియా అధికారులు ఈ దాడులను తమ భౌగోళిక స్వాధీనంపై దాడిగా ఖండించినప్పటికీ, తాజా దాడిపై వెంటనే స్పందించలేదు. గ్రామాధికారి ప్రకారం, హతులంతా పౌరులే. ఇటీవలి లెబనాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడుల నేపథ్యంలో, ఈ ఘటనలు ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచుతూ, గాజాలోని సున్నితమైన విరమణ ఒప్పందాన్ని కూడా ప్రమాదంలోకి నెడుతున్నాయి. యునైటెడ్ నేషన్స్ ప్రకారం, గత ఏడాది విరమణ తర్వాత లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడుల్లో 127 పౌరులు మరణించారు.

## జైలు అధికారులపై ఇమ్రాన్ సోదరి పిటిషన్



**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను అదియాలా జైల్లో కలుసుకోవడానికి అనుమతించకపోవడంతో, అతని సోదరి అలీమా ఖాన్ ఇస్లామాబాద్ హైకోర్టులో జైలు సూపరింటెండెంట్, ఇతర అధికారులపై పిటిషన్ దాఖలు చేశారు. మార్చి 24న హైకోర్టు ఖాన్‌ను వారంలో రెండు రోజులు (మంగళ, గురువారం) కలుసుకునేఅనుమతిని పునరుద్ధరించింది. కానీ అధికారులు ఈఆదేశాలనుపాటించలేదనిపిటిషన్‌పేర్కొంది. అలీమా, ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిది గురువారం జైలుకి వెళ్లి, కలుసుకునే అనుమతి నిరాకరించడంతో 16 గంటలపాటు ధర్నా నిర్వహించారు. కానీ వారు ఖాన్‌ను కలుసుకోలేకపోయారు. అఫ్రిది, ఇస్లామాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా కలుసుకోలేకపోయిన తరువాత, తన పార్టీ పార్లమెంట్ సమావేశాలు జరగనివ్వబోమని హెచ్చరించారు. సెనేట్‌లో కూడా పిటిఐ సభ్యులు ఖాన్ నిర్బంధంపై నినాదాలు చేశారు. ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం బాగోలేదని వచ్చిన వార్తలను ప్రభుత్వం తిప్పికొట్టి, ఆయనకు ఇతర ఖైదీలకు లేని సౌకర్యాలు ఉన్నాయని తెలిపింది.అఫ్రిది,గతనెల ముఖ్యమంత్రిగా నియమితుడైనప్పటి నుండి ఖాన్‌ను జైలు నుండి విడుదల చేయడానికే ప్రాధాన్యత ఇస్తున్నాడు. కానీ ఇప్పటివరకు అతని అన్ని ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఆయన మరింత నిరసనలు కొనసాగిస్తామని అన్నారు.

## జెలెన్‌స్కీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ మొర్మాక్ ఇంటిపై అవినీతి నిరోధకశాఖ దాడులు



**కీవ్:** ఉక్రేన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ సిబ్బందిలో, అత్యంత కీలకమైన హోదాలో ఉన్న చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఆండ్రియ్ యాండ్రియ్ యెర్మాక్ ఇళ్లు, కార్యాలయంపై అవినీతి నిరోధక సంస్థలు దాడులు జరిపాయి. అంతర్జాతీయ మీడియా నివేదికలను ఉటంకిస్తూ, పిటిఐ తెలిపిన వివరాల ప్రకారం యెర్మాక్‌పై సుమారు 100 మిలియన్ డాలర్లు (సుమారు 895 కోట్ల రూపాయలు)మేర అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇంధన రంగంలో అతను ఈ నేరాలకు పాల్పడినట్టు చెప్తున్నారు. ఈ నేపథ్యంలోనే, ఉక్రేన్ నేషనల్ యాంటీకరప్షన్ బ్యూరో, స్పెషలైజ్డ్ యాంటీకరప్షన్ ప్రాసిక్యూటర్ ఆఫీస్ సంయుక్తంగా దాడులు నిర్వహించాయి. జెలెన్‌స్కీపూర్వవ్యాపార భాగస్వామి తిమూర్ మిం డిచ్‌దర ప్రధాన నిందితుడిగా అనుమానిస్తున్నా రు. తిమూర్ దేశం విడిచి పారిపోగా, ఈ ఆరోపణలతో సంబంధం ఉందన్న విమర్శలు ఎదుర్కొంటున్న ఇద్దరు కీలక మంత్రులు ఇది వరకే రాజీనామా చేశారు. కాగా,తన ఇంటిపై దాడులు జరిగినట్టు యెర్మాక్ ధ్రువీకరించారు. దర్యాప్తు సంస్థలకు తాను పూర్తిగా సహకరిస్తున్నానని తెలిపారు. ఇలా వుంటే, ఇటీవల వెలుగులోకి వచ్చినఅవినీతి విచారణలు జెలెన్‌స్కీపై అంతర్గత ఒత్తిడిని పెంచాయి. ముఖ్యంగా అమెరికా, యూరోపియన్ యూనియన్ నుండి యుద్ధ సహాయం కొనసాగించేందుకుప్రయత్నిస్తున్న సమయంలో ఈఆరోపణలువెలుగు చూడడం అతనిని ఇబ్బందులకు గురి చేసే అవకాశం ఉంది. అవినీతిని అరికట్టాలని ఉక్రేన్‌కు యూరోపియన్ యూనియన్ స్పష్టం చేసింది. యెర్మాక్ 2020 నుంచి జెలెన్స్కీ ముఖ్య సహాయకుడిగా ఉన్నాడు. 2022 లో రష్యా దాడి తర్వాత జరిగిన ప్రతి విదేశీ పర్యటనలో అధ్యక్షుడితో ఉన్నాడు.

## నైజీరియన్ల భారీ కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

వేస్తోంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో తెలంగాణ ఈగల్ టీమ్, ఎన్‌సిబి, ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు సంయుక్తంగా జరిపిన ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. న్యూఢిల్లీలోని 20 ప్రాంతాల్లో.. గడువు తీరిన 50 మందికిపైగా నైజీరియన్లు ఉంటున్నట్లు గుర్తించింది. వారిని ఈ టీమ్ అదుపులోకి తీసుకుంది. నోయిడా, గ్వాలియర్, విశాఖపట్నం తదితర నగరాల్లో ఈ డ్రగ్స్‌తో సంబంధాలు ఉన్న కీలక నిందితులను అరెస్ట్ చేసింది. నాలుగు ప్రాంతాల్లో 5,340 ఎక్స్ సిటీ మాత్రలు, 250 గ్రాముల కొకైన్, 109 గ్రాముల హెరాయిన్, 250 గ్రాముల మెథాంఫెటమైన్‌ను సీజ్ చేసింది. ఢిల్లీలోని 59 మ్యూల్ ఖాతాలతోపాటు 16 డ్రగ్స్ కేంద్రాలను గుర్తించింది. ఇక నైజీరియాకు చెందిన 107 బ్యాంకు ఖాతాలు ఈగల్ టీమ్ స్తంభింపజేసింది. మల్నాడు రెస్టారెంట్, మహీంద్రా యూనివర్సిటీ కేసులో నైజీరియన్ నిక్‌ను అరెస్ట్ చేసింది. దేశవ్యాప్తంగా ఈ ముఠాతో దాదాపు 2 వేలకు పైగా డ్రగ్స్ వినియోగదారులు,పెడ్లర్లు ఉన్నట్లు ఈగల్ టీం గుర్తించింది. ఢిల్లీ నుంచి డ్రగ్స్ పార్శిళ్లు.. బూట్లు, దుస్తులు, కాస్మోటిక్ వస్తువులు, చెప్పులు మధ్యలో డ్రగ్స్ పెట్టి కొరియర్ ద్వారా సప్లై చేసినట్లు పోలీసులు దర్యాప్తులో వెల్లడైంది. శ్రీ మారుతి కొరియర్స్, డిటిడిసి, ప్రొఫెషనల్ కొరియర్స్, షిప్ రాకెట్, ఇండియా పోస్ట్, ఢిల్లీవేరీ, బ్లూ డార్ట్, ట్రాక్ ఆన్ తదితర కొరియర్స్ నెట్‌వర్క్‌ను ఈ నైజీరియన్ ముఠా ఉపయోగించినట్లు ఈ కేసు విచారణలో బహిర్గతమైంది. మరికొద్ది రోజుల్లో నూతన సంవత్సర వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో డ్రగ్స్ కంట్రోల్‌కు ఈగల్ టీమ్ భారీ ఆపరేషన్ చేపట్టింది. ఈ సందర్భంగా అంతర్జాతీయ డ్రగ్స్ ఆపరేషన్‌ను ఛేదించింది. ఢిల్లీలో అరెస్ట్ చేసిన 50 మందిని హైదరాబాద్‌కు తరలించేందుకు ఈ టీమ్ ఇప్పటికే చర్యలు చేపట్టింది. వీరిని హైదరాబాద్కు తరలించిన తర్వాత కోర్టులో హాజరుపరచనుంది. అనంతరం వీరిని మరింత లోతుగా విచారణ జరపనుందని తెలుస్తోంది. ఈ విచారణలో మరిన్నీ కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని ఈగల్ టీమ్ భావిస్తోంది. ఈ విచారణలో వీరు చెప్పే కీలక ఆధారాలతో మరిన్ని అరెస్ట్‌లు జరిగే అవకాశం ఉందని సమాచారం.

## ప్రముఖులకు ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

లుడ్విగ్ హెయిన్జెల్మాన్, ఎన్రిషన్ వ్యవస్థాపక భాగస్వామి డబ్ల్యూ విన్స్టన్, మాండల్ వైల్ లైఫ్ గ్రూప్ సిఈఓ బెనెట్ నియోతో పాటు పలు టెక్ కంపెనీల సిఈఓలు, పెట్టుబడిదారులు, స్టార్టప్ ఫౌండర్లు ఈ సదస్సుకు హాజరవుతున్నారు. తెలంగాణ ప్రగతి సంక్షేమాన్ని, అన్ని రంగాల్లో సాధించిన అభివృద్ధిని ప్రపంచానికి పరిచయం చేసేందుకు ఈ వేదికను అద్భుతంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రపంచం నలుమూలాల నుంచి పెట్టుబడులను ఆకర్షించటంతో పాటు గ్లోబల్ ఇన్నోవేషన్ దిశగా తెలంగాణకు ఉన్న అనుకూలతలను చాటిచెప్పాలని సంకల్పించింది.

### మెస్సీ కిక్‌తో ముగింపు

రెండు రోజుల పాటు జరిగే సదస్సులో డిసెంబర్ 9న 'తెలంగాణ రైజింగ్–2047 డాక్యుమెంట్'ను ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారు. ఈనెల 13న ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లయనల్ మెస్సీ హైదరాబాద్‌కు రానున్నారు. ఆయన పాల్గొనే వేడుకలోనే ప్రత్యేక ఫుట్‌బాల్ మ్యాచ్ నిర్వహిస్తారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సుకు ఇది ప్రత్యేక ఆకర్షణగా, ముగింపు ఘట్టంగా నిలుస్తుంది.

## జిల్లాలకు సిఎం

(మొదటి పేజీ తరువాయి)

నర్సంపేట, 6వ తేదీన నల్గొండ జిల్లా దేవరకొండలో జరిగే బహిరంగ సభలకు ముఖ్యమంత్రి హాజరవుతారు. సిఎం పాల్గొనే బహిరంగ సభలకు భారీ ఏర్పాట్లకు, పెద్ద ఎత్తున ప్రజా సమీకరణకు కాంగ్రెస్ పార్టీ చర్యలు చేపట్టింది. కాగా జిల్లాలలో సిఎం బహిరంగ సభలకు సబంధించిన ఏర్పాట్లను సంబంధిత జిల్లాల మంత్రులు, ఎంఎల్‌ఎలు, సంబంధిత ప్రభుత్వ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటన పట్టణ ప్రాంతాలకే పరిమితం అవుతుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## లొంగిపోతాం

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. మా మిత్రుల మధ్య సంబంధాలు ఏర్పరచుకుని సమాచారాన్ని మరింత వేగవంతం చేయడానికి భద్రతా దళాల కార్యక్రమాలు విరోధంగా మారాయని అందుకే భద్రతా దళాల కార్యకలాపాలను నిలిపివేయాలని కోరుతున్నామని లేఖలో పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో సతీష్‌దాదా, మహారాష్ట్రలో సోనుదాదా విషయంలో జరిగినట్లుగా ముఖ్యమంత్రి లేదా హోంమంత్రి అప్పగించి ప్రధాన స్రవంతిలో చేరతామని ఈ ప్రక్రియ శాంతియుతంగాపూర్తి చేయడంలో మాకు ఉత్తమ మద్దతు అందించే రాష్ట్ర ప్రభుత్వం ఎదుట లొంగిపోతామన్నారు. పైన పేర్కొన్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు జనవరి ఒకటి 2026 వరకు ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా చూడాలని ఈ సమయం మాకు అవరమని వారు లేఖలో పేర్కొన్నారు. రేడియో ద్వారా ఛత్తీస్‌గఢ్ హోంమంత్రి విజయ్ ప్రసంగం విన్నామని 10 నుంచి 15 రోజుల సమయం సరిపోదాన్నారు. నిర్దిష్టప్రతిపాదనలు, డిమాండ్లు చేయాలనుకుంటే ప్రభుత్వం వాటిని నెరవేర్చేందుకు ప్రయత్నిస్తుందన్న ప్రకటనను కూడా మావోయిస్టు పార్టీ స్వాగతిస్తుందని ప్రధాన స్రవంతిలో చేరేటప్పుడు ఆ డిమాండ్లను పత్రిక ప్రకటనలో విడుదల చేస్తామని మావోయిస్టులు లేఖలో పేర్కొన్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు కూడా స్పందించాలని స్పందన కోసం ఎదురు చూస్తున్నామన్నారు.ఈప్రక్రియమొత్తం సుఖాం తం అయ్యేంత వరకు మావోయిస్టు సహచరులంతా కార్యకలాపాలను నిలిపి వేయాలని అంతరాయం కలిగించే ఎటువంటి పనులు చేపట్టవద్దని లేఖలో పేర్కొన్నారు. ఈ దఫా పీపుల్స్ లేబరేషన్ గెరిల్లా ఆర్మీ (పిఎల్‌జిఏ) వారోత్సవాలను సైతం నిర్వహించవద్దని ఆ లేఖలో తెలిపారు. భద్రతాదళాల గస్తీని ఈ జోన్‌లో నిలిపివేయాలని ఈ ప్రకటన ఒకరి నుంచి మరొకరికి చేరేందుకు సహకారంఅవసరమన్నారు.అంతేకాకుండా మా వోయిస్టు పార్టీకి చెందిన ఎంఎంసి సభ్యులందరూ బహిరంగంగా సంప్రదించడానికి బావోసింగ్ ఒక ఓపెన్ ఫ్రీక్వెన్సీ నెంబర్‌ను మావోయిస్టులు విడుదల చేశారు. 435.715 ద్వారా సంప్రదించవచ్చునని 2026 జనవరి ఒకటిన ఒకరితో ఒకరం కలిసే అవకాశం ఉందని లేఖలో తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు జర్నలిస్టులు,ప్రజాప్రతినిధులుసహకరించాలని ఇం తకుముందులొంగిపోయినసోను,సతీష్‌లు కూడా మూడు రాష్ట్రాల ప్రభుత్వాలతో సంప్రదించి ఈ ప్రక్రియ పూర్తిగా శాంతియుతంగాజరిగేలా చూడాలని లేఖలో మావోయిస్టులుఅభ్యర్థించారు.అంతేకాకుండా సాయంత్రం ప్రాంతీయ వార్తల్లో మేము విడుదల చేసిన ఆడియోను రేడియోలో ప్రసారం చేయాలన్నారు.

## రికార్డులు బద్దలు

(మొదటి పేజీ తరువాయి)

రూ.151.25 కోట్లు, 16వ నెంబర్ ప్లాట్‌లో ఎకరానికి రూ.147.5 కోట్ల ధర పలికింది. దీంతో ప్రభుత్వ ఖజానాకు రూ.1352 కోట్ల ఆదాయం సమకూరనుంది. గతవారం ఇదే లేఔట్‌లో రూ.137.25 కోట్లుగా ధర పలికిన విషయం తెలిసిందే. ఎదురుచూపుల్లో ఉన్న రెండో విడత నియోపొలిస్ ఈఆక్షన్‌లు నవంబర్ 28, 2025న విజయవంతంగా పూర్తయ్యాయి. నవంబర్ 24న జరిగిన తొలి విడతలో వెలువడిన అద్భుత ఫలితాలను మరింత అధిగమించిన ఈ ఆక్షన్‌లు, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో నియోపొలిస్‌ను అత్యంత విలువైన భూభాగంగా నిలబెట్టాయి. ఈ విడతలో 4.03 ఎకరాల 15వ ప్లాట్, 5.03 ఎకరాల 16వ ప్లాట్లను వేలానికి ఉంచారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన బిడ్డింగ్ సాయంత్రం 6.30 గంటల తర్వాత కూడా తీవ్ర పోటీతో కొనసాగింది. ప్రముఖ అభివృద్ధిదారులు పోటీపడటంతో వేలం ఉత్సాహంగా సాగింది.

- 4.03 ఎకరాల 15వ ప్లాట్ ఎకరాకు రూ.151.25 కోట్లు నమోదుచేసి రికార్డు సృష్టించింది. ఈ ప్లాట్‌లను లక్ష్మి నారాయణ గుమ్మడి, కర్తీశ్ రెడ్డి మద్దుల, శరత్ వెంట్రప్రగడ, శ్యామ్ సుందర్ రెడ్డి వంగల కైవసం చేసుకున్నారు. 5.03 ఎకరాల 16వ ప్లాట్ ఎకరాకు రూ. 147.75 కోట్లు పలికి గోద్రెజ్ ప్రాపర్టీస్ లిమిటెడ్ సొంతం చేసుకుంది.
- ఈ రెండు ప్లాట్ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు మొత్తం రూ.1352 కోట్లు లభించాయి. మొదటి విడతతో కలిపి ఇప్పటి వరకు నియోపొలిస్ ఈఆక్షన్‌ల ద్వారా మొత్తం ఆదాయం రూ.2708 కోట్లకు చేరింది.
- నియోపొలిస్‌లో సగటు ఎకరా విలువ రూ.142.83 కోట్లకు పెరగడం హైదరాబాద్ భూ మార్కెట్‌లో అత్యంత వేగంగా నమోదవుతున్న పెరుగుదలగా పరిశ్రమ వర్గాలు అభివర్ణిస్తున్నాయి. వరుసగా రెండు విడతల్లో రికార్డు స్థాయి ధరలు నమోదవడం, ఈ ప్రాంతాన్ని దేశవ్యాప్తంగా ప్రముఖ డెవలపర్లకు ప్రాధాన్య గమ్యస్థానంగా నిలబెట్టింది. డిసెంబర్ 03న నియోపొలిస్‌తో, డిసెంబర్ 5న గోల్డెన్ మైల్‌లో జరగనున్న తదుపరి ఈఆక్షన్‌లు కూడా భారీ ఆసక్తిని రాబట్టే అవకాశముందని హెచ్ఎండిఏ అధికారులు అంచనా వేస్తున్నారు.

### తదుపరి వేలంపై అంచనాలు..

- రెండు రౌండ్‌లలో అద్భుతమైన ఫలితాలు రావడంతో, త్వరలో జరగబోయే వేలంపై అంచనాలు భారీగా పెరిగాయి.
- డిసెంబర్ 3న నియోపోలిస్‌లో తదుపరి ఈ వేలం నిర్వహించనున్నారు.
- డిసెంబర్ 5న గోల్డెన్ మైల్‌లో ఈవేలం.
- ఈ వేలం కూడా డెవలప్‌మెంట్ వర్గం నుంచి అంతే బలమైన ఆసక్తిని ఆకర్షిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

## సర్పంచ్ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో బిసిలు పోటీ చేసి సత్తా చాటాలి

**బిసి ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రస్తుతం జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల్లో అన్ని జనరల్ స్థానాలలో బిసిలు పోటీ చేసి గెలిచి తమ సత్తా చాటాలని బిసి ఇంటలెక్చువల్స్ ఫోరమ్ చైర్మన్ టి.చిరంజీవులు(రిటైర్డ్ ఐఎఎస్) అన్నారు. ఆ దిశగా తెలంగాణ రాష్ట్రంలోని బిసి,ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ ప్రజలు కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో బిసిలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పి, ఇప్పుడు మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడం పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించలేదని ఆయన విమర్శించారు. 42 శాతం బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చి రాజ్యాంగ రక్షణ కల్పించిన తర్వాతనే ఎన్నికలు కల్పిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించి, అసెంబ్లీలో బిల్లులు ఆమోదించడంతో పాటు కేంద్ర ప్రభుత్వానికి కూడా పంపి ఆ బిల్లును చట్టంగా రూపొందించడానికి కనీస కార్యాచరణ చేపట్టలేదన్నారు. హైకోర్టు, నిధుల విడుదల సాకుగా చూపించి ఎన్నికలు నిర్వహిస్తామని సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలోని అనేక జిల్లాలలో బిసిలకు దక్కవలసిన కనీసం 22శాతం సర్పంచ్ సీట్లు కూడా దక్కకుండా కుట్రపూరితంగా తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న సర్పంచ్ ఎన్నికలు బిసిలకు రిజర్వేషన్లు అత్యంత తక్కువగా అమలవుతున్నాయని ఆవేద వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బిసిల జనాభా ప్రతి గ్రామంలో 50 శాతం పైనే ఉంటుందని, బిసిలకు రాజకీయ రిజర్వేషన్లలో జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ తమ సత్తా చాటుతూ సర్పంచులుగా గెలిచి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని టి.చిరంజీవులు పిలుపునిచ్చారు.

## చదరపు కిలోమీటర్లు

(మొదటి పేజీ తరువాయి)

ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. ఔటర్ లోపల, ఆనుకొని ఉన్న స్థానిక సంస్థల ప్రస్తుత పరిస్థితుల అంచనాకు సంబంధించిన సమాచారం (మ్యాపులు, జనాభా, వార్డులు, ఓటర్లు) పురపాలక శాఖ ఇప్పటికే సేకరించింది. ప్రస్తుత 650 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో పోలిస్తే, మెగా జిహెచ్ఎంసి 2 వేల చదరపు కిలోమీటర్లకు పైగా ఉండనుంది. మెరుగైన పాలనా సౌలభ్యం కోసం ఒకే కార్పొరేషన్‌గా చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లుగా తెలుస్తోంది. ఆర్థిక వనరులు, మౌలిక సదుపాయాలు, జనాభాలో సమతుల్యత ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని భావిస్తున్నారు. ప్రస్తుత జిహెచ్ఎంసి పాలకమండలి గడువు వచ్చే ఫిబ్రవరి 10వ తేదీ వరకు ఉంది. అలాగే అధికారులు న్యాయపరమైన అంశాల పరిశీలిస్తున్నారు. విలీన ప్రతిపాదనపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించే బాధ్యతను సిజిజి జిహెచ్ఎంసి అప్పగించింది. ప్రస్తుతం ఉన్న 30, కొత్తగా చేరే 27 సర్కిళ్లు కలిపి మొత్తం 57 సర్కిళ్లు ఆరు జోనల్ కార్యాలయాల కింద పని చేయనున్నాయి. రెండు నెలల య్యాక జోన్‌ల సంఖ్యను పెంచడంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. విశాల నగరంలో పరిపాలన ఎలా ఉండాలి. జోన్‌లు, సర్కిళ్ల సంఖ్య, ఏయే స్థాయిల్లో ఏ హోదా అధికారులు ఉండాలి, మొత్తం నగరానికి ఏ స్థాయిలో ఎంత మంది అధికారులు అవసరం, వారి అధికారాలు, కర్తవ్యాలు, ఇతరత్రా మార్గదర్శకాలతో సిజిజి త్వరలో నివేదిక ఇవ్వనుందని అధికారులు చెప్పారు.

### విలీన ఉత్తర్వులు అందగానే ఫైళ్ల స్వాధీనం..

జిహెచ్ఎంసిలో శివారు మున్సిపల్ సంస్థలకు సంబంధించిన ఉత్తర్వులు విడుదల కాగానే అధికారులు ఆయా మున్సిపాలిటీల్లో ఫైళ్లను స్వాధీనం చేసుకోనున్నారు. శివారు ప్రాంతాల జోన్‌లు, సర్కిళ్లకు విలీనం అయ్యే మున్సిపాలిటీల బాధ్యతలను అప్పగించనున్నారు. ఆర్థిక లావాదేవిలకు సంబంధించిన అంశాలను ఫ్రీజ్ చేస్తారు. పౌర సేవలను యధావిధిగా కొనసాగించనున్నారు. విలీన ప్రక్రియ కొలిక్కి వచ్చిన నిర్ణయాలు తీసుకోనున్నారు. గతంలో ఎంసిహెచ్‌లో విలీనం ఆదేశాలు రాగానే అప్పటి ఎంసిహెచ్ అధికారులు ఆయా మున్సిపాలిటీల్లోని కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఇంజనీరింగ్ పనులకు సంబంధించిన రికార్డులు, ఆస్తి పన్ను, చెక్కులు, నిధుల వ్యవహారాలకు సంబంధించిన పత్రాలన్నింటిని ఆధీనంలోకి తీసుకున్నారు. మున్సిపాలిటీ అధికారులు రెండు నెలలపాటు మునిపటిలాగే పౌరులకు సేవలందించాయి. అప్పటి వరకు ఎంసిహెచ్ పరిధికి ఓ కమిషనర్, ఏడు సర్కిళ్లకు ఏడుగురు ఉప కమిషనర్లు ఉండేవారు. విలీనం అనంతరం 12 మున్సిపాలిటీలను, 7 సర్కిళ్లను కలిపి 18 సర్కిళ్లుగా చేశారు. ఆ సర్కిళ్లపై పర్యవేక్షణకు ఐదు జోన్‌లు ఏర్పాటయ్యాయి. తర్వాత ఆరు జోన్‌లుగా, 30 సర్కిళ్లకు పెరిగాయి. నగర విస్తీర్ణం 172చదరపు కిలోమీటర్ల నుంచి 650 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. హైదరాబాద్, సికింద్రాబాద్ మున్సిపాలిటీల విలీనంతో 1955లో మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ (ఎంసిహెచ్) ఏర్పాటైంది. నాటి చట్టమే కాలానుగుణంగా సవరణలు జరుగుతూ ఇప్పటికీ అమలవుతోంది. 2007లో రంగారెడ్డి, మెదక్ జిల్లాల పరిధిలోని ఎల్.బి.నగర్, గడ్డిఅన్నారం, ఉప్పల్, మల్కాజిగిరి, కాప్రా, అల్వాల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, రామచంద్రాపురం, పటాన్‌చెరు మున్సిపాలిటీలను, పలు గ్రామాలను ఎంసిహెచ్‌లో విలీనం ద్వారా గ్రేటర్ హైదరాబాద్‌గా మహానగరపాలక సంస్థను ఏర్పాటు చేశారు.

## సిఎం ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

సమర్థంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పని చేయాలని సీఎం సూచించారు. ఈ క్రమంలో వరంగల్ కాళోజీ వర్సిటీ విసి రాజీనామా చేసినట్లు తెలిసింది. కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వీసీపై వచ్చిన ఆరోపణలపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేయగా రాజీనామా చేసినట్టు తెలిసింది. యూనివర్సిటీలో డబ్బులు తీసుకొని రీకౌంటింగ్ సో నలుగురికి మార్కులు కలిపారని విజిలెన్సు విచారణలో ప్రాథమికంగా తేలింది. నోటిఫికేషన్లు లేకుండా సిబ్బంది నియామకం అంశం, బిఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు గవర్నర్ కు ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వానికి మరక అంటొద్దనే ఉద్దేశంతో రాజీనామా చేసినట్టు తెలుస్తోంది.కాగా కాళోజీ వర్సిటీ వీసీ నందకుమార్ రెడ్డి రాజీనామా విషయం ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాడిన మహాత్మ జ్యోతిరావు

మంత్రి వాకిటి శ్రీహరి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సామాజిక సమానత్వానికి, విద్యా హక్కుకు, అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం పోరాడిన మహాత్మ జ్యోతిరావు పూలే సేవలను రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ కొనియాడారు. మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన నివాళులు అర్పించి, స్మరించుకున్నారు. పూలే వర్ధంతి సందర్భంగా మంత్రి ఒక ప్రకటనలో పూలే ఆలోచనలను నేటి సమాజానికి మార్గదర్శకమని అభివర్ణించారు. అణచివేతకు గురైన వర్గాలకు విద్య అనే అస్త్రాన్ని అందించి, వారి జీవితాలను వెలుగులోకి తీసుకువచ్చిన మహానుభావుడు పూలే అని అన్నారు. మహిళల విద్య, సామాజిక సంస్కరణల కోసం ఆయన చూపిన నిబద్ధత నేటికీ మనకు ప్రేరణ. సమానత్వం, న్యాయం అనే విలువలను స్థిరపరిచేందుకు ఆయన చేసిన కృషి భారత చరిత్రలో అజేయంగా నిలుస్తుందన్నారు.

# 4 లేబర్ కోడ్‌లను అమల్లోకి తేవటం తీవ్ర అన్యాయం

ఎఐటియుసి సీనియర్ నాయకులు వి.యస్.బోస్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** నరేంద్ర మోది ప్రభుత్వం కార్మికవర్గాన్ని మభ్యపెట్టి అసత్య ప్రచారాలతో 4 లేబర్ కోడ్‌లను అమల్లోకి తీసుకురావటం తీవ్ర అన్యాయమని ఎఐటియుసి సీనియర్ నాయకులు వి.యస్.బోస్ అనారు. హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో శుక్రవారం ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యం.డి. యూసుఫ్ అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లలో హైర్ అండ్ ఫైర్ సిస్టం స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ కార్మికులకు మంచి జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన అవసరం కార్మికవర్గానికి ఎంతైనా ఉందన్నారు. అసంఘటిత రంగ కార్మికులు యూనియన్ ఏర్పాటు చేసుకునే సందర్భంలో ట్రేడ్ యూనియనిస్టులను యూనియన్ నాయకులుగా ఎన్నుకోవటం ద్వారా కార్మికులకు చట్టాలను అమలు చేయించేందుకు అవకాశం ఉంటుందని, కానీ ప్రస్తుత కోడ్‌లలో ఆ నిబంధనలను తొలగించటం జరుగుతుందన్నారు. గతంలో 10 మంది కార్మికులుంటే చట్టాలు అమలు చేయాల్సివుండగా దానిని 20 మందికి పెంచటం, 100 మంది ఉంటే అమలయ్యే చట్టాలను 200 మందికి పెంచటం వలన పారిశ్రామికవర్గానికి ఎక్కువ లాభం చేకూర్చే అవకాశం ఉన్నదని తెలియజేశారు. ఎఐటియసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్ మాట్లాడుతూ కార్మిక హక్కుల సాధన కోసం రాష్ట్రంలో ఉన్నటువంటి అన్ని రంగాల కార్మికులను సమీకరించి ఉద్యమాలు నిర్వహించాలని, రోజు రోజుకు కాంట్రాక్టు కార్మికుల సంఖ్య పెరుగుతూ వారి కనీస వేతనం మాత్రం చట్టం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల బేసిక్ వేతనం ఉండాల్సివుండగా దానిని అమలు చేయకపోవటం తీవ్ర అన్యాయమన్నారు. అసంఘటితరంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అడుగుతున్నప్పటికీ పట్టించుకోవటం లేదని మండిపడ్డారు. రానున్న రోజుల్లో కార్మికవర్గాన్ని చైతన్యం చేసి హక్కుల సాధనకై పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా పిలుపిచ్చారు. రాష్ట్రంలో ఉన్నటువంటి వివిధ స్కీంలలో వేలాది మంది ఉద్యోగులు కనీస వేతనానికి నోచుకోకుండా ఉన్నారని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఆటో కార్మికులకు రూ.12వేలు ఇవ్వాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేల కనీస వేతనం చెల్లించాలని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ప్రైవేటీకరణను అరికట్టాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి యం.నర్సింహ్మా, రాష్ట్ర కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, బి.వెంకటేశం, ఎస్.విలాస్, ఎన్.కరుణ కుమారి, ఉపాధ్యక్షులు కె.ఏసురత్నం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మారగోని ప్రవీణ్ కుమార్, కె.రవిచంద్రన్, గన్నారపు రమేష్, హాసీనాబేగం, జిల్లా కార్యదర్శులు కమ తం యాదగిరి, మేకల దాసు, బోగే ఉపేందర్, కడారి సునీల్, కడారి రాములు, శ్రీనివాస్, కిష్టాపురం లక్ష్మ ణ్, అజ్జ వేణు ప్రసంగించారు.


## ఇవిఎం తనిఖీ కోసం ఒక్క దరఖాస్తూ రాలేదు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జూబ్లిహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల్లో వినియోగించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం (ఇవిఎం)లను తనిఖీ చేసి ధృవీకరించాలంటూ అర్హులైన అభ్యర్థుల నుంచి ఏ ఒక్క వ్రాతపూర్వక దరఖాస్తు కూడా అందలేదని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాల ప్రకటన అనంతరం అత్యధిక ఓట్లు పొందిన అభ్యర్థి తరువాత రెండో లేదా మూడో స్థానాల్లో నిలిచిన అభ్యర్థులు కోరిన పక్షంలో, మొత్తం ఇవిఎంలలో 5 శాతం వరకు బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వివిపాట్‌లను తయారీ సంస్థల ఇంజినీర్ల బృందం ద్వారా తనిఖీ చేసి ధృవీకరించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఇందుకోసం ఫలితాల తేదీ నుంచి ఏడు రోజులలోపు వ్రాతపూర్వకంగా దరఖాస్తు చేయాల్సి ఉంటుందని వివరించారు. ఫలితాలు ప్రకటించిన 14వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఉన్న నిర్ణీత గడువు సమయంలో జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారికి ఎలాం టి దరఖాస్తులు రాకపోవడం స్పష్టమైందన్నారు. ఎన్నికల నిర్వహణ మొత్తం భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, విధి నియమాలు, భద్రతా ప్రమాణాల ప్రకారమే పూర్తిస్థాయిలో పారదర్శకంగా సాగిందని, ఈ వ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత బలపడేలా అన్ని చర్యలు తీసుకున్నామని సిఇఒ పేర్కొన్నారు.

## దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి

సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరహా దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టి, జానాభా దామాషా ప్రకారం అన్ని వర్గాల ప్రజలకు, అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ అన్నారు. 'మహాత్మ జ్యోతిభా పూలే 135వ వర్ధంతి' సందర్భంగా సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో అంబర్‌పేట, అలీ కేఫ్ వద్ద ఉన్న జ్యోతిభా పూలే విగ్రహానికి రామకృష్ణ శుక్రవారం పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా ప్రాతిపాదికన బిసిలకు విద్యా, ఉద్యోగ అవకాశాలను, చట్టసభలలో రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి ప్రత్యేక పార్లమెంటు సమావేశాన్ని ఏర్పాటు చేసి, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని రాజ్యంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. దేశంలో సామాజిక పరిస్థితులలో కొనసాగుతున్న దోపిడి వర్గ ఆధిపత్యానికి వ్యతిరేకంగా అట్టడుగు వర్గాల ప్రజలకు సమానత్వ సాధన కోసం జ్యోతిభా పూలే పోరాటం చేశారని గుర్తు చేశారు. అంటరానితనం, సామాజిక వివక్ష భూస్వాముల ఆగడాలను, నిరసిస్తూ అవిశ్రాంతంగా ఉద్యమించారన్నారు. వేల సంవత్సరాలుగా విద్యకు దూరంగా ఉన్న వర్గాల ప్రయోజనాల కోసం అందరికీ విద్య అందించాలని ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం నియమించిన హంటర్ కమిషన్‌కు జ్యోతిభా పూలే నివేదికను సమర్పించారని వివరించారు. తన భార్య సావిత్రి బాయి పూలేకు చదువు నేర్పించి, ఆమె ద్వారా అనేక పాఠశాలలు నెలకొల్పి చదువుకు దూరంగా నెట్టబడిన ప్రజలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో పూలే కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి మారపాక అనిల్, సిపిఐ అంబర్ పేట్ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కాశన్న, ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీమాన్, సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆరుట్ల రాజ్ కుమార్, గ్యార నరేష్,అనిల్ కుమార్, ఎఐఎస్‌ఎఫ్ ఒయు అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పల ఉదయ్ కుమార్, లెనిన్, భవన నిర్మాణ కార్మికులు లింగ స్వామి, చెన్నీష్, నాగభూషణం, చెన్నయ్య, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ దీక్ష.. ఓ నాటకం

'దీక్ష దివస్' పేరుతో ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమవుతున్న బిఆర్‌ఎస్

రాజకీయ ఉనికి కోల్పోతుండడంతో మరో కొత్త డ్రామా

టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజకీయ ఉనికిని కోల్పోతున్న బిఆర్‌ఎస్ మరో కొత్త డ్రామాకు తెరదీసిందని, 'దీక్ష దివస్' పేరుతో ప్రజలను మోసం చేయడానికి బిఆర్‌ఎస్ సిద్ధమైందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్‌కుమార్ అన్నారు. బిఆర్‌ఎస్ బూటకపు మాటలను నమ్మవద్దని తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పరిపాలన, అభివృద్ధిపై చర్చకు సిద్ధమని ఆయన చెప్పారు. గాంధీభవన్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ 2009లో కెసిఆర్ చేసిన దీక్ష పూర్తిగా నాటకమని, కెసిఆర్ దీక్ష వల్ల తెలంగాణ రాష్ట్రం రాలేదని, విద్యార్థుల ఆత్మబలిదానాలకు స్పందించిన సోనియా గాంధీ వల్ల తెలంగాణ వచ్చిందన్నారు. 'రాష్ట్రం కోసం దీక్ష చేస్తున్నా' అని కెసిఆర్ ప్రకటించి నిమ్స్ ఆసుపత్రిలో ఫ్లూయిడ్స్ తీసుకున్నారని, ఇందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని, కెటిఆర్ ఒక్కసారి వాటిని చదవాలని సూచించారు. తెలంగాణ అమరుల శవాలపై కెసిఆర్ అధికారం అనుభవించారన్నారు. బిఆర్‌ఎస్ నేతలకు చిత్తశుద్ధి ఉంటే ముందుగా ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరులకు నివాళులు అర్పించాలన్నారు. నిజమైన దీక్షకు మయన్మార్ ఐరన్ లేడీ ఇరోమ్ షర్మిలా 16 ఏళ్ల నిరాహార దీక్షే ఉదాహరణ అని, షర్మిల దీక్షకు కెసిఆర్ దీక్షకు 'నక్కకు నాగలోకానికి' ఉన్న తేడా ఉందని ఆయన పేర్కొన్నారు. బిఆర్‌ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్ బయటికి వస్తే ప్రజలు అసహించుకునే పరిస్థితి ఏర్పడిందని, బిఆర్‌ఎస్ ముగిసిన శకం అని కెసిఆర్ స్వయంగా అర్థం చేసుకున్నారన్నారు. ప్రజా సెంటిమెంట్‌ను రాజకీయ లాభం కోసం వాడుకుని కెసిఆర్ కుటుంబమే లబ్ధి పొందిందన్నారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత అవాంచనీయ ఘటనలు జరగకుండా కాపాడిన అప్పటి సిఎం కిరణ్ కుమార్ రెడ్డి రాజకీయ చాణక్యమని ఆయన గుర్తు చేశారు. ఉద్యమంలో పాల్గొన్న పేదలు, విద్యార్థులు, ఎస్‌సిలు, ఎస్‌టిలు ఆత్మత్యాగం చేసుకున్నారని, వారి త్యాగాల వల్ల వచ్చిన రాష్ట్రాన్ని కెసిఆర్ కుటుంబం పదేళ్లు దోచుకుందన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల మాదిరిగానే స్థానిక ఎన్నికల్లో బిఆర్‌ఎస్ ఓడిపోవడం ఖాయమన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని, బిసి రిజర్వేషన్లపై ప్రతిపక్ష బిఆర్‌ఎస్, బిజెపి ప్రజా ప్రతినిధులను నిలదీయాలని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు.

## లక్ష్మ ణ్ అప్పటికి పుట్టలేదు

టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాహుల్ గాంధీ ఇంట్లో మూడు ఎంపి సీట్లు అవసరమా అని బిజెపి ఎంపి, ఒబిసి ఛైర్మన్ లక్ష్మ ణ్ చేసిన వ్యాఖ్యలపై జగ్గారెడ్డి మండి పడ్డారు. ఈ మేరకు గాంధీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర చరిత్ర లక్ష్మ ణ్‌కు తెలియదని అప్పగికి ఆయన పుట్టలేదని జగ్గారెడ్డి విమర్శించారు. స్వాతంత్ర ఉద్యమంలో దేశానికీ రాహుల్ గాంధీ కుటుంబం ఆస్తులు ఇచ్చిందన్నారు. ఈ ధైర్యం మీ దగ్గర ఉందా..? అని లక్ష్మ ణ్‌ను సూటిగా ప్రశ్నించారు. నెహ్రూ ప్రధాని అయ్యాక దేశ ప్రజలు కడుపు నిండా తిండి పెట్టాలని..వ్యవసాయం అభివృద్ధి గురించి ఆలోచించారని గుర్తు చేశారు. దేశంలో ఎఫ్‌సిఐ ఏర్పాటు చేసి... కరువు వచ్చినా పేదలకు నెహ్రూ అన్నం పెట్టే ఆలోచన చేశారన్నారు. దేశ స్వతం త్ర ఉద్యమంలో కానీ... దేశ నిర్మాణం లో కానీ మోదీ.. అమిత్ షా పాత్ర ఏమైనా ఉందా..? అని నిలదీశారు. ఇందిరాగాంధీ దేశంలో ఉన్న పెత్తందారు భూము లు పేదలకు పంచిందన్నారు. పల్లెలకు బ్యాంకులను తెవడమేగాక ఐడిపిఎల్ బిడిఎల్ లాంటి కంపెనీలు తెచ్చింది కాంగ్రెస్ అని తెలిపారు. ఎక్కడైనా బిజెపి ఇలాంటి కంపెనీలు తెచ్చింది అని చెప్పగలుగుతారా.? ఆ ధైర్యం మీకు ఉందా అని నిలదీశారు. రాజీవ్ గాంధీ ప్రధాని అయ్యక 18 ఏండ్లకే ఓటు హక్క ఇచ్చారన్నారు. దేశంలో ఐటి అభివృద్ధికి రాజీవ్‌గాంధీ ఆలోచనలే కారణమన్నారు. హైటెక్ సిటీ డిజైన్ అంతా రాజీవ్ గాంధీ టెక్నాలజీ నుండే తెచ్చారన్నారు. కర్ణాటక, హైదరాబాద్‌లో ఐటి టెక్నాలజీ ఇలా ఉంది అంటే రాజీవ్ గాంధీ వల్లనే సాధ్యమైందన్నారు. ఇలాంటి అభివృద్ధి బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఉందా..? సర్దార్ పటేల్, నెహ్రూ కేబినెట్‌లో హోంమంత్రిగా పనిచేశారని గుర్తు చేశారు. బిజెపి వాళ్ళు పటేల్ మా వాడు అని చెప్పుకోవడంలో అర్థం లేదన్నారు. నోరుంది అని మాట్లాడితే ఎట్లా..? మీ అమ్మని.. నాన్నను అడుగు గాంధీ కుటుంబం గురించి చెబుతారని అని అన్నారు. కాంగ్రెస్ పుట్టింది 140 ఏండ్ల క్రితం, మీ పార్టీ పుట్టింది 40 ఏండ్ల క్రితం అని అన్నారు. మీ చరిత్రకు.. మా పార్టీ చరిత్రకు తేడా లేదా..? అని అన్నారు.

# భవిష్యత్ ప్రగతికి విద్య ప్రామాణికం

బిసి సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి సంక్షేమ శాఖలో భవిష్యత్ ప్రగతికి విద్య ప్రామాణికమని, దానికి ప్రథమ ప్రాధాన్యత కల్పించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర అభివృద్ధిని ప్రతిబింబించేలా తెలంగాణ రైజింగ్ 2047 పాలసీలో భాగంగా గ్లోబల్ సమ్మిట్‌లో బిసి సంక్షేమ శాఖలో తీసుకోవాల్సిన అంశాలపై శుక్రవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో బిసి సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ జనాభాలో వెనుకబడిన తరగతులు 56 శాతం ఉన్నారని, వ్యవసాయం, చేతివృత్తులు, నైపుణ్యాలు, సాంప్రదాయ వృత్తులకు వెన్నెముకగా నిలుస్తున్నారని, వారి సామాజిక ఆర్థిక పురోగతి రాష్ట్రాభివృద్ధికి కీలకమైనదని వెల్లడించారు. విజన్ 2047లో బిసిలు విద్యాపరంగా బలంగా, ఆర్థికంగా స్వతంత్రంగా, సామాజికంగా సాధికారత సాధించి, ఆవిష్కరణ, నైపుణ్యాభివృద్ధితో పాటు రాష్ట్రాభివృద్ధికి చోదకంగా ప్రపంచ వ్యాప్తంగా పోటీతత్వాన్ని ఎదుర్కొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్య, మానవ మూలధనం నిరంతరాయంగా నాణ్యమైన అభ్యాసం ద్వారా విద్యా ప్రమాణాలను బలోపేతం చేయడం, మెరుగుపరచడం, రెసిడెన్షియల్ సంస్థలతో పాటు హాస్టళ్లను అత్యుత్తమ కేంద్రాలుగా అభివృద్ధి చేయాలన్నారు. ఉన్నత పాఠశాల నుండే ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, వ్యవస్థాపకతను పరిచయం చేయాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్‌లో చర్చించి రైజింగ్ తెలంగాణ విజన్ 2047లో పలు కీలక అంశాలు చేర్చనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో బిసి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, గురుకుల సెక్రటరీ సైదులు, బిసి సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ అలోక్‌కుమార్‌తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర డాక్టర్ సెల్ కమిటీలను ప్రకటించిన టిపిసిసి చీఫ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర డాక్టర్ సెల్ కమిటీలను పిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి మహేష్‌కుమార్ గౌడ్ శుక్రవారం ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర వైస్ చైర్మన్, జనరల్ సెక్రటరీలతో పాటు ఐదు జిల్లాల చైర్మన్లతో పాటు కీలక పదవులకు సంబంధించిన నియామక పత్రాలను ఆయన అందచేశారు. మిగతా జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీల నియామకాలను కూడా త్వరలో ప్రకటించనున్నట్లు పిసిసి డాక్టర్ సెల్ చైర్మన్ డాక్టర్ రాజీవ్ తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్‌గౌడ్ గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఏళ్ల తరబడి బీద ప్రజలకు సేవలు అందిస్తున్న డాక్టర్స్‌కి శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్లకు సమాజంలో ప్రత్యేక స్థానం ఉందని, తాను కూడా డాక్టర్ కావాలని అనుకున్నాని, పరిస్థితుల వల్ల కాలేకపోయానని తెలిపారు. నేటి సమాజంలో డాక్టర్ చదువుకున్న వాళ్ళు రాజకీయాల్లోకి వస్తే క్వాలిటీ డెవలప్మెంట్ తయారవుతుందన్నారు.

మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఒక రూపాయి డాక్టర్‌గా ఫేమస్ అయ్యారని తెలిపారు. డాక్టర్ల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి వైద్యులు ప్రభుత్వానికి సూచనలు సలహాలు ఇవ్వాలని ఆయన కోరారు. రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాజీవ్ మాట్లాడుతూ మెడికల్, హెల్త్ విభాగం కమిటీల నియామకాలు, ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసే దిశలో ఒక మంచి నిర్ణయమని, వైద్య రంగంలో నిర్మాణాత్మక ఆలోచనలతో పనిచేయడానికి అవకాశమిచ్చినందుకు కాంగ్రెస్ పార్టీకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## జిహెచ్‌ఎంసిలో మున్సిపల్ సంస్థలు విలీనం చేయొద్దు

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన జిహెచ్‌ఎంసి పరిధి విస్తరణ నిర్ణయాన్ని బిజెపి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు వెల్లడించారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓఆర్‌ఆర్) పరిధిలోని 27 మున్సిపల్ సంస్థలను జిహెచ్‌ఎంసిలో విలీనం చేసి మహానగరంగా మార్చాలనే ప్రభుత్వ నిర్ణయం ప్రజలకు నష్టం చేకూరుస్తుందన్నారు. విలీనం తర్వాత జిహెచ్‌ఎంసి పరిధిలోని జనాభా 1.70 కోట్ల నుంచి 2 కోట్లకు పైగా పెరుగుతుందని, ఇంత పెద్ద జనాభాకు అవసరమైన సదుపాయాలను అందించే సామర్థ్యం ప్రస్తుతం జిహెచ్‌ఎంసికి లేదన్నారు. గ్రామీణ ప్రాంతాలు, మున్సిపాలిటీల ప్రజలపై పన్నుల భారం మరింత పెరగనుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మున్సిపాలిటీల్లో అపరిశుభ్రత, అధ్వాన్నమైన రోడ్లు, డ్రైనేజీ సమస్యలు వంటి అనేక సమస్యలు ఉన్నాయని, నిధుల కొరతతో జిహెచ్‌ఎంసి సైతం సతమతమవుతున్నందున, విలీనం చేస్తే అభివృద్ధి ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా, అశాస్త్రీయంగా ఈ నిర్ణయం తీసుకుందని రాంచందర్ రావు విమర్శించారు. హిల్ట్ పాలసీని తీసుకువచ్చి 9 వేల ఎకరాలకు పైగా భూములను రియల్ ఎస్టేట్ మాఫియాకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. హైడ్రా, హిల్ట్ పాలసీ, ఇప్పుడు జిహెచ్‌ఎంసిలో విలీనం వంటి నిర్ణయాలన్ని ప్రజలకు నష్టమేనని అన్నారు. ఈ నిర్ణయాలను కాంగ్రెస్ వెనక్కు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిజెపి ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమురయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, నగర మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి, మీడియా ఇన్‌చార్జ్ ఎన్.వి.సుభాష్, మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్, బిజెపి జిహెచ్‌ఎంసి ఫ్లోర్ లీడర్ శంకర్ యాదవ్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు రాధా ధీరజ్ రెడ్డి పాల్గొన్నారు.



## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి డిసెంబర్ 3న మహాధర్నా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని, కాలయాపాన్ని నిరసిస్తూ డిసెంబర్ 3న హైదరాబాద్‌లోని సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్టు తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యుజె) అధ్యక్షుడు కె.విరాహత్ అలీ తెలిపారు. 'టియుడబ్ల్యుజె మహాధర్నా' కరపత్రాన్ని హైదరాబాద్‌లోని సచివాలయ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐజెయు నాయకులు ఎం.ఎ మాజీద్, టియుడబ్ల్యుజె ఉప ప్రధాన కార్యదర్శి రాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కిరణ్ కుమార్, కె.నరహరి, హెచ్‌యుజె అధ్యక్షుడు శిగ శంకర్‌గౌడ్, టియుడబ్ల్యుజె నాయకులు శ్రీకాంత్ రెడ్డి, జి.బాల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.విరాహత్ అలీ మాట్లాడుతూ అక్రిడిటేషన్ పాలసీని వెంటనే ప్రకటించి, కొత్త కార్డులను జారీ చేయాలని, ఆరోగ్య బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని, వృత్తి కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలని, సంక్షోభంలో ఉన్న చిన్న,మధ్య తరహా పత్రికలను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల జీవితాల్లో చీకటి తొలగి, వెలుగులు నిండుతాయని కలలు కన్నారని, కానీ గత టిఆర్‌ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఆశించిన స్థాయిలో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టలేదని, ప్రవేశపెట్టిన పథకాలను కూడా సక్రమంగా అమలు చేయలేదని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ఎపియుడబ్ల్యుజె సాధించిన, అప్పటి ప్రభుత్వాలు అమలు చేసిన సౌకర్యాలను, తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయకపోవడం విచారకరమని అన్నారు. గత ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలపైన సానుకూలంగా స్పందించలేదని, ప్రస్తుతం అధికారంలోనికి వచ్చిన కాంగ్రెస్ తమ మ్యానిఫెస్టోలో కూడా జర్నలిస్టుల కోసం స్పష్టమైన హామీలను పొందుపర్చినట్టు ఆయన గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో రాష్ట్రంలో జర్నలిస్టుల కోసం ఏర్పాటు చేసిన హై పవర్, సంక్షేమ కమిటీలు ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో లేదన్నారు. వేతన పర్యవేక్షించేందుకు త్రైపాక్షిక కమిటీ కూడా ప్రస్తుతం మాయమైందని తెలిపారు. తెలంగాణ జర్నలిస్టులను ఎందుకు విస్మరిస్తున్నారని ఆయన ప్రశ్నించారు.



మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గాంధీ భవన్‌లో ఆ మహనీయుని చిత్ర పటానికి నివాళులు అర్పించిన టిపిసిసిఅధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ కుమార్ రావు, డిసిసి అధ్యక్షుడు కైలాష్ నేత, అధికార ప్రతినిధి లింగం యాదవ్ తదితరులు


### గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
HYDERABAD
ఇఇ, సర్కిల్-30, బేగంపేట్, సికింద్రాబాద్ జోన్.

ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన

నోటీసు నెం. 14/EOI/EE-30/SD Z/GHMC/2025-2026, తేదీ: 28.11.2025

| క్ర. సం. | క్రింద పేర్కొన్న పని కోసం తయారీదారులు, ఫ్యాబ్రికేటర్లు, అధీకృత డీలర్లు / ఏజెన్సీలు మొదలైన వారి నుండి EOI లను ఆహ్వానిస్తున్నాము | డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ & సమయం / డాక్యుమెంట్ దాఖలుకు ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|
| 1 | "పాత పాటిగడ్డ వద్ద జిహెచ్‌ఎంసి మల్టీపర్పస్ ఫంక్షనల్ హాల్ కోసం 544/600 కిలోల సామర్థ్యం గల ఎలివేటర్ (లిఫ్ట్) వ్యవస్థ సంస్థాపన, సరఫరా మరియు డెలివరీ, జి ప్లస్ 2, 3 స్టాప్‌లు మరియు 3 ఓపెనింగ్‌లు(2వ రీకాల్)" కోసం ఆసక్తి వ్యక్తీకరణ (EOI) ఆహ్వానించబడింది. | EOI ప్రారంభ తేదీ & సమయం: 29.11.2025న మ. 12.00గం.ల నుండి, దాఖలుకు ఆఖరి తేదీ & సమయం: 03.12.2025న మ.12.00గం.ల వరకు | EOI ని ఒ/ఒ. ఇ.ఇ., సర్కిల్-30, జిహెచ్‌ఎంసి, సికింద్రాబాద్‌లో 03.12.2025న మ.12.00గం.లకు లేదా అంతకు ముందు సమర్పించవచ్చు. |

సంప్రదించవలసిన అధికారి చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-30 మరియు హెడ్ డ్రాఫ్ట్‌మెన్, సర్కిల్-30, సికింద్రాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి. పైన పేర్కొన్న పనికి సంబంధించిన మరిన్ని వివరాలను జిహెచ్‌ఎంసి వెబ్‌సైట్ https://www.ghmc.gov.in/Tenderspage.aspx నుండి పొందవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-30, బేగంపేట్.

DIPR R.O. No. : 11485-PP/CL/ADVT/1/2025-26, Date: 28-11-2025

## చెర్వుగట్టు హుండీ ఆదాయం లెక్కింపు



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మండలంలోని చెరువుగట్టు శ్రీపార్వతీ జడలరామలింగేశ్వర స్వామి దేవస్థానం నందు శుక్రవారం హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. గట్టుక్రింద అమ్మవారి ఆలయ హుండీ ఆదాయం రూ.43,7668. గట్టుపైన స్వామివారి ఆలయ హుండీ ఆదాయము రూ.38,49876 మొత్తం 49 రోజులకు గాను నలభై రెండు లక్షల ఎనభై ఏడు వేల ఐదువందల నలభై నాలుగు రూపాయలు, అన్నదానముకు రూ.42,374లుతో పాటుగా అమెరికా డాలర్స్39,కెనెడ డాలర్స్ 5,శ్రీలంక రూపాయలు 10 వచ్చినట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్. మోహన్ బాబు తెలిపారు.ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకురాలు సుమతి,విజయవాడకు చెందిన శ్రీ దుర్గ శివసాయి సేవా సంఘం సభ్యులు,ఐడిబిఐబ్యాంకు సిబ్బంది దేవస్థాన సిబ్బంది ఇంద్రసేనా రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాల పరిశీలన



**ప్రజాపక్షం/నూతనకల్ :** గ్రామ పంచాయితీ ఎన్నికల నామినేషన్ పత్రాల స్వీకరణ కేంద్రాలలోని నూతనకల్ క్లస్టర్, ఎర్రపహాడ్ క్లస్టర్ కేంద్రాలలో జరుగుతున్న నామినేషన్ ప్రక్రియను జనరల్ అబ్జర్వర్ జి రవి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ స్వీకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు జాగ్రత్త వహించాలని అన్నారు. నామినేషన్ పత్రాల స్వీకరణలో ఏలాంటి తప్పిదాలు దొర్లకుండా సరి చూసుకోవాలని అభ్యర్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఓ సునీత, ఎస్ఐ నాగరాజు, ఆర్ఓ అశోక్, పంచాయితీ కార్యదర్శులు సత్యవతి, వినోద, శర్మ, చలమయ్య ఉన్నారు.



## ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ

### నల్లగొండ జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పోలీస్ అధికారులు, సిబ్బంది ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని,వారి ఆరోగ్య పరిరక్షణలో భాగంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అపోలో,రినోవా,మెడికవర్,మ్యాక్స్ విజన్,రైన్బో చిల్డ్రన్,క్లౌ డెంటల్,ఇండియన్ మెడికల్ అసోసియేషన్, జిజిహెచ్ నల్లగొండ హస్పటల్ డాక్టర్ల వారి సహకారంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి విది నిర్వహణలో ఒత్తిడి కారణంగా సమయానికి ఆహారం నిద్ర లేకపోవడం వలన అనేక రకాల ఆరోగ్య సమస్యల బారిన పడే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని , వైద్యుల సలహాలు సూచనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి రమేష్,ఎస్.బి డిఎస్పిమల్లారెడ్డి,నల్లగొండ డిఎస్పి శివ రాం రెడ్డి,ఏ.ఆర్ డిఎస్పి శ్రీనివాస్, వైద్యులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడలలో రాణించాలి


### ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి




**ప్రజాపక్షం/కోదాడ:** ఆటలు చదువులో ఒక భాగమని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడాలలో రాణించాలని ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణ సీసీఆర్ విద్యానిలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న 19వ సీఎస్ఏ జాతీయ స్థాయి క్రీడ ముగింపు వేడుకలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రలకు చెందిన 29 పాఠశాలల నుండి 1,450 మంది క్రీడాకారులు కబాడీ, హ్యాండ్‌బాల్, త్రోబాల్, వాలీబాల్, కబాడీ, బాస్కెట్‌బాల్, స్పోర్స్ ఈవెంట్స పాల్గొన్నట్లు నిర్వహాకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆలరించాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందించి నిర్వహించిన సీసీఆర్ విద్యానిలయం యాజమాన్యాన్ని అభినందించారు. ఉడుముల శౌరీ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మండల విద్యాధికారి ఎం.డి సలీంషరీఫ్, ఆల్ఫోన్సా, నక్షత్రం, శాంతమేరీ, జూలియట్, విజయ, ఫజోసాఫ్‌రెడ్డి, చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి, బాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, లామ్ దేవరాజ్, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతిక్ ఫౌండేషన్ క్రీడలు నిర్వహించడం అభినందనీయం

### ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రతిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలతో పాటు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ కేతవత్ శంకర్ నాయక్ అన్నారు.శుక్రవారం పట్టణంలోని ఎన్జీ కళాశాల గ్రౌండ్లో ఏర్పాటుచేసిన నల్లగొండ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ను ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయని అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్లగొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడంతో పాటు ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు.అభివృద్ధిలో నల్లగొండ మినీ హైదరాబాద్‌ల ముందుకు పోతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ప్రదీప్ నాయక్,కేసాని వేణుగోపాల్ రెడ్డి,టోర్నమెంట్ ఆర్గనైజర్స్ బోనగిరి ప్రభాకర్ పాల్గొన్నారు.

## వేములపల్లి మండలంలో 'స్థానిక' ఎన్నికలకు సిపిఐ అభ్యర్థుల ఖరారు

**ప్రజాపక్షం/వేములపల్లి:** గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడే అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు కోరారు.మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సిపిఐ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. డబ్బులు, మద్యం కులం మతం ప్రాంతం వివిధ ప్రలోభాలతో వచ్చే అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని కోరారు. వేములపల్లి మండలంలో స్థానిక సంస్థలఎన్నికలలో సిపిఐ అభ్యర్థులను ఖరారు చేసినట్లు తెలిపారు. అన్నపురెడ్డి గూడెం,తిమ్మారెడ్డి,గూడెం,మంగాపురం గ్రామాలలో సంబంధిత వార్డుల్లో ఆయా అభ్యర్థులను ఎంపిక చేయడం జరిగింది అన్నారు.మండల కేంద్రంలో సర్పంచ్ అభ్యర్థిగా జిల్లా యాదగిరి తో పాటు వార్డు సభ్యులను ప్రకటించారు.ఈ సమావేశంలో మండల కార్యదర్శి జిల్లా యాదగిరి,వేములపల్లి గ్రామ కార్యదర్శి పుట్టల నాగయ్య,మంగాపురం కార్యదర్శి మద్దిరాల రంగారెడ్డి, పుట్టల కృష్ణ,సుధాకర్,కత్తుల బిక్షం, పరమేష్,సంపత్ పాల్గొన్నారు.



# అడ్డొచ్చిన అష్టమి...

**రెండవ రోజు తగ్గిన నామినేషన్ల దాఖలు**
**సర్పంచ్‌లకు 159, వార్డులకు 142 నామినేషన్లు**



**ప్రజాపక్షం/సూర్యాపేట :** స్థానిక సంస్థల ఎన్నికల్లో మొదటి విడతలో పోలింగ్ జరిగే స్థానాలకు మొదటి రోజు అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేయగా, రెండవ రోజు శుక్రవారం నామినేషన్ దాఖలు చేసేందుకు అష్టమి అడ్డు వచ్చింది. మొదటి రోజు గురువారం సర్పంచ్ లకు 207, వార్డులకు 38 నామినేషన్లు దాఖలు కాగా, రెండవ రోజు సర్పంచ్‌లకు 159, వార్డులకు 142 నామినేషన్లు దాఖలయ్యాయి. దీనిని పరిశీలిస్తే సర్పంచ్ అభ్యర్థులు మంచి మూహుర్తం చూసుకునే నామినేషన్ దాఖలు చేయాలని ఆగిపోగా, వార్డుల్లో పోటీ చేసే వారు మాత్రం అవేవి పట్టించుకోకుండా జోరుగా నామినేషన్లు దాఖలు చేశారు. సూర్యాపేట జిల్లాలో మొదటి విడత తుంగతుర్తి, నాగారం, నూతనకల్, తిరుమలగిరి, జాజిరెడ్డిగూడెం, మద్దిరాల, సూర్యాపేట రూరల్, ఆత్మకూర్(ఎస్) మండలాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ మండలాల పరిధిలో మొత్తం 159 గ్రామ పంచాయితీలు ఉండగా, 1442 వార్డులు ఉన్నాయి. మొదటి రోజు సర్పంచ్‌లకు 207, వార్డులకు 38 నామినేషన్లు దాఖలు కాగా, రెండవ రోజు సర్పంచ్‌లకు 159, వార్డులకు 142 నామినేషన్లు దాఖలయ్యాయి. అష్టమి అడ్డురావడంతోనే సర్పంచ్ పదవీ కోసం పోటీచేసే అభ్యర్థులు మంచి రోజు కాకపోవడంతో నామినేషన్‌లు దాఖలు చేసేందుకు ఆసక్తి చూపనట్లు స్పష్టమవుతుంది. మొదటి రోజు కంటే వార్డుల్లో పోటీ చేసే అభ్యర్థులు మాత్రం అవేవి పట్టించుకోకుండా జోరుగా నామినేషన్లు దాఖలు చేశారు.

రెండవ రోజు దాఖలైన నామినేషన్లను పరిశీలిస్తే ఇలా ఉన్నాయి. తుంగతుర్తి మండల సర్పంచ్‌గా పోటీ చేసే అభ్యర్థులు 25 మంది నామినేషన్లు దాఖలు చేయగా వార్డు మెంబర్లుగా పోటీ చేసే వారు 16 మంది, నాగారం మండలంలో 17 సర్పంచ్ నామినేషన్లు, వార్డులకు 36 నామినేషన్లు, నూతనకల్ మండలంలో సర్పంచ్ పదవికి 18, వార్డులకు 26 నామినేషన్లు, తిరుమలగిరి మండలంలో సర్పంచ్ పదవికి 7 నామినేషన్లు దాఖలు చేయగా వార్డులకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. జాజిరెడ్డిగూడెం మండలంలో సర్పంచ్ పదవికి 11, వార్డులకు 07 నామినేషన్లు దాఖలు అయ్యాయి. మద్దిరాల మండలంలో సర్పంచ్ పదవికి 23, వార్డులకు 13 నామినేషన్లు, సూర్యాపేట మండలంలో సర్పంచ్ పదవి కోసం 22, వార్డులకు 20 నామినేషన్లు దాఖలు చేశారు. ఆత్మకూర్(ఎస్) మండలంలో సర్పంచ్ పదవి కోసం 36, వార్డులకు 24 నామినేషన్లు దాఖలు అయినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ అధికారికంగా ప్రకటించారు. మొదటి విడత ఎన్నికల్లో నామినేషన్ల దాఖలు చేసేందుకు నేటితో గడువు ముగియనుంది.



## నామినేషన్‌లో పొరపాట్లకు తావు లేదు

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** నామినేషన్‌లో పొరపాట్లకు తావులేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. తుంగతుర్తి గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తుంగతుర్తి గ్రామ పంచాయితీ కార్యాలయంలో తుంగతుర్తి, గానుగబండ, తూర్పుగూడెం సర్పంచ్‌లకు, వార్డు సభ్యుల ఎన్నిక నిమిత్తం కొరకు ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని, మద్దిరాల ఎంపిడిఓ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని, నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏలాంటి సందేహాలు ఉన్నాపై అధికారులను సంప్రదించాలన్నారు. అనంతరం మద్దిరాల ఎంపిడిఓ కార్యాలయంలో నామినేషన్ ఆనైలైన్ చేసే విధానాన్ని పరిశీలించారు. నామినేషన్‌లను స్వీకరించిన తరువాత వెంటనే టి పోల్‌యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఓ వేణుమాధవ్, తహశీల్దార్ దయనందం, ఎంపిడిఓలు సత్యనారాయణ రెడ్డి, శేషకుమార్, ఆర్ఓలు, అధికారులు ఉన్నారు.

## ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

### పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు విడుదల చేయాలి : ఏఐఎస్ఎఫ్ డిమాండ్



**ప్రజాపక్షం/దేవరకొండ:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 23నెలల పాలనలో మద్యం శాఖకు మంత్రిని కేటాయించి భవిష్యత్తు విద్యార్థుల చదువులకు ప్రత్యేక మంత్రిని కేటాయించకపోవడం సిగ్గుచేటని, విద్యా రంగ సమస్యలు పరిష్కారం కావడం లేదని, ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం దేవరకొండలోని వివిధ కళాశాలలో, పాఠశాలలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి, కళాశాల, పాఠశాలలో నూతన కమిటి ఏర్పాటు చేయడం జరిగింది. ఈసందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయడంలో, హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిల విడుదల లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పట్టించుకోకుండా వారి చదువులతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని అన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టడంలో, విద్యా హక్కు చట్టం అమలు చేయడంలో, ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. వెంటనే ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ఇంటర్ మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్నభోజనం అందజేయాలని, ప్రభుత్వం విద్యార్థుల ఫీజు బకాయిలు మొత్తం విడుదల చేయకపోతే ప్రభుత్వంపై మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి శివకుమార్, డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శంశోద్దీన్, ఏఐఎస్ఎఫ్ నాయకులు నూతన కమిటి ఎన్నికైన సభ్యులు షోహెల్, సిద్దు, చరణ్, యశ్వంత్, రాము, గాయత్రి, మానస, అశ్విత, పూజ, జనప్రియ, అనూష, కీర్తన, విజయలక్ష్మీ తదితరులు ఉన్నారు.




## పారదర్శకంగా నామినేషన్ల ప్రక్రియ

### నామినేషన్ కేంద్రాల పరిశీలన కలెక్టర్ తనిఖీ

**ప్రజాపక్షం/మర్రిగూడ:** గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా మొదటి విడత ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.శుక్రవారం ఆమె మర్రిగూడ మండలం, సరంపేట,శివన్న గూడెం ,వట్టిపల్లి గ్రామాలలో పర్యటించి నామినేషన్ స్వీకరణ కేంద్రాలను తనిఖీ చేశారు. నామినేషన్ దాఖలు ప్రక్రియ, సిబ్బంది హాజరు, అభ్యర్థులకు కల్పిస్తున్న సేవలు,భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతి కేంద్రంలో క్రమశిక్షణ, నిబంధనలు కచ్చితంగా పాటించాలని, రిజర్వేషన్లను కల్పించిన వారికి కుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ,మహిళా అభ్యర్థుల కోసం ప్రత్యేక సహాయ డెస్క్ ఏర్పాటు,అభ్యర్థులు కరెంట్ బ్యాంకు ఖాతా సమర్పించాల్సి ఉంటుందని, అభ్యర్థులు సమర్పించే నగదును ఎలా స్వీకరిస్తున్నారని ? అలాగే వారికి రసీదు ఇస్తున్నారా? అని అడిగారు . డిజిటల్ గోడ గడియారం అమర్చుకోవాలని చెప్పారు. చెక్ లిస్టులను నామినేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. చండూర్ ఆర్‌డిఓ శ్రీదేవి,తహసీల్దార్ శ్రీనివాస్,ఎంపీడీవో మున్నయ్య, తదితరులు ఉన్నారు.

## బాలల పరిరక్షణ కమిటీల ఏర్పాటు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సీడీపీవో రేఖల మమత ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని 4,5,19,20,21,37 వార్డుల్లో బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేశారు. కమిటీలో వార్డు ఆఫీసర్ల చైర్మన్‌గాను, సూపర్‌వైజర్‌ను కన్వీనర్‌గా, ఏఎన్ఎం, సమభావన సభ్యులను స్కూల్ హెడ్‌మాస్టర్‌ను, వార్డు పోలీసులను, మత పెద్దతలను సభ్యులుగా ఎన్నుకున్నారు. ముఖ్య ఉద్దేశ్యం అక్రమ దత్తత, బాల్య వివాహాలను అడ్డుకోవడం, స్కూల్ డ్రాప్ అవుట్, భ్రూణహత్యల నిర్మూలించడం, పోక్సో యాక్ట్, భ్రూణహత్యలను నిర్మూలించే అంశాలపై ప్రతి నెలా మొదటి శుక్రవారం సమావేశాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఈవో బాలునాయక్, సూపర్‌వైజర్ నాగమణి, కల్యాణి, ప్రేమలత, క్రాంతికుమార్, రమేష్, లాలునాయక్, సాయిశ్రీనివాస్, శ్రీకాంత్, ఝాన్సీ, నర్సమ్మ, సైదా, రోజా, గోపమ్మ, శివాజిరెడ్డి, రాధాకృష్ణ, గోపమ్మ, కవిత, అచ్చాలు, విజయలక్ష్మీ , సైదమ్మ, లలితమ్మ, పార్వతి, రామనుజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఉత్పత్తుల తయారీపై దృష్టి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మహిళా సంఘాల సభ్యులు నూతన ఉత్పత్తుల తయారీపై దృష్టి సారించి ఆర్థికంగా మరింత ముందుకు ఎదగాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.శుక్రవారం జిల్లా నుండి సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహిస్తున్న భారతీయ కళా మహోత్సవ్‌కు జిల్లా నుండి వెళుతున్న స్వయం సహాయక మహిళా సంఘాల అధ్యక్ష, కార్యదర్శుల ప్రత్యేక బస్సుకు ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జండా ఊపి ప్రారంభించారు. కళా మహోత్సవ్‌లో దేశంలోని వివిధ ప్రాంతాలలో తయారుచేసిన పలు రకాల ఉత్పత్తులను ప్రదర్శించడం జరుగుతుందని, అలాంటి స్టాల్స్ ను మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యు లు సందర్శించడం వల్ల విభిన్న ఉత్పత్తుల తయారీపై అవగాహన కలుగుతుందన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పొదుపు, ఆర్థిక అంశాలతో పాటు, సామాజిక అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలని,అలాగే వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సాంస్కృతి, సంప్రదాయాలు,వారి కట్టుబాట్లు, ఆచార, వ్యవహారాలు తెలుసుకునేందుకు ఇది ఒక మంచి అవకాశం అని అన్నారు. జిల్లాలోని మహిళా స్వయం సహాయక సంఘాలు నూతన ఆలోచనలతో కొత్త ఉత్పత్తులను తయారు చేయడం పై దృష్టి సారించాలని తద్వారా మరింత ఆర్థికంగా ఎదిగే ఆకాశం ఉందన్నారు. డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి, డిపిఎంలు, ఏపీఎంలు తదితరులు ఉన్నారు.

## అప్రజాస్వామ్యిక వేలం, ప్రలోభాలతో ఏకగ్రీవ సర్పంచుల ఎన్నిక చెల్లదు

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు వెల్లడి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా వేలం పాటలు, ప్రలోభాలతో బెదిరింపులతో అప్రజాస్వామ్యక ఏకగ్రీవ సర్పంచుల ఎన్నిక చెల్లదని ఎలక్షన్ కమిషన్ నియమించిన కమిటీ నివేదిక ఆధారంగా మాత్రమే చెల్లుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు స్పష్టం చేశారు. ఏకగ్రీవం చేయాలనుకునే సర్పంచుల ఎన్నిక గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు కమిటీ సమగ్ర విచారణ జరిపి నివేదిక ఆధారంగానే తుది ఫలితం వెల్లడిస్తామని తెలిపారు. యాదాద్రి జిల్లా వ్యాప్తంగా మూడు దశలలో జరగనున్న ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆయన శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న పిఓస్‌ల శిక్షణ శిబిరంలో పాల్గొని ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు కౌంటింగ్ పూర్తయ్యే వరకు అనుసరించవలసిన విధివిధానాలను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి దశలో 153 గ్రామాలకు, 1286 వార్డుల 41 క్లస్టర్లలో నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతుందని వివరించారు. మొదటి జోన్ కు సంబంధించిన అన్ని స్థాయిలలో స్టేజ్ 1,2 ఆర్ఓ ఇప్పటికే పూర్తి అయినట్లు పీవోస్‌లకు ఎన్నికల నుంచి మొదలుకొని కౌంటింగ్ వరకు జరిగే అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 17 మండలాలకు సంబంధించిన శిక్షణ శిబిరాలు శుక్రవారం కొనసాగినట్లుగా చెప్పారు. జిల్లాలో మొత్తం 427 గ్రామపంచాయతీలలో 3704 వార్డులకు ఎన్నికలు జరుగుతున్నందున పటిష్టమైన ఎన్నికల కోడ్ అమలు చేస్తున్నట్టు తెలిపారు. కోడు అమల్లో ఉన్నందువలన అక్రమ మద్యం, డబ్బు రవాణా అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా బీబీనగర్, బొమ్మలరామారం, ఆలేరు, పంతంగి గ్రామాల వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేసి 24 గంటలు తనిఖీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. 36 హైపర్ సెన్సిటివ్, 146 సెన్సిటివ్ ప్రాంతాలుగా గుర్తించినట్లు తెలిపారు. 192 వార్డులకు గాను వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులను 7గురు రిటర్నింగ్, 7 గురు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను ఇద్దరినీ రిజర్వు అధికారులుగాను నియమించారు. పిలాయిపల్లి, దేశ్ముఖి రెండు గ్రామాలను ఒక క్లస్టర్‌గా, జలాల్పురం, కనుముకుల, దంతూరు, వంకమామిడి నాలుగు గ్రామాలు కలిపి ఒక క్లస్టర్‌గాను మిగిలిన మూడు గ్రామాలకు ఒక క్లస్టర్‌గా విభజించారు. కాగా పోచంపల్లి మండలంలోని 21 గ్రామాలను ఏడు క్రస్టర్లుగా విభజించారు.

## ధృవీకరణ పత్రాల కోసం అష్టకష్టాలు...

### సర్వర్ బిజీతో మీ-సేవ కేంద్రాల వద్ద పడిగాపులు

### అభ్యర్థుల ఆందోళన



**ప్రజాపక్షం/సూర్యాపేట :** అవసరమైన పత్రాల కోసం మీసేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకునేందుకు వెళ్తున్న వారు అష్టకష్టాలు పడుతున్నారు. అక్కడికి వెళ్తే సర్వర్ బిజీ అని చెప్పడంతో ఆ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేయాలన్న అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే సమయంలో వారి ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు దానితో జతచేయాల్సి ఉండగా అవి అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా దాదాపు 85కు పైగా మీసేవ కేంద్రాలు ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు వారికి అవసరమైన ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు పొందేందుకు మీ సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకునేందుకు గత ఐదు రోజులుగా బారులు తీరుతున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు వెళ్తే సర్వర్ బిజీ అని చెప్పడంతో ఇబ్బందులు పడుతున్నారు. మీసేవ కేంద్రాలు ఎప్పుడు పనిచేస్తాయో తెలియక రోజుల తరబడి కేంద్రాల చుట్టూ అభ్యర్థులు కాళ్ళు అరిగేలా తిరుగుతున్నారు. కొంతమంది దరఖాస్తు చేసుకున్న వారు అధికారులు ఒకే చెప్పిన తర్వాత పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవాలంటే కూడా సర్వర్ బిజీ అని చెబుతున్న పరిస్థితి. సూర్యాపేట జిల్లాలో మొదటి విడత పోలింగ్ తుంగతుర్తి, నాగారం, నూతనకల్, తిరుమలగిరి, జాజిరెడ్డి గూడెం, మద్దిరాల, సూర్యాపేట రూరల్, ఆత్మకూర్(ఎస్) మండలాల్లోని 159 గ్రామ పంచాయితీలకు, 1442 వార్డులకు డిసెంబర్ 11న ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో పోటీచేసే సర్పంచ్, వార్డులకు పోటీచేసే అభ్యర్థులకు నామినేషన్ దాఖలు చేసేందుకు కేవలం మూడు రోజుల సమయం మా త్రమే ఉంది. ఇప్పటికే రెండు రోజులు గడవగా కేవలం ఒక్కరోజు మాత్రమే మిగిలింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసేందుకు కేవలం ఒక్క రోజు మాత్రమే గడువు ఉండడంతో ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ సమీపంలోని మీసేవ కేంద్రాలకు వెళ్ళి ధృవీకరణ పత్రాలను కొంత మంది చేసుకోగా మరికొంత మంది చేసుకోలేదు. దరఖాస్తు చేసుకున్న వారికి సంబంధించిన పత్రాలు అధికారులు ఓకే చెప్పినా సర్వర్ బిజీతో అవి డౌన్‌లోడ్ కావడంలేదని దరఖాస్తు చేసుకోవాలనుకునే వారికి సర్వర్ బిజీ అడ్డంకిగా మారింది. దీనిపై సంబంధిత అధికారులు చొరవ తీసుకొని సర్వర్ బిజి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## విమానంలో పొగ..వెనక్కి మళ్లింపు

**న్యూఢిల్లీ:** ఎయిర్ ఇండియా విమానంలో పొగ ఉన్నట్లు హెచ్చరికలు చూపడంతో టేకాఫ్ అయిన ఆ విమానాన్ని వెనక్కి మళ్లించి ఎయిర్‌పోర్ట్‌లో దించేశారు. ప్రయాణికులను కిందకు దించి వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఢిల్లీలో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎయిర్ ఇండియా విమానం ఏఐ 2939 ఢిల్లీ నుంచి అహ్మదాబాద్ వెళ్లేందుకు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి గురువారం టేకాఫ్ అయింది. ఆ వెంటనే కార్గో విభాగంలో పొగ ఉన్నట్లు కాక్‌పిట్‌లో అలర్ట్ చూపించింది. వెంటనే విమానం పైలట్లు వెంటనే అప్రమత్తమయ్యారు. ప్రామాణిక ఆపరేటింగ్ ప్రొటోకాల్స్ పాటించారు. ఆ విమానాన్ని తిరిగి ఎయిర్‌పోర్ట్‌కు మళ్లించారు. సురక్షితంగా దించేశారు. ప్రయాణికులను విమానం నుంచి దించి, పొగ అలర్ట్ వచ్చిన కార్గో విభాగాన్ని విమాన సిబ్బంది పరిశీలించారు. అయితే అక్కడ ఎలాంటి పొగ ఆనవాళ్లు కనిపించలేదు. దీంతో తప్పుడు అలర్ట్‌గా సిబ్బంది నిర్ధారించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా ప్రయాణికులను వారి గమ్యస్థానానికి చేర్చినట్లు ఎయిర్ ఇండియా అధికారి తెలిపారు.

### వసుధైక కుటుంబం అనే పురాతన తత్వానికి...

## గతంలో కంటే అధిక ప్రాచుర్యం

బ్రహ్మకుమారీలు నిర్వహించిన 'ప్రపంచ ఐక్యత-విశ్వాసం కోసం ధ్యానం' సమావేశం ప్రారంభోత్సవంలో రాష్ట్రపతి ముర్ము



**లక్నో:** ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న ఊహించని సవాళ్ల మధ్య వసుధైక కుటుంబం (ప్రపంచం ఒక కుటుంబం) అనే పురాతన తత్వం గత ంలో కంటే ఇప్పుడు మరింత ప్రాచుర్యం పొందిందని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అన్నారు. శుక్రవారం ఇక్కడ 2025–26 సంవత్సరానికి బ్రహ్మకుమారి ఇతివృత్తం 'ప్రపంచ ఐక్యతవిశ్వాసం కోసం ధ్యానం' సమావేశం ప్రారంభోత్సవంలో రాష్ట్రపతి ముర్ము ప్రసంగించారు. 'భారతదేశ ప్రాచీన నాగరికత, గొప్ప సాంస్కృతిక వారసత్వం ఎల్లప్పుడూ వసుధైవ కుటుంబం అనే 'కాలాతీత సూత్రాన్ని' ప్రతిబింబించాయి. ఇది అనిశ్చితులు, ప్రపంచ సవాళ్లను ఎదుర్కొంటున్న నేటి ప్రపంచం ఈ సందేశం మరింత సందర్భోచితంగా మారుతోంది' అని రాష్ట్రపతి అన్నారు. నేడు మానవులు గతంలో కంటే ఎక్కువ విద్యావంతులు మాత్రమే కాకుండా సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందారు. పురోగతి సాధించడానికి అనేక అవకాశాలు ఉన్నాయని, అయినప్పటికీ పురోగతితో పాటు పెరుగుతోన్న వత్తిడితో ఇబ్బంది పడుతున్న సమాజం, మానసిక అభద్రత, ఒంటరితనంతో పోరాడుతోంది. ముందుకు సాగడం మాత్రమే కాదు. తనలో తాను చూసుకోవడం కూడా నేటి అవసరమని రాష్ట్రపతి ముర్ము అన్నారు. 'ప్రతీ మానవుడూ ఇతరులను విశ్వసించాలని కోరుకుంటాడు. కానీ మనస్సు ప్రశాంతంగా, ఆలోచనలు స్పష్టంగా, భావోద్వేగాలు స్వచ్ఛంగా ఉన్నచోట మాత్రమే నమ్మండి. మనం ఒక్క క్షణం ఆగి సంభాషించినప్పుడు, శాంతి, ఆనందం ఏ బాహ్య ప్రపంచంలోనూ కనిపించవని మనం గ్రహిస్తాం. మనలో ఆధ్యాత్మిక స్పృహ మేల్కొన్నప్పుడు ప్రేమ, సోదరభావం, కరుణ, ఐక్యత దానంతట అవే జీవితంలో భాగస్వామ్యం అవుతాయి' అని ఆమె చెప్పారు. ప్రశాంతమైన, స్థిరమైన మనస్సు సమాజంలో శాంతికి బీజం వేస్తుందని, అక్కడ నుండి ప్రపంచ శాంతికి పునాది వేస్తుందని రాష్ట్రపతి ఉద్ఘాటించారు. ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రతీ మూలను కవర్‌చేసే యాత్రను చేపట్టే బ్రహ్మకుమారీలకు 'కలశం', బ్రహ్మకుమారులకు జెండాలను బహుకరించారు. దీనికి ముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగతం పలికిన ఉత్తర్‌ప్రదేశ్ గవర్నర్ ఆనందిబెన్ పటేల్ మాట్లాడుతూ 'ఆమె ఉనికి ఈ కార్యక్రమాన్ని చరిత్రాత్మకంగా మార్చింది. 'జాతీయ ప్రయోజనం,మానవత్వం, విలువల పట్ల మీ అంకితభావం మనందరికీ స్ఫూర్తిదాయకం' అని గవర్నర్ ఆనందిబెన్ పటేల్ అన్నారు. ప్రపంచ ఐక్యత లక్ష్యంతో ఇది ఒక ప్రధాన ప్రచారం అని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వివరించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు యోగి స్వాగతం పలుకుతూ 'ఒక దేశ రాజ్యాంగ అధిపతిగా ఉండటమే కాకుండా ఆమె జీవితం ఒక ఉపాధ్యాయుడి తరహాలో స్ఫూర్తిని ఇస్తోంది' అని ఆయన పేర్కొన్నారు.

## వాయు కాలుష్యంపై పార్లమెంట్‌లో చర్చ జరపాలి

### ఆరోగ్య అత్యవసర పరిస్థితిపై మోదీ మౌనం ఎందుకని రాహుల్ నిలదీత

**న్యూఢిల్లీ:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1వ తేదీ నుంచి జరగనున్నాయి. ఈ నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో రోజు రోజుకు పెరుగుతున్న వాయు కాలుష్యంపై సవివరంగా చర్చించాలని ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. ఆరోగ్య అత్యవసర పరిస్థితిపై ప్రధాని మోదీ మౌనం ఉండటమేమిటని రాహుల్ ప్రశ్నించారు. వాయు కాలుష్యాన్ని పరిష్కరించడానికి కఠినమైన, అమలు చేయగల కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై మోదీ ప్రభుత్వం ఎటువంటి అత్యవసరతను లేదా జవాబుదారీతనం చూపించడం లేదని నిలదీశారు. ఈ అంశంపై తన నివాసంలో తల్లుల బృందంతో రాహుల్ గాంధీ ముఖాముఖి నిర్వహించారు. వారితో తన సంభాషణ వీడియోను పంచుకున్నారు. వారిలో చాలామంది తమ పిల్లలు విషపూరిత గాలిని పీల్చుకుంటూ పెరుగుతోందని, వారు అలసిపోయారని, భయపడుతున్నారని, కోపంగా ఉన్నారని తనను కలిసిన ప్రతి తల్లి ఇదే విషయాలను చెబుతోందన్నారు. 'మోదీ జీ, భారతదేశ పిల్లలు మన ముందు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మీరు ఎలా మౌనంగా ఉండగలుగుతున్నారు? మీ ప్రభుత్వం ఎందుకు అత్యవసరంగా, ప్రణాళిక లేకుండా, జవాబుదారీతనం లేకుండా ఉండగలుగుతుందని అని రాహుల్ ఎక్స్‌లో ప్రశ్నించారు.



భారతదేశానికి వాయు కాలుష్యంపై తక్షణ, వివరణాత్మక పార్లమెంటు చర్చ, ఈ ఆరోగ్య అత్యవసర పరిస్థితిని పరిష్కరించడానికి కఠినమైన, అమలు చేయగల కార్యాచరణ ప్రణాళిక అవసరం' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు పేర్కొన్నారు. మన పిల్లలు స్వచ్ఛమైన గాలికి అర్హులని, సాకులు, పరధ్యానాలు కాదని హితవు పలికారు. వీడియోలో మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రతి ఒక్కరూ కాలుష్యం వల్ల ప్రభావానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఢిల్లీలో పేదలు, ధనవంతులు ఇద్దరూ నివసిస్తున్నారన్నారు. కాలుష్యం ఉండటానికి కారణం కాలుష్యం వల్ల ప్రయోజనం పొందే వారున్నారని, దానిని స్పష్టంగా చెప్పాలంటే వారు మీ కంటే శక్తివంతమైనవారన్నారు. ఇప్పుడు రాజకీయ సంకల్పం గురించి మాట్లాడేటప్పుడు, ఈ శక్తి పరిణామాలు రాజకీయ సంకల్పాన్ని ప్రభావితం చేస్తాయని, ఢిల్లీని కలుషితం చేస్తున్న 500 నుండి 1000 వాణిజ్య యూనిట్లు మీకు ఉంటే, వారికి రాజకీయ అండ ఉంటుందన్నారు. ఇక్కడ సమస్య ఏమిటంటే సగటు పౌరుడు అన్నలు వ్యవస్థీకృతంగా లేదన్నారు. కాబట్టి, అతనికి ఏ రాజకీయ శక్తి అండగా లేదన్నారు. వాయు కాలుష్యాన్ని ఎదుర్కోవడంలో వారికి ఇప్పటికే ఎంపికలు ఉన్నప్పటికీ, భారతదేశంలో చాలా మందికి అవి లేవని చెప్పారు. కాగా, పార్లమెంటులో చర్చ జరపాలని ఓ తల్లి చేసిన సూచనకు గాంధీ స్పందిస్తూ 'పార్లమెంటులో వాయు కాలుష్యంపై చర్చ జరపడానికి మాకు అనుమతి ఇవ్వడం న్యాయమైన లక్ష్యం అవుతుందన్నారు. సంభాషణ సమయంలో భారతదేశంలో వాయు కాలుష్యం కారణంగా ప్రతిరోజూ దాదాపు 500 మంది పిల్లలు మరణిస్తున్నారని, అయినప్పటికీ ఇది ఎప్పుడూ అత్యవసర పరిస్థితి కాదని ఒక మహిళ గాంధీతో అన్నారు. ఇది దీర్ఘకాలిక జాతీయ వైద్య అత్యవసర పరిస్థితి అయినప్పటికీ, ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయం లేదని, మొత్తం తరం పిల్లల కోసం అది ఏమి చేస్తుందని, ప్రభుత్వం దానిపై ఎందుకు మౌనంగా ఉందని మరొక మహిళ ప్రశ్నించారు. మనం ఇప్పుడు చర్య తీసుకోకపోతే, రాబోయే 10 సంవత్సరాల్లో ఇది బాంబులా తయారవుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంగా, గత 15 రోజులుగా ఢిల్లీ చాలా పేలవమైన గాలి నాణ్యతతో పోరాడుతోంది. ఎయిర్ క్వాలిటీ ఎర్లీ వార్నింగ్ సిస్టమ్ అంచనా ప్రకారం రాబోయే కాలంలో గాలి నాణ్యత చాలా పేలవంగా ఉండే అవకాశం ఉంది.

## ప్రజలపై భారీ కుట్ర

### 'సర్' ప్రక్రియపై ఎస్‌పి చీఫ్ అఖిలేశ్ ధ్వజం



**లక్నో :** ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)పై ఎస్‌పి చీఫ్ అఖిలేశ్ యాదవ్ మరోసారి ఎన్నికల కమిషన్‌పై విరుచుకుపడ్డారు. దేశ ప్రజలకు వ్యతిరేకంగా చేస్తున్న ఒక భారీ కుట్ర అని, పౌరులను వలసవాద యుగం కంటే దారుణమైన స్థితిలోకి నెట్టివేస్తున్నారని మండిపడ్డారు. గురువారం సాయంత్రం తన అధికారిక ఎక్స్ హ్యాండిల్‌లో సర్ ప్రక్రియపై 20 సెకన్ల వీడియోను అఖిలేశ్ పోస్టు చేశారు. బిజెపి చేస్తున్న మెగా కుట్రను ఐక్యంగా బహిర్గతం చేయాలని అధికార నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డిఎ) మిత్రదేశాలతో సహా అన్ని ప్రతిపక్ష పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై మండిపడుతూ ఇది ప్రజాస్వామ్యానికి మోసమని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేడు ఓట్లు తొలగిస్తున్నారని, రేపు మధ్యతరగతి ప్రజల బ్యాంకు ఖాతాలు, లాకర్ల నుండి కూడా పేర్లు తొలగించబడతాయని ఆరోపించారు. సర్ ప్రక్రియ దేశ ప్రజలకు వ్యతిరేకంగా జరిగిన ఒక పెద్ద కుట్ర, ఇది వలసవాద యుగం కంటే చాలా దారుణమైన పరిస్థితికి దారితీస్తుందని, మేల్కొని ప్రతి ఓటును రక్షించాల్సిన సమయం అది అని ఉద్ఘాటించారు. ప్రస్తుతం బిజెపికి మద్దతు ఇస్తున్న పార్టీలు ముందుగా అంతమవుతాయని హెచ్చరించారు. అందువల్ల అన్నీ వదిలివేసి సర్ కింద జరుగుతున్న మోసాన్ని ఆపాలని పౌరులకు పిలుపునిచ్చారు. బిజెపి, దాని మిత్రపక్షాలు, రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌లోని కొంతమంది అవినీతి అధికారులు మొత్తం ఎన్నికల వ్యవస్థను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని అఖిలేశ్ ఆరోపించారు. బిజెపి నాయకులు, వారి మిత్రపక్షాలు బహిరంగంగా దోచుకున్న దేశాన్ని కాపాడటానికి, మన ఓటు ద్వారా ప్రాతినిధ్యం వహించే మన గుర్తింపును కాపాడుకోవడానికి మనం ఐక్యంగా ఉండాలని, లేకపోతే, రేపు వారు తమను తాము బయటి వ్యక్తులుగా ప్రకటిస్తారని పేర్కొన్నారు.

## రూ.5 కోట్లు ఇవ్వాల్సిందే

### గోల్డ్‌మ్యాన్ 'చిత్తోర్‌గఢ్ బప్పీలహరి'కి బెదిరింపులు

**జైపూర్:** చిత్తోర్‌గఢ్ బప్పిలహరిగా గుర్తింపు పొందిన వ్యాపారవేత్త కన్హయ్యలాల్ ఖాతిక్‌కు బెదిరింపులు వచ్చాయి. రాజస్థాన్‌లోని చిత్తోర్‌ఘడ్‌కు చెందిన అతడు తన మెడలో ఎప్పుడూ బంగారు ఆభరణాలు వేసుకుని తిరుగుతుంటాడు. సుమారు 3.5 కేజీల బంగారంతో అతను సంచరిస్తూ ఉంటాడు. పండ్ల వ్యాపారం చేసే కన్హయ్యలాల్‌కు గ్యాంగ్‌స్టర్ రోహిత్ గోదార గ్యాంగ్ నుంచి బెదిరింపులు వచ్చాయి. పోలీసుల కథనం ప్రకారం రెండు రోజుల క్రితం ఖాతిక్‌కు ఓ మిస్డ్‌కాల్ వచ్చింది. ఆ తర్వాత అదే నెంబర్ నుంచే వాట్సాప్ కాల్ చేశారు. ఆ కాల్ రిసీవ్ చేసుకోకపోవడంతో... ఆడియో మెసేజ్ చేశారు. రూ.ఐదు కోట్లు ఇవ్వాలంటూ ఆ మెసేజ్‌లో డిమాండ్ చేశారు. ఒకవేళ డబ్బులు చెల్లించకుంటే బంగారు ఆభరణాలు ధరించేందుకు అవకాశం ఉండదని హెచ్చరించారు. వీలైనంత త్వరగా విషయాన్ని సెటిల్ చేయాలన్నారు. డబ్బులు డిమాండ్ చేస్తూ మరోసారి కూడా తనకు ఫోన్ కాల్ వచ్చిందని ఖాతిక్ తెలిపాడు. సిటీ కోత్వాల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తోపుడు బండిపై ఒకప్పుడు కూరగాయలు అమ్మిన కన్హయ్యలాల్... యాపిల్స్ వ్యాపారంలో బాగా సంపాదించాడు. ఆ క్రమంలో అతడు బంగారు ఆభరణాలపై మోజు పెంచుకున్నాడు. 3.5 కేజీల బంగారాన్ని ధరిస్తూ చిత్తోర్‌ఘడ్ గోల్డ్‌మ్యాన్‌గా గుర్తింపు పొందాడు. గ్యాంగ్‌స్టర్ రోహిత్ గోదార.. బికనీర్ రెసిడెంట్. ప్రస్తుతం అతను కెనడాలో ఉన్నట్లు తెలుస్తోంది. దేశంలో వివిధ పోలీసు స్టేషన్లలో అతడిపై 32 కేసులు నమోదు అయ్యాయి. రాజస్థాన్‌లో వ్యాపారవేత్తల నుంచి అతడు డబ్బులు వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

## ఏదీ కోరను, తొందరపడను...

### డికె శివకుమార్



**బెంగళూరు :** కర్ణాటకలో నాయకత్వ మార్పు వ్యవహారం ముదురుతోంది. అధికార పంపిణీ వ్యవహారంపై తలెత్తిన ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను ఆయన నివాసంలో ఒక్కలిగ కమ్యూనిటీకి చెందిన ఆధ్యాత్మిక నేత నంజవదూత స్వామి శుక్రవారంనాడు కలుసుకున్నారు. డికెకు తమ మద్దతు ప్రకటించారు. దీనిపై డికె శివకుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీనే తన కమ్యూనిటీ అని, రాష్ట్రంలోని అన్ని సామాజికవర్గాలను తాను సమంగా చూస్తానని చెప్పారు. నాయకత్వ మార్పుపై అడిగినప్పుడు 'నేను ఏదీ కోరను. దేనికీ తొందరపడేది కూడా లేదు. దీనిపై మా పార్టీ నిర్ణయం తీసుకుంటుంది. నేను ఎప్పుడూ కమ్యూనిటీ కోణం నుంచి చూడను. కాంగ్రెస్ పార్టీనే నా కమ్యూనిటీ. సమాజంలోని అన్ని వర్గాలను అభిమానిస్తుంటాను' అని డికె సమాధానమిచ్చారు. సిఎం పోస్టు వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానం ఢిల్లీలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు ఊహాగానాలు వినిపిస్తుండగా, డికె మాత్రం ఇందుకు భిన్నంగా స్పందించారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నందున కర్ణాటక రైతుల సమస్యలను పార్టీ అధిష్ఠానం దృష్టికి తెచ్చేందుకు తాను ఢిల్లీ వెళ్తానని చెప్పారు. 'ఢిల్లీకి తప్పనిసరిగా వెళ్తాను. అది మా గుడి. కాంగ్రెస్‌కు సుదీర్ఘ చరిత్ర ఉంది. మాకు ఢిల్లీ నుంచే ఎల్లప్పుడూ మార్గదర్శకాలు ఉంటాయి. ఢిల్లీలో నాకు చాలా పని ఉంది. పార్లమెంటు శీతాకాల సమావేశాలు జరగనున్నాయి. కర్ణాటక ప్రాజెక్టులకు ముందుకు తీసుకు వెళ్లేందుకు పార్లమెంటు సభ్యులను నేను కలవాల్సి ఉంది. మా ముఖ్యమంత్రి కూడా సమస్యలను కేంద్రంతో కేంద్రం రైతులను ఆదుకోవడం లే దు' అని తెలిపారు.

**ఊహాగానాలను తోసిపుచ్చిన ప్రియాంక్ ఖర్గే**

రాష్ట్రంలో నాయకత్వ మార్పు జరగవచ్చనే ఊహాగానాలను కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే తోసిపుచ్చారు. దీనికి ముందు ఆయన డికె శివకుమార్‌ను కలుసుకున్నారు. పాలనాపరమైన సమస్య కారణంగానే తాను డికెను కలిసినట్టు ప్రియాంక్ ఖర్గే చెప్పారు. సిఎంను కూడా కలుస్తానని అన్నారు. ఏ నిర్ణయమైన అధిష్ఠానం తీసుకుంటుందని, అధిష్ఠానం పిలిచినప్పుడు తాము వెళ్తామని సీఎం, డిప్యూటీ సిఎం ఇప్పటికే చెప్పినందున మీడియా కూడా ఊహాగానాలకు చేయరాదని కోరారు. బిజెపినే ఈ ఊహాగానాలకు సృష్టిస్తోందని విమర్శించారు.

## 'నయా భారత్' ఎవరికీ తలవంచదు

### ప్రధాని నరేంద్ర మోడీ



**ఉడిపి:** నయా భారత్ ఎలాంటి బెదిరింపులకు తలొగ్గదని, దేశ పౌరుల రక్షణ కోసం ఎంత దూరమైనా వెళ్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు ఉగ్రదాడుల తర్వాత, ఎలాంటి ప్రతీకారం తీర్చుకోకుండా నిర్లిప్తంగా ఉండేవని విమర్శించారు. 'ఆపరేషన్ సుదర్శన్ చక్ర' దేశానికి 'భద్రత వలయాన్ని' అందిస్తుందని, ఎవరైనా శత్రువులు భారత్‌పై దాడి చేయడానికి ప్రయత్నిస్తే, వారిని సర్వనాశనం చేస్తుందని అన్నారు. కర్ణాటకలోని ఉడిపిలో జరిగిన లక్ష కంఠ గీత పారాయణ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది ఎర్రకోట నుంచి చేసిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో, ప్రధాని మోదీ 'సుదర్శన చక్ర మిషన్'ను ప్రకటించారు. రానున్న దశాబ్దకాలంలో భారత జాతీయ భద్రతను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ మిషన్‌ను ప్రారంభించామని స్పష్టం చేశారు. కాగా, ఉడిపిలో జరిగిన సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, 'శ్రీకృష్ణుడు యుద్ధ భూమిలో గీతా ప్రబోధం చేశాడు. శాంతి, సత్యాన్ని పునరుద్ధరించడానికి దుర్మార్గులైన శత్రువులను అంతం చేయడం ముఖ్యమని భగవద్గీత మనకు బోధిస్తుంది. ఇది జాతీయ భద్రత విధానానికి చెందిన సారాంశం. మనం వసుధైవ కుటుంబం అని నమ్ముతాం. 'ధర్మో రక్షతి రక్షితః' అనే మంత్రాన్ని పఠిస్తాం. అందుకే ఎర్రకోట నుంచి మేము శ్రీకృష్ణుని సందేశంతో మిషన్ సుదర్శన చక్రను ప్రకటించాం. దీని ద్వారా శత్రువులు మన దేశంలో చొరబడకుండా భద్రతా వలయాన్ని నిర్మించాం. ఒకవేళ శత్రువు దాడి చేయడానికి ధైర్యం చేస్తే, మన సుదర్శన చక్రం వారిని నాశనం చేస్తుంది' అని అన్నారు. పాక్ ముష్కరులు పహల్గాం దాడి చేసిన తర్వాత, ప్రతీకారం తీర్చుకోవాలనే దృఢ సంకల్పంతో మన దేశం ఆపరేషన్ సిందూర్ చేపట్టిందని మోదీ పేర్కొన్నారు. 'పహల్గాం ఉగ్రదాడిలో మన కర్ణాటకకు చెందిన సోదరులు, సోదరీమణులు బాధితులయ్యారు. మునుపటి ప్రభుత్వాలు ఉగ్రదాడుల తర్వాత ఎలాంటి ప్రతీకార దాడులు చేయలేదు. కానీ ఇది సరికొత్త భారతదేశం. శాంతిని ఎలా స్థాపించాలో, దానిని ఎలా కాపాడాలో మాకు తెలుసు. అందుకే మా ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. దీనిని దేశం మొత్తం చూసింది' అని మోదీ పేర్కొన్నారు. కర్ణాటకలో చేపట్టిన లక్ష కంఠ గీత పారాయణ కార్యక్రమంలో విద్యార్థులు, సాధువులు, పండితులు, వివిధ రంగాలకు చెందిన పౌరులు సహా లక్ష మందికి పైగా పాల్గొన్నారు. వీరందరూ భగవద్గీతను పారాయణం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ కృష్ణమందిరి ముందున్న సువర్ణ తీర్థ మండపాన్ని ప్రారంభించారు. పవిత్రమైన కనకన కిండి (కిటికీ ) కోసం బంగారు కవచాన్ని అంకితం చేశారు. వాస్తవానికి ఈ కిటికీ ద్వారానే కనకదాసు నేరుగా శ్రీకృష్ణుని దివ్యదర్శనం చూశాడని భక్తులు నమ్మకం.

### ప్రపంచంలోనే ఎత్తయిన శ్రీరాముడి విగ్రహాన్ని ఆవిష్కరించిన మోడీ



ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన శ్రీరాముడి విగ్రహాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం ఆవిష్కరించారు. దక్షిణ గోవాలోని శ్రీ సంస్థాన్ గోకర్ణ పర్తగాలీ జీవోత్తమ్ మఠంలో ఏర్పాటు చేసిన 77 అడుగుల కాంస్య విగ్రహాన్ని ప్రారంభించారు. మఠం 550వ వార్షికోత్సవం సందర్భంగా అక్కడ పర్యటించిన ప్రధాని మోదీ, విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ అశోక్ గజపతిరాజు, సిఎం ప్రమోద్ సావంత్, పలువురు రాష్ట్ర మంత్రులు హాజరయ్యారు. అంతకుముందు ప్రధాని నరేంద్ర మోదీ ఈ మఠంలో ఉన్న ఆలయాన్ని కూడా దర్శించారు. ఈ మఠం భారతదేశంలోనే అతి పురాతన మత సంస్థల్లో ఒకటిగా ప్రాచుర్యం పొందింది. గుజరాత్‌లో ఉన్న 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ'ని తీర్చిదిద్దిన శిల్పి రామ్ సుతార్ శ్రీరాముడి విగ్రహాన్ని కూడా తయారుచేశారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి, కొడుకు సహా నలుగురు మృతి

**ఉత్తర్‌ప్రదేశ్/మిర్జాపూర్:** రోడ్డు పక్కన నిలిచిన ట్రక్కును కారు ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు సభ్యులతో సహా నలుగురు వ్యక్తులు మరణించారని పోలీసులు తెలిపారు. ఈ ఘటన శుక్రవారం ఉదయం కటక సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ప్రయాగ్‌రాజ్ నుండి వారణాసికి వెళ్తున్న కారు డ్రైవర్ వాహనాన్ని అదుపు తప్పి రోడ్డు దాటుతున్న ఇద్దరు పాదచారులను ఢీకొట్టడంతో రోడ్డు పక్కన నిలిచిన ట్రక్కును ఢీకొట్టింది. పాదచారులు కొన్ని మీటర్ల దూరం విసిరివేయబడ్డారని సర్కిల్ ఆఫీసర్ అమర్ బహదూర్ సింగ్ తెలిపారు. ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జయిపోయిందని తెలిపారు. ప్రయాగ్‌రాజ్‌లోని సొరాన్‌లో నివాసం ఉంటున్న శ్యామ్‌కృష్ణ యాదవ్ (55), అతని కుమారుడు అనురాగ్ యాదవ్ (30)గా గుర్తించారు. ఈ ఘటనలో మృతి చెందిన ఇద్దరు పాదచారులను సరోజ్ (40), భోలు (35)గా గుర్తించామని పోలీసులు తెలిపారు. క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారని, మృతదేహాలను పోస్ట్ మార్టంకు తరలించినట్లు వారు తెలిపారు.



## 'ఆధార్'తో బర్త్ సర్టిఫికెట్ల జారీ రద్దు

**న్యూఢిల్లీ:** ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు పుట్టిన తేదీ సర్టిఫికేట్ జారీ కోసం ఆధార్ కార్డులను ప్రమాణికంగా తీసుకోబోమని పేర్కొన్నాయి. ఆధార్ కార్డుకు బర్త్ సర్టిఫికేట్‌ను జోడించడం లేదని, దాన్ని జన్మ ధృవీకరణ పత్రంగా భావించడం లేదని ఉత్తరప్రదేశ్ ప్రణాళికశాఖ స్పెషల్ సెక్రటరీ అమిత్ సింగ్ బన్సాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వం కూడా ఇలాంటి ఆదేశాలే జారీ చేసింది. బర్త్ సర్టిఫికేట్ జారీ చేసేందుకు ఆధార్ కార్డును ఓ డాక్యుమెంట్‌గా ఆమోదించబోమని చెప్పింది. జనన, మరణ రిజిస్ట్రేషన్ సవరణ చట్టం 2023 తర్వాత ఆధార్ కార్డు ఆధారంగా నమోదు అయిన బర్త్ సర్టిఫికేట్లను రద్దు చేయనున్నట్లు వెల్లడించింది. అక్రమంగా జరుగుతున్న నకిలీ జనన, మరణ ధృవపత్రాల జారీని అడ్డుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఆధార్ కార్డులతో అనుమానాస్పద రీతిలో జారీ చేసిన అన్ని సర్టిఫికేట్లను రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

### దేశ సార్వభౌమత్వం, భద్రత విషయంలో...

## భారత్ ఎట్టి పరిస్థితుల్లో రాజీపడదు

### కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టీకరణ



**న్యూఢిల్లీ:** భారతదేశం శాంతి, సంభాషణను విశ్వసిస్తుందని, అయితే దేశ సార్వభౌమత్వం, భద్రత విషయానికి వస్తే ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడదని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నొక్కిచెప్పారు. శుక్రవారం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగిస్తూ ప్రస్తుత ప్రపంచ వాతావరణంలో భారతదేశం సమతుల్యత, బాధ్యత యొక్క స్వరంగా మారిందని ఇండోపసిఫిక్, గ్లోబల్ సౌత్‌లోని దేశాలు న్యూఢిల్లీని నమ్మకమైన భాగస్వామిగా చూస్తున్నాయని ఆయన అన్నారు. భారతదేశం ఆర్థికవృద్ధి, సాంకేతిక సామర్థ్యాలు, సూత్రప్రాయమైన విదేశాంగ విధానం మారుతున్న ప్రపంచ వాతావరణంలో సమతుల్యత, బాధ్యత యొక్క స్వరంగా మారాయన్నారు. ఇండోపసిఫిక్, గ్లోబల్ సౌత్‌లోని దేశాలు మమ్ములను నమ్మకమైన భాగస్వామిగా చూస్తున్నాయని తెలిపారు. చాణక్య రక్షణ సంభాషణలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. భారతదేశం బాధ్యతాయుత భావన, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి, నాగరికత విలువలలో పాతుకుపోయిన విశ్వాసంతో ప్రపంచ చర్చలను రూపొందిస్తుందని రాజ్‌నాథ్‌సింగ్ నొక్కి చెప్పారు. విప్లవాత్మక సంస్కరణల కారణంగా దేశాల సార్వభౌమత్వాన్ని నియమాల ఆధారిత క్రమాన్ని గౌరవించడం పట్ల దాని స్థిరమైన వైఖరి కారణంగా భారతదేశం ప్రపంచ విశ్వాసాన్ని సంపాదించుకుందని వివరించారు. 'భద్రత, కనెక్టివిటీకి మద్దతుగా భారత్ సరిహద్దు, సముద్ర మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తోంది. కొత్త వేదికలు, సాంకేతికతలు, నిర్మాణాల ద్వారా మేం మా దళాలను కూడా ఆధునీకరిస్తున్నాం' అని రక్షణమంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో యుద్ధక్షేత్రాలను రూపొందించే స్టార్టప్‌లు, డీప్‌టెక్ సామర్థ్యాలు, పరిశోధన, అభివృద్ధిలో భారతదేశం పెట్టుబడులు పెడుతోందని సింగ్ చెప్పారు.

## యుపిలో అంబేద్కర్ విగ్రహం ధ్వంసం



**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లో మరో అంబేద్కర్ విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు. వరుసగా ఇది ఐదవ ఘటనగా పోలీసులు శుక్రవారం తెలిపారు. యూపీలోని గద్వార్ ప్రాంతంలో కొందరు గుర్తు తెలియని దుండగులు అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. దీంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తత చెలరేగిందని పోలీసులు అన్నారు. రాంపూర్ అస్లీ గ్రామంలోని గద్వార్‌నాగ్రా రహదారి వెంబడి ఏర్పాటు చేసిన విగ్రహం వేలును బుధవారం రాత్రి కొందరు దుండగులు ధ్వంసం చేశారు. ఆగ్రహించిన గ్రామస్తులు నిరసన చేపట్టారు. ఇది ఈ ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహాలు లక్ష్యంగా జరిగిన ఐదవ దాడిగా పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటన అనంతరం సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ (ఎస్‌డీఎం) రవి కుమార్, సిటీ సర్కిల్ ఆఫీసర్ ఉస్మాన్, ఇతర పోలీస్, పరిపాలనాధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని, రక్షణ సరిహద్దు గోడ, సీసీటీవీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానికులు వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు. ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు.

## ఎమ్మెల్యేపై అత్యాచారం కేసు

**తిరువనంతపురం:** కేరళ కాంగ్రెస్ ఎమ్మెల్యే రాహుల్ మామ్‌కుటత్తిల్‌పై అత్యాచారం కేసు నమోదైంది. తనపై రాహుల్ అత్యాచారానికి పాల్పడ్డాడని, అనంతరం గర్భం తొలగించుకోవాలని బెదిరించాడని కేరళకు చెందిన ఓ యువతి ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. తాము కొంతకాలం కలిసున్నామని, తనకు బిడ్డ కావాలని బలవంతం చేసి, గర్భం దాల్చిన తర్వాత అబార్షన్ చేయించుకోవాలని రాహుల్ బెదిరింపులకు పాల్పడ్డాడని యువతి తన ఫిర్యాదులో పేర్కొంది. వీరిద్దరి మధ్య జరిగిన సంభాషణకు సంబంధించిన ఆడియో రికార్డులు, వాట్సప్ స్క్రీన్‌షాట్‌ల ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే రాహుల్ స్పందిస్తూ తాను ఏ తప్పు చేయలేదన్నారు. కుట్రపూరితంగా తనపై కేసు నమోదు చేశారని, దీనిని చట్టపరంగా ఎదుర్కొంటానన్నారు. ప్రజలు, న్యాయస్థానం ముందు తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటానన్నారు.

### మణిపూర్‌లోని టెంగ్నౌపాల్ జిల్లాలో

## అసోం రైఫిల్స్ పెట్రోలింగ్ బృందంపై కాల్పులు

**గువహతి/ఇంఫాల్:** మణిపూర్‌లోని టెంగ్నౌపాల్ జిల్లాలో శుక్రవారం అస్సాం రైఫిల్స్ పెట్రోలింగ్ బృందంపై గుర్తుతెలియని ఉగ్రవాదులు కాల్పులు జరిపారని రక్షణ ప్రతినిధి తెలిపారు. పౌర భద్రతను పరిగణనలోకి తీసుకుని భద్రతా సిబ్బంది 'వెంటనే నియంత్రణ మరియు జాగ్రత్తతో ప్రతిస్పందించారు' అని అధికారి తెలిపారు, ఈ ప్రాంతం మయన్మార్ సరిహద్దుకు దగ్గరగా ఉందని తెలిపారు. ప్రస్తుతం ఆపరేషన్లు జరుగుతున్నాయి, ఈ ప్రాంతంలో అదనపు దళాలను మోహరించారని ఆయన అన్నారు. ప్రాణనష్టం జరిగిందో లేదో వెంటనే తెలియదని ప్రతినిధి తెలిపారు.

ప్రజాపక్షం
శనివారం, 29 నవంబరు

# కాంగ్రెస్ కర్ణాటక సంక్షోభం

భారత జాతీయ కాంగ్రెస్‌కు ఎన్నికల్లో ఎన్ని ఎదురుదెబ్బలు తగులుతున్నా, అధికారం చేతికందటం అరుదైన లక్షణంగా మారుతున్నా దాని వ్యవహార శైలిలో మార్పురాకపోవటం ఓ విచిత్రం. ఒకనాడు–దీర్ఘకాలం ఆసేతు హిమాచలం గుత్తాధికారం అనుభవించిన, చెలాయించిన పార్టీ జాతీయస్థాయి నాయకత్వం రీత్యా, రాష్ట్రాల్లో అధికారం రీత్యా పలచబడినప్పటికీ, అధికారం అరుదైన చోట సైతం పదవులకోసం కుమ్ములాడుకునే, ప్రతిష్ట దిగజార్చుకునే పాత లక్షణం వెంటబడి తరుముతూనే ఉంది. ఇప్పుడు అధికారంలో ఉన్నదే ముచ్చటగా మూడు రాష్ట్రాలు – హిమాచల్‌ప్రదేశ్, కర్నాటక, తెలంగాణ. కర్నాటక రాష్ట్రంలో రాజకీయాధికారం రగడ అపహాస్యంగా తయారైంది. నెలల తరబడి దాన్ని చక్కదిద్దలేని నిస్సహాయత, అసమర్థత అధిష్టానవర్గంగా పిలవబడే జాతీయ నాయకత్వంలో ఉంది. అధిష్టానవర్గం కూడా సోనియా గాంధి, రాహుల్‌గాంధి, అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేలకు కుంచించుకుపోయింది. వారిలో ఖర్గే కర్నాటకకు చెందినవారు. స్వరాష్ట్రంలో కాంగ్రెస్‌లో అంతర్గత సంఘర్షణను నివారించలేని లేదా పరిష్కరించలేని నిస్సహాయస్థితిలో ఉన్నారాయన. కారణం?

కర్నాటకలో రెండున్నర సంవత్సరాలక్రితం అసెంబ్లీ ఎన్నికలనాటికే కాంగ్రెస్‌లో రెండు బలమైన వర్గాలున్నాయి. పిసిసి అధ్యక్షుడిగా ఉన్న డి.కె.శివకుమార్ కుబేరుడు, సాంప్రదాయకంగా పార్టీపై పట్టున్న వ్యక్తి. రెండో ధృవం మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య. వీరు దేవగౌడ నాయకత్వంలోని జనతాదళ్ (సెక్యులర్) నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన వెనుకబడిన తరగతులకు చెందిన నాయకుడు. దక్షిణాదిలో తమ ప్రవేశానికి ముఖద్వారంగా కర్నాటకను భావించిన భారతీయ జనతాపార్టీ అంతర్గత కుమ్ములాటలవల్ల అధికారం పునరుద్ధరించుకోలేక చతికిలబడింది. దాని అసమర్థపాలనతో విసుగెత్తిన కర్నాటక ఓటర్లు కాంగ్రెస్‌కు పట్టంగట్టారు. కాంగ్రెస్ వారు అధికారంలో లేనప్పుడు ఐక్యంగా పనిచేస్తారన్న నానుడి నిజమైంది. అయితే ఎన్నికల ఫలితాలు వస్తూనే ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య పోటీ మొదలైంది. తన బిసి నేపథ్యంవల్లనే విజయం వరించిందని సిద్ధరామయ్య భావిస్తే, పిసిసి అధ్యక్షునిగా పార్టీకి తన సారథ్యం వల్లనే ప్రతిపక్షంలోని కాంగ్రెస్‌కు పరిపాలనయోగం పట్టిందని శివకుమార్ భావించి ఉంటారు. ఆ వెనుక లింగాయత్, వక్కళిగ శక్తులు, మఠాలు ఉండనే ఉంటాయి. ఆ పరిస్థితిలో కాంగ్రెస్ హైకమాండ్ కర్నాటక నేతలిద్దర్ని ఢిల్లీ రప్పించి మంతనాలు జరిపి రాజీ చేసింది. ఈ 'ఐదుగురు ఒప్పందం' ప్రకారం సిద్ధరామయ్య, శివకుమార్‌లు చెరో రెండున్నర సంవత్సరాలు ముఖ్యమంత్రి పదవిలో ఉంటారని అప్పుడు బయటకొచ్చిన మాట. దాన్ని నెరవేర్చాలని శివకుమార్ వర్గం ఇప్పుడు డిమాండ్ చేస్తోంది. 'నోటి మాట ప్రపంచంలోనే శక్తిమంతమైంది' అని శివకుమార్ స్వయంగా అన్నారు.

ఆ సమయం సమీపిస్తున్నందున శివకుమార్ అనుచర నాయకులు ఢిల్లీ చేరుకుని అధికార పీఠం మార్పు గూర్చి ఖర్గేమీద ఒత్తిడి తేవటం మొదలుపెట్టారు. సిద్ధరామయ్య, శివకుమార్ ఇద్దరూ అధిష్టానం మాటకు బద్ధులమని అంటూనే ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. కొద్ది నెలలుగా కొనసాగుతున్న ఈ గందరగోళం పార్టీ ప్రతిష్టకు నష్టం చేస్తుందని అధిష్టానవర్గానికి తెలుసు. పార్టీ శాసనసభ్యుల్లో తనకే మెజారిటీ ఉందని, వచ్చే రెండు బడ్జెట్లు తానే సమర్పిస్తానని సిద్ధరామయ్య. మెజారిటీ–మైనారిటీ సమస్య పక్కనబెడితే రాహుల్‌గాంధి ఇప్పుడు ఒబిసిలకు న్యాయం చేకూర్చే రాజకీయం నడుపుతున్నాడు. తమిళనాడు, కేరళలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్న తరుణంలో బిసి అయిన సిద్ధరామయ్యను తొలగిస్తే అది పార్టీకి నష్టమన్న ఆందోళన ఆయనలో ఉండవచ్చు. అందువల్ల కాంగ్రెస్ పార్టీకి కర్నాటక చిక్కు సమస్యగా తయారైంది. సిద్ధరామయ్య మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు అనుమతి కోరుతుండగా, శివకుమార్ ముందుగా ముఖ్యమంత్రి విషయం తేల్చాలంటున్నారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు అధిష్టానం అనుమతి ఇస్తే అది సిద్ధరామయ్య పూర్తి పదవీ కాలానికి సంకేతమవుతుందని ఆయన అనుయాయులు ఆశపడుతున్నారు.

ఈ సంక్షోభ పరిష్కారాన్ని పార్టీ అధిష్టానం ఇంకా జాప్యం చేయలేదు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి శివ కుమార్‌లను ఢిల్లీ పిలిపించి చర్చలు జరుపుతామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే గురువారంనాడు చెప్పారు. దానినిబట్టి అధిష్టానం ఒక నిర్ణయానికి వచ్చినట్లుగా భావించవచ్చు. సత్వర నిర్ణయం తీసుకుని సర్దుబాటు చేయటమే పార్టీకి ప్రయోజనం. అందువల్ల వచ్చేవారంలో కర్నాటక సంక్షోభానికి తెరపడుతుందని ఆశించుదాం.

# స్వచ్ఛమైన నీరే ప్రాణాధారం

మానవునికి, సమస్త జీవ రాశికి ఆహారం తర్వాత కావలసిన దివ్య ఔషధం నీరు. నేడు పరిశుభ్రమైన నీరు సేవనం లేకపోవడం వల్ల కోట్లాదిమంది వివిధ రకాల జబ్బుల తో బాధ పడుతూ వున్నారు. జలమే జీవనం..జీవితం. మంచి స్వచ్ఛమైన తాగునీరు వాడకం మన శరీర రోగాల బారినపడకుండా సంరక్షించే ఒక గొప్ప సంజీవని అని చెప్పవచ్చు. శుభ్రమైన తాగునీరు వాడకం మన ఆరోగ్య పరిరక్షణకు ఔషధం. చక్కటి శరీర సౌష్టవానికి, మన శరీరం జబ్బుల బారిన పడకుండా ఉండటానికి ఉచితమైన మెడిసిన్ ఏదైనా ఉందంటే అది ఒక్క శుద్ధ చేసిన నీరు మాత్రమే! వేకువజామున రెండు మూడు గ్లాసుల గోరు వెచ్చని నీరు సేవించామంటే చాలు మన లో అంతరంగ శరీరం లో వున్న నిస్సత్తువ తొలిగిపోయి రోజంతా మన శరీరం ఎనలేని ఉత్సాహాన్ని సంతరించుకుంటుంది. ముఖ్యంగా మండు వేసవిలో తగినంత సమపాళ్ళలో స్వచ్ఛమైన నీరు సేవించడం మూలాన మన బాడీ డిహైడ్రేషన్ బారిన పడకుండా అత్యంత సురక్షితంగా ఉంటుంది!

అందుకనే ప్రజలందరూ స్వచ్ఛమైన నీరును సేవిస్తూ మంచి ఆరోగ్యవంతులుగా జీవించాలనే ఏకైక లక్ష్యంతో మన రాష్ట్ర ప్రభుత్వం వారు అనేక ప్రాంతాల్లో, పట్టణాల్లో, పల్లెల్లో ఉచిత బోర్లు వేస్తూ ప్రజలందరిలో జల కళ తీసుకువచ్చేలా అవిరళ కృషి సల్పుతున్నది. మిషన్ కాకతీయ ద్వారా ప్రతి ఇంటికి నల్లా సరఫరా చేయాలన్న లక్ష్యం పూర్తిస్థాయిలో నెరవేరడం లేదు. ఏదిఏమైనా స్వచ్ఛమైన నీటివాడకం అనేది మన ఆయుష్షును అమాంతం పెంచడమే కాకుండా మనం దీర్ఘకాలిక వ్యాధుల బారినపడకుండా సదా ఆరోగ్యవంతులుగా జీవించేందుకు మనకు ఒక గొప్ప సువర్ణ అవకాశాన్ని కల్పిస్తుంది.

ఏమైనా స్వచ్ఛమైన త్రాగునీరు అందించే ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావు.ఒక విధంగా చెప్పాలంటే మన శరీరాన్ని జబ్బుల మయం చేసుకొని హాస్పిటల్స్ చుట్టూ తిరుగుతూ,డాక్టర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ వారికి చెల్లించే ఫీజుల రూపంలో మన జేబులకు అమాంతం చిల్లుపడకుండా చేసుకోవాలంటే మాత్రం స్వచ్ఛమైన మంచి త్రాగునీరు సేవనం మనందరికి అత్యంత ఆవశ్యకం. ఎనలేని ఉపయోగకరం! ఇందులో ఎలాంటి సందేహానికి తావు లేదు. నేడు ప్రతి గ్రామంలో గుర్తింపు లేని వాటర్ ప్లాంట్లు విచ్చలవిడిగా వెలిశాయి.అధిక మోతాదులో వివిధ కెమికల్స్ కలిపి విక్రయిస్తున్నారు. ఐ.యస్.ఐ గుర్తింపు లేని వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి వాని ద్వారా ప్రతి ఇంటికి నామ మాత్రపు డబ్బుతో నీటిని సరఫరా చేస్తున్నారు. వాని ద్వారా వివిధ నొప్పులు, కాళ్ళు లాగడం లాంటివి సంభవించి అనారోగ్యం పాలు అవుతూ వున్నారు. ప్రభుత్వం, అధికారుల నిఘా తగ్గి విచ్చలవిడిగా నీటి ప్లాంట్స్ వెలిస్తు వున్నాయి. స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసే బాధ్యత ప్రభుత్వానిది.

# జాగ్వార్ల సంరక్షణతోనే అడవికి ఆరోగ్య భరోసా

అమెరికాలో అతిపెద్ద అడవి పులి అయిన జాగ్వార్ పాంథేరా ఓంకా మన గ్రహంలోని వృక్ష,జంతుజాల సమతుల్యానికి అత్యంత కీలకమైన జంతువు. జాగ్వార్ పెద్ద పిల్లి జాతిగా భావించబడుతుంది. దట్టమైన అరణ్యాలలో, చిత్తడి నేలల్లో ఉండటానికి ఇష్టపడుతుంది. దీని పొడవు ఆరు అడుగుల పై ఉండి 160 కిలోల వరకు బరువు ఉంటుంది. లేత పసుపు గోధుమ రంగు చర్మాన్ని కలిగి ఉండి శరీరం మొత్తం రోసెట్ లుగా మారే నల్లని, నారింజ వర్ణంతో కప్పబడి ఉంటుంది. చర్మంపై ఉండే ఈ రోసెట్ల ముద్రలు జాగ్వార్లను ఒక్కోదానికి ఒక్కోలా, ప్రత్యేకంగా ఉండే ప్రకృతి ప్రసాదించిన గుర్తింపు లక్షణం. అమెజాన్, పాంటనాల్ వంటి అడవుల్లో ఇది అంతా నిర్వహణంగా జీవ వ్యవస్థలను నిలబెడుతోంది. జాగ్వార్ అనగా శక్తి. మెసోఅమెరికన్, మాయా నాగరికత, సంస్కృతిలో జంతువుల రాజుగా, పవిత్ర జంతువుగా భావించారు.

**ప్రత్యేకమైన వేట శైలి :** జాగ్వార్ జీవనశైలి కూడా అత్యంత విశిష్టమైనది. ఇవి సాధారణంగా ఒంటరిగా జీవిస్తాయి. వృక్షాలతో సంచరిస్తూ ప్రధానంగా రాత్రివేళ వేటాడుతుంది. జాగ్వార్లు తమ మధ్య సహనం, స్నేహ భావనతోనే ఉంటాయి. సుదూర సంభాషణలు కోసం గర్జనను వినియోగించుకుంటాయి. సహజంగా 10 నుండి 12 సంవత్సరాలు జీవిస్తాయి. విస్తీర్ణతతో తన ప్రదేశానికి హద్దులు నిర్ణయిస్తుంది. గట్టి శరీరం, అత్యంత బలమైన దవడలు, తక్కువ శక్తితో ఎక్కువ ఫలితమిచ్చే వేట వ్యూహం దీనికి సహజ బలాన్ని ఇస్తాయి. ఇతర పెద్ద పిల్లులు గొంతును లక్ష్యంగా చేస్తే జాగ్వార్ నేరుగా తలపై కాటు వేసి బలిని వెంటనే నిర్వీర్యం చేస్తుంది. నీటిలో అద్భుతంగా ఈదగలగడం వల్ల చేపలు, కైమన్ వంటి చిన్న మొసళ్ళను కూడా సులభంగా పట్టుకుంటుంది. అంతర్జాతీయ జాగ్వార్ దినోత్సవం ప్రతి సంవత్సరం నవంబర్ 29 తేదీన ప్రపంచ సమాజానికి జాగ్వార్ రక్షణకు ఒక గంభీర సందేశం ఇస్తుంది. 2018లో పాంథెరా ఐక్యరాజ్యసమితి ప్రారంభించిన జాగ్వార్ 2030 రోడ్‌మ్యాప్ ద్వారా అమెరికా, మెక్సికో నుంచి అర్జెంటీనా వరకు ఉన్న జాగ్వార్ కారిడార్‌లను పునరుద్ధరించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. కెమెరా ట్రాప్‌లు, ఉపగ్రహ కాలర్లు స్పాటిల్ కాప్చర్, రికాప్చర్ నమూనాల సహాయంతో శాస్త్రవేత్తలు సంరక్షణ పథకాలు రూపొందిస్తున్నారు. ఎకోటూరిజం ద్వారా స్థానిక సమాజాలను భాగస్వాములుగా చేస్తూ పర్యావరణ ఆర్థిక సమతుల్యత సాధిస్తున్నారు. జాగ్వార్ల సంరక్షణ ద్వారా ప్రకృతి సమతుల్యతను సాధించవచ్చు.

## పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పట్ల

# అంబేద్కర్ దార్శనికత, సవాళ్లు



డి.రాజా
ప్రధాన కార్యదర్శి, సిపిఐ

నవంబర్ 26న మనం రాజ్యాంగ దినం జరుపుకున్నాం. రాజ్యాంగం మన ప్రజాస్వామ్యాన్ని తీర్చిదిద్దుతున్నది. మరికొద్ది రోజులకు, డిసెంబర్ 1న పార్లమెంటు శీతాకాల సమావేశం మొదలవుతుంది. 15 సిట్టింగ్‌లు ఉంటాయని భావించబడుతున్నది. వాటిలో మూడు ప్రైవేటు మెంబర్ బిజినెస్‌కు కేటాయించబడ్డాయి. మరికొద్ది రోజులకు, డిసెంబర్ 6న, దేశం మన రాజ్యాంగ ముఖ్య రూపశిల్పి అయిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి జరుపుకుంటుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఎంతో గట్టిగా, ధైర్యంగా సమర్థించిన వారిలో అంబేద్కర్ ఒకరు. ఈ సంవత్సరం ఈ మూడు తేదీలు అతిదగ్గరగా రావటం క్యాలెండర్ వరుస క్రమాన్ని మించిన ప్రాముఖ్యతగలవి. మన రిపబ్లిక్ ఆరోగ్యాన్ని, హరించుకుపోతున్న శాసనసంస్థల (పార్లమెంటు, అసెంబ్లీలు) పనితీరును, మన ప్రజాస్వామిక జీవితానికి కేంద్రకమైన జవాబుదారీతనాన్ని తిరిగి పొందవలసిన అత్యవసరాన్నీ పరిశీలించేందుకు అవి లెన్స్‌లాగా పనిచేస్తాయి.

రాజ్యాంగ నిర్ణాయక సభ మన రిపబ్లిక్ భవిష్యత్ స్వరూపాన్ని చర్చిస్తున్నప్పుడు అంబేద్కర్ స్పష్టంగా అధ్యక్షతరహా వ్యవస్థను (అధ్యక్ష తరహా ప్రభుత్వరూపం) తిరస్కరించారు. భారతదేశానికి కార్యనిర్వాహకవర్గం నిరంతరం లెజిస్లేచర్‌కు బాధ్యురాలిగా ఉండే వ్యవస్థ కావాలని, ఏ ఒక్క వ్యక్తికీ తిరుగులేని అధికారం ఉండకూడదని అన్నారు.

''రాజకీయాలు, భక్తి లేదా హీరో ఆరాధన దిగజారుడుకు, అంతిమంగా నియంతృత్వానికీ దారితీస్తుందని'' అంబేద్కర్ చెప్పిన మాట ప్రసిద్ధి పొందింది. ఒక మహోన్నత నాయకుడు లేదా సంస్థ చేతిలో అధికారం ఉంచే వ్యవస్థకన్నా సమష్టి బాధ్యతతో కూడిన నమూనాను ఆలింగనం చేసుకోమని భారతీయులకు ఆయన విజ్ఞప్తి చేశారు. అప్పుడు పార్లమెంటరీ వ్యవస్థారీతి ఎంచుకోబడింది. బ్రిటిష్ పాలన ద్వారా అది ఎక్కువ ప్రాచుర్యం పొందిందని దాన్ని ఎంచుకోలేదు; అది సహజసిద్ధంగానే మరింత జవాబుదారీతనం గలదీ, చర్చలకు అవకాశమున్నదీ, ప్రజల సర్వసత్తాక అభీష్టాన్ని ప్రతిబింబించేదీ కావటంవల్ల దాన్ని ఎంచుకున్నారు.

అయితే, ఈ సంవత్సరం రాజ్యాంగ దినం నుంచి అంబేద్కర్ వర్ధంతి రోజుకు మనం ప్రయాణిస్తున్నప్పుడు ఆయన వ్యక్తీకరించిన ఆదర్శాలకు, మన కళ్లముందు కనిపిస్తున్న వాస్తవికతకు మధ్య జాగా విస్తృత మైనట్లు కనిపిస్తున్నది. ఈ దిగజారుడు మరెక్కడికన్నా, పార్లమెంటు పనితీరులోనే మరింత స్పష్టంగా కనిపిస్తున్నది. ''మన ప్రజాస్వామ్యానికి నాడీ కేంద్రం''గా అంబేద్కర్ అభివర్ణించిన సంస్థ దాని స్ఫూర్తి, ఆచరణ రెండింటిలోనూ అణచివేయబడుతున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. తొలి లోక్‌సభ సంవత్సరంలో 135 రోజులు సమావేశమైంది. చర్చలు, అసమ్మతి, బలమైన పరిశీలనకు అవకాశం కలిగింది. నాల్గవ లోక్‌సభ కూడా సగటున 123 రోజులు సమావేశాలు జరిపింది. అయితే ఇటీవల సంవత్సరాలు ఈ తగ్గుదలను చారిత్రకంగా అతి తక్కువస్థాయికి తీసుకెళ్లాయి. 16వ లోక్‌సభ వార్షిక సగటు 66 సిట్టింగ్‌లు, 17వ లోక్‌సభ మరీ అధమంగా 55 సిట్టింగ్‌లకు దిగజారింది. 1952 నుంచి ఇదే అత్యంత తక్కువ రోజులు సమావేశాలు జరిపిన లోక్‌సభ. 17వ లోక్‌సభ 15 సెషన్స్‌లో 11 అర్థాంతరంగా వాయిదా పడ్డాయి. దాంతో జరగాల్సిన 40 సిట్టింగ్‌లు రద్దయినాయి, పార్లమెంటు నిర్ణీత పనిదినాల్లో సుమారు 13 శాతం దేశం కోల్పోయింది. 2020లో లోక్‌సభ మొత్తం సంవత్సరంలో 33 రోజులు మాత్రమే సమావేశమైంది. ఈ వ్యవస్థ రాజ్యాంగం ఆశించిన దానికి విరుద్ధంగా ఎంతగా దిగజారిందో ఇది కొట్టొచ్చినట్లు తెలియజేస్తున్నది.

17వ లోక్‌సభ దాని మొత్తం 5సంవత్సరాల కాలంలో 274 సార్లు మాత్రమే సమావేశమైంది. భారత పార్లమెంటరీ చరిత్రలో పూర్తి కాలం పనిచేసిన సభలో అతి తక్కువ సిట్టింగ్‌లు జరిగింది ఈ లోక్‌సభ టరంలోనే. పనిచేసిన కాలం తగ్గిపోయింది అంటే ప్రభుత్వ పనితీరును పరీక్షించే కాలం తగ్గిపోయినట్లే. 17వ లోక్‌సభ ఆమోదించిన 179 బిల్లుల్లో (ఫైనాన్స్, అప్రోప్రియేషన్ బిల్లు మినహాయించి) 35శాతం గంటలోపు చర్చతోనే ఆమోదం పొందాయి. ప్రవేశపెట్టిన బిల్లుల్లో 16శాతం మాత్రమే రాజకీయ పక్షపాత ఒత్తిళ్లు లేకుండా సవివరంగా స్క్రూటినీ చేసేందుకు ఉద్దేశించిన పార్లమెంటరీ కమిటీలకు నివేదించబడ్డాయి. అంటే సిట్టింగ్స్ కుదించుకుపోయినందున ప్రభుత్వం ఆగమేఘాలమీద అతి కొద్దిసమయం చర్చతో బిల్లులు ఆమోదించుకుంది. పార్లమెంటు పనితీరు డొల్లగా తయారైనందున కార్యనిర్వాహకవర్గం జవాబుదారీతనం తగ్గిపోయింది.

పార్లమెంటరీ వ్యవహారసరళి ఈ విధంగా దిగజారటం ఆందోళనకరమైన కొత్తధోరణిలో మరింతగా ప్రతిబింబిస్తున్నది. ఆ ధోరణి ఏమంటే, అధికారపక్ష సభ్యులు సభా కార్యక్రమాలను అడ్డుకుంటున్నారు. ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్‌లు మీదుమిక్కిలి పెరిగాయి. పాలకపార్టీ సభ్యులు సభ హుందాతనాన్ని తుంగలోతొక్కి, ఉద్దేశపూర్వకంగా చర్చలను స్తంభింపచేయటం ద్వారా చర్చలు కుదించటానికి తోడ్పడుతున్నారు.

ప్రతిపక్ష సభ్యులను అతి తరచుగా సస్పెండ్ చేయటం, చట్టసమ్మతమైన ప్రశ్నలు లేవనెత్తినందుకు కూడా సస్పెండ్ చేయటం పార్లమెంటును ఏకపక్ష గోదాగా మార్చుతున్నది. ఇది కార్యనిర్వాహక అధికారం – లెజిస్లేటివ్ స్క్రూటినీ మధ్య అసమతౌల్యాన్ని పెంచుతున్నది. ఈ వక్రీకరణ యాదృచ్ఛికం కాదు. మన ప్రజాస్వామ్యంలో ప్రజల సర్వసత్తాక అభీష్టాన్ని ప్రతిబింబించే పార్లమెంటును ఒక కేంద్రీకృత, ఒక భావజాలంతో పనిచేసే కార్యనిర్వాహకవర్గానికి లోబడి ఉండే సాధనంగా కుదించే ఉద్దేశపూర్వక ప్రయత్నాలలో ఇది భాగం.

అంబేద్కర్ కచ్చితంగా ఈ ప్రమాదం గూర్చే హెచ్చరిక చేశారు. భారతదేశం సంస్థలకన్నా నాయకులను పైకెత్తే రాజకీయ వాతావరణంలో నిరంకుశ దగ్గరిదార్లతో రాజ్యాంగబద్ధ పద్ధతులను తొలగించవచ్చునని ఆయన భయాందోళన వ్యక్తం చేశారు.

కీలకమైన సంస్థలను – దర్యాప్తు సంస్థల నుంచి నియంత్రణ (రెగ్యులేటరీ) సంస్థల వరకు, విశ్వవిద్యాలయాల నుంచి మీడియా వరకు అవి అధికారం లో ఉన్నవారి ప్రాపంచిక దృక్పధాన్ని పంచుకునేటట్లు నెట్టబడుతున్న వ్యవస్థ ఆవిర్భవించటాన్ని మనం ఈనాడు చూస్తున్నాం. అవి కార్యనిర్వాహకవర్గంపై అదుపులుగా వ్యవహరించే బదులు ఒక నిర్దిష్టమైన భావజాలానికి విస్తరణలుగా పనిచేయటం పెరుగుతున్నది. అవి రాజ్యాంగ విలువలైన సమానత్వం, సౌభ్రాతృత్వం, సెక్యులరిజం, ప్రజాస్వామిక జవాబుదారీతనంలను తరచూ కసితో ధిక్కరిస్తున్నాయి.

వ్యవస్థల మధ్య ఈ అసమతౌల్యం మధ్య తరచూ విస్మరించబడుతున్న మరో ఆందోళనకరమైన ప్రమాదం ఉంది. అది భారతదేశ సమాఖ్య వ్యవస్థను (ఫెడరలిజం) బలహీనపరచటం. అంబేద్కర్, రాజ్యాంగ సభ ఇతర సభ్యులు భారత్ ఒక యూనిటరీ (ఏకవ్యక్తి లేక వ్యవస్థ) కమాండ్‌గా కాకుండా ''యూనియన్ ఆఫ్ స్టేట్స్''గా ఉండాలని – అంటే సమాఖ్య వ్యవస్థగా ఉండాలని నిర్ద్వంద్వంగా వక్కాణించారు. అంటే కేంద్రం(యూనియన్), రాష్ట్రాలు ఒకటి నుంచి మరొకటి కాకుండా రాజ్యాంగం నుంచి తమ అధికారం పొందుతాయి. అయితే నేడు ఫెడరలిజమే ఒత్తిడిలో ఉండటం మనం చూస్తున్నాం.

ద్రవ్య అధికారాలను కేంద్రం తన చేతిలోకి తీసుకోవటం పెరుగుతున్నది. కేంద్రం–రాష్ట్రాల మధ్య పన్నుల సొమ్ము పంపిణీ తగ్గిపోవటంలో, కేంద్ర ప్రాయోజక పథకాలపై ఆధారపడటం పెరుగుతుండటంలో, జిఎస్‌టి కౌన్సిల్ పనితీరులో దీన్ని మనం చూస్తున్నాం. దీనివల్ల తమ ప్రజలకు కావలసిన పథకాలు రూపొందించడంలో రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి కుంచించుకుపోతున్నది. శాసనాలు నిరోధించడానికి, ఆమోదముద్ర వేయటాన్ని జాగు చేయటానికి లేదా ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వాల్లో జోక్యం చేసుకోవటానికీ గవర్నర్‌లను తరచుగా, పక్షపాతంతో ఉపయోగించటం, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో రాజకీయ ప్రత్యర్థులకు వ్యతిరేకంగా కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించటం పెరుగుతుండటంతో రాజ్యాంగ సాధనాలు వేధింపు సాధనాలుగా మార్చబడుతున్నాయి.

ప్రభుత్వ సంస్థల మధ్య సంభాషణల అవకాశాలు క్షీణించడం, అంతర్ రాష్ట్ర మండలి వంటి సంస్థలను పక్కన పెట్టడం వల్ల అంబేద్కర్ తలపోసిన సహకార స్ఫూర్తిని హరిస్తున్నది. ప్రజాస్వామ్యపు ఫెడరల్ పునాదులు బలహీనపడినప్పుడు అది ఆరోగ్యంగా ఉండజాలదు. రాష్ట్రాల నోరునొక్కటం అంటే అది అంతిమంగా అవి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజల నోరు నొక్కటమే అవుతుంది.

ఈ కేంద్రీకృత విధానం పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. పార్లమెంట్ సంవత్సరంలో సగటున 55 రోజులే సమావేశ మైనప్పుడు, పార్లమెంటరీ స్క్రూటినీ కుప్పకూలినప్పుడు, అసమ్మతిని అవిధేయతతో సమానంగా చూచినప్పుడు, ప్రశ్నల స్థానంలో ఉత్తర్వులు జారీ అవుతున్నప్పుడు, జవాబుదారీతనం స్థానంలో ముఖస్తుతి ప్రవేశించినప్పుడు రిపబ్లిక్ బలహీనపడడం మాత్రమే జరగదు. ఆ వ్యవస్థ అప్రకటిత ఫాసిజంలోకి దిగజారుడును ప్రతిబింబిస్తుంది. ఏ ప్రజాస్వామ్యం రాత్రికిరాత్రి కూలిపోదు. అది నెమ్మదిగా, ఒక సంస్థ తర్వాత మరో సంస్థ వంతున కోతకు గురవుతాయి.

అందువల్ల అంబేద్కర్ దోహదాలను ఎలా స్మరించుకుంటున్నామన్నది ప్రశ్నకాదు. ఆయన దార్శనికతను ఎలా గౌరవిస్తున్నామన్నది ప్రశ్న. ప్రజలను ఎన్నడూ ప్రేక్షకులుగా కుదించరాదని ఆయన విశ్వసించారు. ఏ దేశం పార్లమెంటు అయితే అతి తక్కువ దినాలు సమావేశమవుతుందో,అరుదుగా చర్చలు జరుపుతుందో, ప్రతిపక్షం నోరు ఎక్కువగా మూయిస్తుంటుందో ఆదేశం ఆ దార్శనికతనుంచి దూరం జరుగుతున్నట్లు భావించాలి.

ఈ క్షీణింపును వెనక్కు మళ్లించడం, జవాబుదారీతనాన్ని పునరుద్ధరించటం మన రాజకీయ జీవిత ప్రాథమిక లక్ష్యం కావాలి. జవాబుదారీతనం కోసం పోరాటం మూడు రంగాల్లో ఏకకాలంలో ప్రారంభించాలి. అవి రాజకీయ, భావజాల, లీగల్ రంగాలు. రాజకీయ రంగంలో పోరాటం ప్రజాస్వామ్యయుత నిజాయితీకి ప్రాధాన్యతయిచ్చే ప్రజా సమీకరణ, ఎన్నికల్లో సరైన ఎంపికల ద్వారా జరగాలి. భావజాలరంగంలో పోరాటం పిడివాద కథనాలకు వ్యతిరేకంగా రాజ్యాంగ విలువల పునరుద్ధాటన ద్వారా జరగాలి. లీగల్ రంగంలో పోరాటం నిరంకుశ కార్యనిర్వాహక ఉత్తర్వులను సవాలు చేస్తూ, కోర్టులు, బహిరంగ వేదికల్లో వ్యవస్థాగత స్వాతంత్ర్యాన్ని సమర్థిస్తూ జరగాలి.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి కొత్త జవసత్వాలు చేకూర్చటానికి ప్రతి క్యాలెండర్ సంవత్సరంలో పార్లమెంటు కనీసం 100 రోజులు సమావేశం కావాలని ఆదేశించటం ఒక నిర్దిష్టమైన చర్య అవుతుంది. ఇది ప్రతీకాత్మక డిమాండ్ కాదు, వ్యవస్థాగత అవసరం. మరిన్ని రోజులు సమావేశం కావటం చర్చలకు, ప్రభుత్వ చర్చలను, బిల్లులను మరింతగా స్క్రూటినీ చేసేందుకు సహజంగానే సమయం ఇస్తుంది. తమ ఫిర్యాదులను, ఆందోళనలను వ్యక్తీకరించేందుకు ప్రతిపక్షానికి వేదిక అవుతుంది. ప్రజాస్వామిక నిర్ణయాలు చేసే కేంద్రంగా పార్లమెంటును తిరిగి పునఃప్రతిష్ఠిస్తుంది. భారతదేశం తన జాతీయ చట్టసభను లాంఛనప్రాయ సంస్థగా నిర్వహిస్తూ తమది ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యం అని చెప్పుకోజాలదు.

మనం రాజ్యాంగ దినం నుంచి అంబేద్కర్ వర్ధంతి దిశగా ప్రయాణించేటపుడు ఈ ఆలోచనలు పదునైన అర్థం అందించాలి. రాజ్యాంగం సంవత్సరంలో ఒకసారి వేడుకచేసుకునే డాక్యుమెంట్ మాత్రమే కాదు. లేక అంబేద్కర్ పూలమాలలతో గౌరవించుకునే విగ్రహం మాత్రమేకాదు. ఆ రెండూ, జవాబుదారీతనంపై ఆధికారం ఆధిపత్యం వహించటాన్ని నిరోధించేందుకై మనం ప్రతినెల, ప్రతి సమావేశంలో, ప్రతిరోజు వినియోగించవలసిన నిఘాకు ప్రాతినిధ్యం వహిస్తాయి. ప్రజాస్వామ్యం బలం ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పు సైజుతో కొలవబడదు. దానికున్న అదుపులు, సమతులనాలను బట్టి, తమ సర్వసత్తాక అభీష్టాన్ని పరిరక్షించుకునేందుకు తన ప్రజలకున్న ధైర్యాన్నిబట్టి కొలవబడుతుంది.

భారతదేశ భౌగోళిక స్వరూపాన్ని తిరిగి కూర్పుచేయటానికి ఫాసిస్టు శక్తులు (ఆర్ఎస్ఎస్ – బిజెపి) ప్రయత్నిస్తున్న ఈ సమయంలో కార్యాచరణకు పిలుపు సుస్పష్టం; జవాబుదారీతనాన్ని తిరిగిపొందుదాం, లేదా అంబేద్కర్ సహాయంతో నిర్మించబడిన రిపబ్లిక్‌ను కోల్పోయే ప్రమాదం ఎదుర్కొందాం. భారతదేశ ప్రజాస్వామ్య ఆత్మకోసం పోరాటాన్ని అవిశ్రాంతంగా, సమష్టిగా, రాజ్యాంగం ఇచ్చిన హామీ పట్ల అరమరికలులేని నిబద్ధతతో సాగించాలని డాక్టర్ అంబేద్కర్ వారసత్వం మనకు గుర్తుచేస్తున్నది.

**అధికారం ఎల్లపుడూ, ప్రజలకు మాత్రమే చెందుతుంది అనేది రాజ్యాంగం ఇచ్చిన హామీ!**

# చైనాకు భారత ఎగుమతులు పెరిగాయా!

## జనాలకు గోదీ మీడియా చెబుతున్న నిజానిజాలేమిటి?



ఎం.కోటేశ్వరరావు

చైనాకు ఏడు నెలల్లో 25 శాతం పెరిగిన భారత ఎగుమతులు. మీడియాలో కొద్ది రోజుల క్రితం వచ్చిన శీర్షిక ఇది. ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు వరుసగా ఏడు నెలల నుంచీ పెరుగుతూనే ఉన్నాయి. మంచిదే, మన ఎగుమతులు ఏమాత్రం పెరిగినా సంతోషించాల్సిందే. అయితే అసలు కథేమిటంటే నరేంద్రమోదీకి భజన చేసేందుకు అలవాటుపడిన వారు చేసిన జిమ్మిక్కు ఇది. నిజంగా జరిగిందేమిటి? గతేడాదితో పోలిస్తే ఎగుమతులు పెరిగిన మాట నిజం. ఇదే సమయంలో చైనా నుంచి దిగుమతులు అంతకంటే ఎక్కువగా పెరిగిన సంగతి, పదేండ్ల క్రితం స్థాయికి ఎగుమతులు పడిపోయిన నిజాన్ని జనాలకు చెప్పరేం! నరేంద్రమోదీ ఏలుబడి పదకొండు సంవత్సరాలను మూడు భాగాలుగా విభజిద్దాం. 2014–15 నుంచి 2018–19 మధ్య కాలంలో చైనాకు మన ఎగుమతులు 11.96 నుంచి 16.75 బిలియన్ డాలర్లకు పెరిగాయి. తరువాత మూడు సంవత్సరాలలో 21.56 బిలియన్ డాలర్లకు చేరాయి. అప్పటి నుంచి 2024–25లో 14.25 బిలియన్ డాలర్లకు పతనమయ్యాయి. గత ఏడాది తొలి ఏడు నెలలతో పోల్చి చూపి వర్తమాన సంవత్సరంలో 10.03 బిలియన్ డాలర్లకు 25శాతం పెరిగినట్లు చిత్రించారు. మిగిలిన ఐదు నెలల కాలంలో గత ఏడాది మొత్తాలకు చేరవచ్చు, స్వల్పంగా పెరగవచ్చు తప్ప గతంలోని 21.56 బిలియన్ డాలర్లకు చేరే స్థితి ఉందా ? చైనాకు మన ఎగుమతులు పెరగటం వెనుక అంతర్జాతీయ రాజకీయాలు కూడా లేకపోలేదు. అమెరికా వైపు మొగ్గుచూపుతున్న నరేంద్రమోదీకి పన్నుల రూపంలో ట్రంప్ తీసుకున్న వైఖరి మింగుడు పడలేదు. ఈ స్థితిలో ఎత్తుగడ కావచ్చు, అవసరం కావచ్చు. చైనా ఏప్రిల్ నుంచి మన దేశం నుంచి దిగుమతులను పెంచింది. చైనాకు మన మార్కెట్‌ను ఎంతగా తెరిస్తే దానికి ప్రతిగా మనకూ మేలు చేకూరే విధంగా బీజింగ్ వ్యవహరిస్తుందని వేరే చెప్పనవసరం లేదు. చైనా పెట్టుబడులను స్వీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. మన దేశం నుంచి విమానాలను నడిపేందుకు రెండు చైనా కంపెనీలు దరఖాస్తు చేసినట్లు తాజా వార్తలు వెల్లడించాయి.

చైనా మీద ఆధారపడకూడదు, దాన్ని పక్కకు నెట్టేసి అసలు మనమే ప్రపంచానికి వస్తువులను ఎగుమతులు చేద్దాం అంటూ పైకి ఎన్ని కబుర్లు చెప్పినా అలాంటి సూచనలు లేవు.తొలి ఏడు నెలల్లో ఎగుమతులు పెరిగాయని చెప్పిన వారు అదే సమయంలో చైనా నుంచి దిగుమతులు 57.65 నుంచి 64బిలియన్ డాలర్లకు పెరిగాయని చెబితే నిజాయితీగా ఉంటుంది. గత సంవత్సరం చైనాతో మన వాణిజ్య లోటు 99.12 బిలియన్ డాలర్లు. దీన్నే మరోవిధంగా చెప్పాలంటే నరేంద్రమోదీ సర్కార్ అసమర్థతకు బీజింగ్‌కు మనం చెల్లించిన మూల్యం. ఇంకా చెప్పాలంటే గత పదకొండు సంవత్సరాల్లో 701.95 బిలియన్ డాలర్లు సమర్పించుకున్నాం. మోడీ అధికారానికి వచ్చిన తొలి ఏడాది మన వాణిజ్య లోటు 48.45 బిలియన్ డాలర్లు కాగా పదకొండేండ్లలో రెట్టింపై 99.21 బి.డాలర్లకు చేరింది, ఎందుకని? గత ఐదు సంవత్సరాల్లో చైనాకు మన ఎగుమతులు 33శాతం పడిపోగా దిగుమతులు 74శాతం పెరిగాయి. ఆత్మనిర్భరత ఏమైనట్లు, ప్రపంచంలో పెరిగినట్లు చెబుతున్న మోదీ పలుకుబడి సంగతేమిటి? కాంగ్రెస్ యాభై ఏండ్లలోచేయలేని వాటిని తాను తొలి ఐదేండ్లలోనే చేసినట్లు గతంలో చెప్పుకున్నారు. సంతోషం. వర్తమాన అవసరాలకు అనుగుణంగా వస్తూత్పత్తిని ఎందుకు చేయలేకపోయినట్లు? రెండింజన్ల పాలనే కదా ఉన్నది. యాపిల్ ఐఫోన్లను తయారు చేస్తున్నాం, ఎగుమతి చేస్తున్నాం చూడండి అంటూ ప్రచారం చేస్తున్నారు. మిగతా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల సంగతేమిటి? గ్లోబల్ ట్రేడ్ రిసర్చ్ ఇనిస్టిట్యూట్(జిటిఆర్ఐ ఇండియా) చెప్పిన దాని ప్రకారం కీలకమైన ఎనిమిది పారిశ్రామిక ఉత్పత్తుల విషయంలో చైనా ప్రధాన సరఫరాదారుగా ఉంది. చైనా నుంచి దిగుమతుల వలన రెండు రకాల నష్టాలు, ఒకటి మన స్థానిక పరిశ్రమలు గిడసబారిపోతున్నాయి, కార్మికులకు ఉపాధి దొరకటం లేదు. విలువైన విదేశీమారక ద్రవ్యాన్ని చైనాకు సమర్పించుకుంటున్నట్లు ముందే చెప్పుకున్నాం. గత కాంగ్రెస్ పాలనకూ మోడీ ఏలుబడికి తేడా ఏమిటి? చైనా నుంచి దిగుమతుల్లో మన్మోహన్ సింగ్ రికార్డులనే కాదు, తన రికార్డులను కూడా తానే మోదీ బద్దలు కొట్టుకున్నారు. చైనాతో తిరిగి సత్సంబంధాలను నెలకొల్పుకొనటం మంచిదే. కానీ అనేక వస్తువుల దిగుమతులపై ఆంక్షలను సడలించిన కారణంగా గత రికార్డులను అధిగమించే సూచనలు కనిపిస్తున్నా యి.

అమెరికాతో వాణిజ్య ఒప్పందం గురించి గత పదినెలలుగా చెబుతూనే ఉన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేతతో సహా అన్నీ



డోనాల్డ్ ట్రంప్ చెబుతున్నట్లే జరుగుతున్నందున అనేక అనుమానాలు. ఇంతవరకు ఏం జరుగుతోందో జనానికి తెలియదు. ట్రంప్ చెబితే తప్ప మనకు తెలిసేట్లు లేదు, మన మార్కెట్‌ను వారి వస్తువులకు బార్లా తెరవాలని అమెరికా వత్తిడి తెస్తోంది. అదే జరిగితే స్థానిక పరిశ్రమలు, వాణిజ్యాలను మూసుకోవాల్సిందే అని మన కార్పొరేట్లు హెచ్చరిస్తున్నాయి. వర్తమాన ఆర్థిక సంవత్సరం తొలి ఏడునెలల్లో మన ఎగుమతులు ఎక్కువగా అమెరికాకు జరిగితే దిగుమతులు చైనా నుంచి జరిగాయి. ఇదేం కుదరదు అన్నీ మా నుంచే దిగుమతి చేసుకోవాలని ట్రంప్ బెదిరిస్తున్నాడు. అసలు సంగతేమిటంటే చైనా నుంచి తక్కువ ధరలకు వస్తున్నాయి గనుక దిగుమతి చేసుకుంటున్నాం తప్ప షీ జింపింగ్ మీద ప్రేమతో కాదు. అమెరికాకు చోటిస్తే ఎడారి వ్యాపారి, ఒంటె కథ మాదిరి దేశీయ సంస్థలను బయటకు నెట్టేయటం లేదా మింగివేస్తుంది. అందుకనే రెండు దేశాలతో సమన్వయం చేసుకోవటం మోదీకి కత్తిమీద సాములా ఉంది. రానున్న రోజుల్లో మనకు మేలు జరిగే విధంగా విదేశాంగ విధానం ఉండాలని ఇప్పటికే కార్పొరేట్ల లాబీ మాట్లాడుతోంది. కరవమంటే కప్పకు విడవమంటే పాముకు కోపం !

మన దేశ వస్తు ఎగుమతులను చూస్తే 2024లో 434.44 బిలియన్ డాలర్లు కాగా దిగుమతులు 6987.02 బి.డాలర్ల మధ్య ఉన్నాయి. నిఖర వాణిజ్యలోటు 263.31బిలియన్ డాలర్లు. ఎగుమతుల్లో అమెరికా 18.3, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ 8.5, నెదర్లాండ్స్ 5.6, సింగపూర్ 3.6, చైనా 3.4, బ్రిటన్ 3.2, సౌదీ అరేబియా 2.8, బంగ్లాదేశ్ 2.6, జర్మనీ 2.4, ఇటలీ 1.92శాతాల చొప్పున ఉన్నాయి. 2024 జనవరి నుంచి జూన్ వరకు వివరాలు చూస్తే మన దేశం 151దేశాలతో వాణిజ్య మిగులు, 75దేశాలతో తరుగులో ఉంది. మోడీ భక్తులు, చూశారా మా నేత పలుకుబడి అని డబ్బా కొట్టుకోవటానికి ఈ అంకెలు తప్ప వాస్తవ పరిస్థితి ఏమిటోపైన చెప్పుకున్నాం. పదకొండు సంవత్సరాల్లో పరాధీనతను తగ్గించటానికి మోదీ చేసిందేమీ లేదు. మన దిగుమతులను చూస్తే 2024లో చైనా నుంచి 15.5, రష్యా 9.1, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ 8.6, అమెరికా 6.1, సౌదీ అరేబియా 4.3, ఇరాక్ 4.2, ఇండోనేషియా 3.4, స్విట్జర్లాండ్ 3.1, దక్షిణ కొరియా 3, సింగపూర్ 2.9శాతం చొప్పున ఉన్నాయి.

మన ఎగుమతులు, దిగుమతులు రెండు రకాలు. ఒకటి వస్తువులు, రెండవది సేవలు. వస్తు లావాదేవీల్లో 2014–15లో లోటు 137 బిలియన్ డాలర్ల నుంచి 2024–25 నాటికి 283బి.డాలర్లకు పెరిగింది. సేవల విషయంలో ఇదే కాలంలో మిగులు 74 నుంచి 189 బిలియన్ డాలర్లకు పెరిగింది. రెండింటినీ కలిపి చూసినపుడు నిఖర లోటు 63 నుంచి 94 బిలియన్ డాలర్లకు పెరిగింది. ప్రపంచంలో 2024లో మొత్తం 24.5లక్షల కోట్ల డాలర్ల విలువగల వస్తు ఎగుమతులు జరగ్గా ఎగువన ఉన్న 30దేశాల వాటా 20.3లక్షల కోట్ల డాలర్లు. మొదటి స్థానంలో ఉన్న చైనా వాటా 14.6 శాతం ఉండగా పద్దెనిమిదవదిగా మనదేశ వాటా కేవలం 1.8శాతమే, రష్యా, స్విట్జర్లాండ్ కూడా ఇదే వాటాను కలిగి ఉన్నాయి. చైనాను వెనక్కు నెట్టేయాలన్న సంకల్పాన్ని ఎవరూ కాదనరు, పోటీ పడాల్సిందే. కానీ ఒక్కసారిగా ఈ పరిస్థితి మారాలన్నా, 2047 నాటికి దేశాన్ని ఎక్కడికో తీసుకుపోవాలన్నా నరేంద్రమోదీ అల్లావుద్దీన్ అద్భుత దీపాన్ని సంపాదించాల్సిందే.

## ఎన్నికల నేపథ్యంలో నలుగురు బైండోవర్

హాజీపూర్ ఎస్ఐ స్వరూప్‌రాజ్

**ప్రజాపక్షం/హాజీపూర్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం నలుగురు వ్యక్తులను తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండే ఎదుట బైండోవర్ చేశామని హాజీపూర్ ఎస్ఐ స్వరూప్ రాజ్ తెలిపారు. ఎన్నికల సమయంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. హాజీపూర్‌కు చెందిన రౌడీ షీటర్లు అసాధి చైతన్యకుమార్, మెట్పల్లి రవి, ఇతర కేసుల్లో ప్రమేయం ఉన్న వేంపల్లికి చెందిన మడుగుల నరసయ్య, ఆవుల రామచందర్లను తహసీల్దార్ ఎదుట శుక్రవారం హాజరుపరిచారు. ఏడాది పాటు సత్ప్రవర్తనతో ఉంటామని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఆరు నెలల జైలు లేదా లక్ష రూపాయల జరిమానా చెల్లించేలా వారిని బైండోవర్ చేశారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ పెట్టెం రాజేందర్ పాల్గొన్నారు.

## మండల కేంద్రాన్ని కప్పేసిన మంచు దుప్పటి



**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం 6 గంటలకు పొగమంచు కమ్ముకుని వాహనదారులను, ప్రజలను పరేషాన్ చేసింది. జాతీయ రహదారిపై ప్రయాణాలు సాగించే వాహనదారులు ఉదయం పనులకు వెళ్లే ప్రజలు రహదారి కనిపించకుండా పొగమంచు కమ్ముకుందా ఎదురుగా వాహనాలు పొగమంచుతో కనిపించక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 6 గంటలన ఉండి 9 గంటల వరకు కూడా పొగమంచు వీడలేదు. గ్రామంలో పొగమంచు కమ్ముకుని అందరినీ ఆహ్లాదపర్చింది. తెల్లవారు జాము వరకు పొగమంచు ఉండటంతో చిన్నారులు కేరింతలు కొట్టారు.

# పకడ్బందీగా నామినేషన్ల ప్రక్రియ

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్



**ప్రజాపక్షం/మెదక్ :** గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ పకడ్బందీగా జరగాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శుక్రవారం హవేలీ ఘనపూర్ మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్లు రెండో రోజు ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా సాగేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటించాలని, అభ్యర్థులకు సమాన అవకాశాలను కల్పించాలని, అలాగే నామినేషన్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ, శాంతియుత వాతావరణం ఉండేలా చూడాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణం స్పందిస్తూ సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మొదటి విడత నామినేషన్లకు 29వ తేదీ చివరి రోజు కావడంతో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంటుందని అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. నామినేషన్ పత్రాలు అధికంగా ఉంచాలని, నామినేషన్లు వెంట వెంటనే స్కాన్ చేసి ఎన్నికల సంఘానికి పంపించేందుకు జిపిఒలను అదనపు సిబ్బందిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో మీడియా సెంటర్ ప్రారంభం

కలెక్టర్ పి.ప్రావీణ్య



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకొని కలెక్టరేట్‌లోని డిపిఆర్ఒ కార్యాయలంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసిఎం)ను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి.ప్రావీణ్య అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. మీడియా కోసం అందుబాటులో ఉన్న సదుపాయాలను ఎంసిఎంసి విధుల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్, అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఎంసిఎంసి సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం సకాలంలో ప్రచార ప్రకటనలకు సంబంధించిన అనుమతులు మంజూరు చేయాలని ఆమె సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను గమనిస్తూ ఎప్పటికప్పుడు అప్రమత్తం కావాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పారదర్శకంగా నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడానికి మీడియా సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఎంసెంసి కమిటీ సభ్యులు డిపిఆర్ఒ విజయలక్ష్మి అడిషనల్ పిఆర్ఒ ఏడుకొండలు, మీడియా ప్రతినిదులు డిపిఆర్ఒ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గడువులోగా వచ్చిన నామినేషన్లనే స్వీకరించాలి



కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/దండేపల్లి :** సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు అభ్యర్థులు సమర్పించే నామినేషన్లను నిర్ణీత గడువులోగా మాత్రమే స్వీకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన దండేపల్లి మండలంలోని కొర్విచెల్మ, నెల్కివెంకటాపూర్, ద్వారక, మ్యాదరిపేట, దండేపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 29న సాయంత్రం 5 గంటల లోగా వచ్చిన నామినేషన్లు మాత్రమే స్వీకరించాలని, ఆ సమయానికి కేంద్రం గేట్లు మూసివేయాలని స్పష్టం చేశారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, గుర్తుల కేటాయింపులో నిబంధనలు పాటించాలన్నారు. కేంద్రాల వద్ద ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల వివరాలు ప్రదర్శించాలని, 100 మీటర్ల పరిధిలో గుంపులుగా ఉండకూడదని సూచించారు. జిల్లాలో మొదటి విడతలో 90 సర్పంచ్, 816 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు.

అనంతరం ద్వారకలో వసతి గృహ నిర్మాణ పనులను, లక్సెట్టిపేట మండలం ఇటిక్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ అందిస్తున్నామని, రైతుల వివరాలు ట్యాబ్లో నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎంపిడిఒ ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## హిల్ట్ పాలసీపై బహిరంగ చర్చకు

## మంత్రి ఉత్తమ్ సిద్ధమా?



బిజెఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి సవాల్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (హెచ్ఐఎల్‌టి) పాలసీపై బహిరంగ చర్చకు రావాలంటూ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బిజెఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సవాల్ విసిరారు.

ఈ పాలసీపై ప్రతిపక్షాలకు అర్థం కాలేదంటూ మంత్రి చేసిన వ్యాఖ్యలు ఆయన దివాళాకోరుతనానికి నిదర్శనం అని మహేశ్వర్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ విధానంలో పారదర్శకత ఉంటే, దానిపై చర్చించేందుకు అసెంబ్లీని ఎందుకు సమావేశపరచడంలేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. హిల్ట్ పాలసీ అత్యంత పారదర్శకంగా ఉందని మంత్రి ఉత్తమ్ చెప్పడం నిజమైతే, ఈ విధానంపై బహిరంగ చర్చకు సిద్ధమా అని మహేశ్వర్ రెడ్డి సవాల్ విసిరారు. ఓపెన్ డిబేట్‌కు మంత్రి సిద్ధపడితే శనివారం ఉదయం 11 గంటలకు అసెంబ్లీ మీడియా పాయింటులో జర్నలిస్టుల సమక్షంలో చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అసెంబ్లీలో చర్చించిన తర్వాతే హిల్ట్ పాలసీని అమలు చేయాలని,ఈ పాలసీని అమలు చేసేందుకు జారీ చేసిన జీవో 27ను తక్షణమే రద్దు చేయాలని ఆయన కోరారు.లేదంటే,భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఈ పాలసీ రద్దుకు భారీ ఉద్యమం చేపడతామని మహేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు.

## రోడ్డు మరమ్మతు పనులు

## యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రజలకు రవాణా సదుపాయం మెరుగుపర్చేందుకు వీలుగా చేపడుతున్న రోడ్డు మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బ తిన్న ప్రధాన రహదారులకు మరమ్మతులు జరిపిస్తుండగా క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న పనులను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద బైపాస్ రోడ్డు మార్గంలో డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ ఎదురుగా ప్రధాన రహదారిపై కొనసాగుతున్న రోడ్ల మరమ్మతు పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులను పూర్తి చేయించాలనిఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. పనులు నాణ్యతతో చేపట్టేలా పకడ్బంధీ పర్యవేక్షణజరపాలని, పది కాలాల పాటు ఈ పనులు ప్రజలకు ఉపయుక్తంగా నిలిచేలా మన్నికగా జరిపించాలని సూచించారు. కాగా, నగరంలో గోల్‌హనుమాన్ నుండి పూసలగల్లికి వెళ్లే మార్గంలో రోడ్డు మరమ్మతులు చేపట్టాల్సి ఉన్న ప్రాంతాలను సైతం కలెక్టర్ పరిశీలించారు. పనులను ఇంకనూ ప్రారంభించకపోవడంపట్ల ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, వారం, పది రోజుల అనంతరం తాను మరోమారు క్షేత్ర స్థాయి పరిశీలన చేయటంతో పాటు పనుల ప్రగతిని సమీక్షిస్తానన్నారు. కలెక్టర్ వెంట ఆర్‌అండ్‌బి ప్రవీన్, నగరపాలక సంస్థ సహాయ కమీషనర్ రవీందర్సాగర్, ఇనాయత్ ఉన్నారు.

## రైలు మార్గంలో రేషన్ బియ్యం పట్టివేత



ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/సిర్పూర్(టి) :** సిర్పూర్(టి) రైల్వే మార్గం ద్వారా జరుగుతున్న అక్రమ రేషన్ బియ్యం రవాణాపై అధికారులు స్పందించి బియ్యాన్ని పట్టుకున్నారు. 'ప్రజాపక్షం' కథనాల ప్రభావంతో పౌరసరఫరాల శాఖ అధికారులు శుక్రవారం రైల్వే స్టేషన్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిర్పూర్(టి)తో పాటు పక్క మండలాల నుంచి బియ్యం సేకరించి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. రవాణాలో మహిళల భాగస్వామ్యం ఎక్కువగా ఉండటంతో వారిని గుర్తించడం కష్టంగా మారిందని తెలిపారు. అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలంటే రైల్వే సిబ్బంది, ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి శాఖల సమన్వయం అవసరమని పేర్కొన్నారు. బియ్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సివిల్ సప్లయ్ డిటిలు రాజ్ కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కష్టపడ్డ కార్యకర్తలకు కాంగ్రెస్‌లో సముచిత స్థానం

ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావ్

సామాన్య కార్యకర్తకు దక్కిన గౌరవం

కామారెడ్డి డిసిసి అధ్యక్షుడు మల్లికార్జున్



**కామారెడ్డి :** కష్టపడ్డ కార్యకర్తలకు పార్టీ పదవుల్లో, నామినేటెడ్ పదవులలో, స్థానిక సంస్థల ఎన్నికల్లో సముచిత స్థానం కల్పిస్తామని జుక్కల్ నియోజకవర్గ ఎంఎల్‌ఎ తోట లక్ష్మి కాంతారావ్ చెప్పారు. కామారెడ్డి జుక్కల్ నియోజకవర్గ ముద్దుబిడ్డ, నిజాం సాగర్‌కు చెందిన ఎలె మల్లికార్జున్‌కు డిసిసి అధ్యక్ష పదవి రావడం జుక్కల్‌కు గర్వకారణమన్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఇటీవల నియమించిన కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షుడు మల్లికార్జున్‌కు కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ఎంఎల్‌ఎ తోట లక్ష్మి కాంతారావ్ శుక్రవారం జిల్లాలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావ్ పల్లి క్రాస్ రోడ్ నుండి పిట్లం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సన్మాన సభలో తోట లక్ష్మి కాంతారావ్ మాట్లాడుతూ ఎలె మల్లికార్జున్ నిఖార్సైన కాంగ్రెస్ కార్యకర్త అని, జిల్లాలో పార్టీ యంత్రాంగాన్ని నడిపించే సత్తా ఉన్న నాయకుడన్నారు. స్థానిక ఎన్నికల్లో జుక్కల్‌లో అన్ని స్థానాలను గెలిపించి సిఎం రేవంత్ రెడ్డికి కానుకగా ఇవ్వాలన్నారు. కామారెడ్డి డిసిసి అధ్యక్షుడు ఎలె మల్లికార్జున్ మాట్లాడుతూ 'నేను డిసిసి అధ్యక్షుడిని కావడం నా లాంటి సామాన్య కార్యకర్తలకు లభించిన గౌరవం, గుర్తింపు. కామారెడ్డి జిల్లాలో పార్టీ బలోపేతంపై దృష్టి సారించడంతో పాటు కామారెడ్డిని కాంగ్రెస్ కంచుకోటగా మారుస్తా. కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా నడుచుకుంటా' అన్నారు. సభలో జుక్కల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

## నీళ్ల చారు.. ఉడికీ ఉడకని అన్నం



**ప్రజాపక్షం/కౌటాల :** పాఠశాలలో మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉందంటూ విద్యార్థులు ఆకలి కేకలతో రోడ్డెక్కారు. కౌటాల మండల కేంద్రంలోని జెడ్‌పిఎస్ఎస్ పాఠశాలలో నిత్యం నాణ్యత లేని భోజనం పెడుతున్నారని నిరసిస్తూ ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం పేద విద్యార్థుల ఆకలి తీర్చడానికి ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకం ఇక్కడ అపహాస్యం పాలవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం గుడ్డు, కూరగాయలు ఉండటం లేదని, కేవలం నీళ్ల చారు, ఉడికీ ఉడకని అన్నం వడ్డిస్తున్నారని వాపోయారు. సరిగ్గా ఉడకని అన్నం తినలేక, ఆకలితో అలమటిస్తూ తరగతుల్లో కూర్చోలేక ఇబ్బంది పడుతున్నామని విద్యార్థులు పేర్కొన్నారు. ఈ విషయంపై పలుమార్లు విన్నవించినా ప్రధానోపాధ్యాయుడు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు.

## పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రజల మద్దతు

మానాల మోహన్‌రెడ్డి

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల మొదలైనప్పటి నుండి స్థానిక శాసనసభ్యులు ప్రశాంత్‌రెడ్డి తమకు గ్రామాల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు లేకపోవటంతో ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి ఏం చేయాలో తెలియని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వంపై అబద్ధపు మాటలు మాట్లాడుతున్నారని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చీరల పంపిణీ, వడ్డీ లేని రుణాలు ఇస్తున్న సందర్భంలో ఇప్పటికే అయోమయంలో ఉన్న ప్రశాంత్‌రెడ్డి అవి కేవలం ఎన్నికల కోసమే ఇస్తున్నారని అబద్ధపు మాటలు మాట్లాడుతున్నారని గతంలో మంత్రిగా చేసిన ప్రశాంవరెడ్డికి ఏం చేయాలో తెలియని స్థితిలో ఉన్నాడన్నారు. ప్రశాంత్‌రెడ్డి అబద్ధాలు మాట్లాడటం మానుకోకపోతే ఖచ్చితంగా స్థానిక సంస్థల్లో ప్రజలు ప్రశాంత్‌రెడ్డికి బుద్ధి చెప్పటం జరుగుతుందని, హైదరాబాద్‌లో కెటిఆర్ అధికారం పోవటం మతిస్థిమితం కోల్పోయి అబద్ధపు మాటలు మాట్లాడుతున్నారన్నారు. జిల్లా ప్రజలు ఒకసారి ఆలోచించాలని ప్రజలకు సంక్షేమ పథకాలు, అభిబుద్ధిని అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మరింత బలం చేకూర్చేలా ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులను అధిక మెజార్టీతో గెలిపించాలని మానాల విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, రమేష్, గోపాల్‌నాయక్, అన్వేష్, మహేష రాజేష్, నాగభూషణం, శ్యామ్‌రాజ్, సాయిబాబా, నవీన్, గంగాధర్, అశోక్ పాల్గొన్నారు.





## ముసాయిదా విత్తన బిల్లు 2025పై అభిప్రాయాల సేకరణ

ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ వెల్లడి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** వ్యవసాయ శాఖ ద్వారా రూపొందించిన ముసాయిదా విత్తన బిల్లు 2025పై శుక్రవారం అభిప్రాయ సేకరణ జరిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో వ్యవసాయాధికారులతో పాటు రైతు ప్రతినిధులు, విత్తన డీలర్లు, కంపెనీలు, విత్తన ఉత్పత్తిదారులతో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ముసాయిదా విత్తన బిల్లులోని అంశాలపై చర్చించి వారి అభిప్రాయాలను సేకరించారు. ముసాయిదా బిల్లులో పొందుపర్చిన నాసిరకం విత్తనాల కారణంగా పంట ఉత్పత్తి, విక్రయ దశలో రైతులకు నష్టం కలిగితే నిర్ణీత కాల పరిమితితో రైతులకు చట్టబద్ధంగా నష్టపరిహారం అందించేలా నిబంధనలపై చర్చించారు. విత్తన ఉత్పత్తి కార్యకలాపాలకు సంబంధించి స్పష్టమైన, సమర్థవంతమైన నియంత్రణ వ్యవస్థను బిల్లులో చేర్చటం, పత్తి, వరి, పప్పు ధాన్యాలు, మొక్కజొన్న కూరగాయలు తదితర విత్తనాల ఉత్పత్తి, విక్రయ ధరల నియంత్రణ కోసం నిబంధనలు, విత్తన విక్రయదారుల లైసెన్సింగ్ వ్యవస్థ, మార్గదర్శకాలు, సీడ్ టెస్టింగ్, విత్తనాల దిగుమతి, విత్తన ప్రాసెసింగ్ యూనిట్ల నియంత్రణలో ఉన్న లోపాల సవరణ తదితర అంశాలపై సమావేశంలో కూలంకుషంగా చర్చించారు. ముసాయిదా విత్తన బిల్లుపై సేకరించిన అభిప్రాయాలను ప్రభుత్వానికి పంపిస్తామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి వీరస్వామి పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి

ఎస్.కె.బాజీ సైదా



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** సింగరేణి సంస్థలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏఐటియుసి పని చేస్తుందని శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం జిఎం కార్యాలయం సమావేశ మందిరంలో గుర్తింపు సంఘం ఏఐటియుసి నాయకులతో స్ట్రక్చర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్కె 7 గనిపై టింబర్ మెన్, కోల్ కట్టర్, లైన్మెన్, ట్రామార్, జనరల్ మజ్దూర్లకు రెస్ట్ హాల్ నిర్మించి లాకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఐకె 1ఎ గని మెయిన్ గేటు నుంచి సౌత్ బంకర్ ఫ్యాన్ హౌస్ వరకు, స్టేజ్ నుంచి టాయిలెట్స్ వరకు డాంబర్ రోడ్డు నిర్మించి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్ఆర్పి ఓసిలో జనరల్ మజ్దూర్లకు రెస్ట్ హాలు నిర్మాణం, మహిళల రెస్ట్ హాల్, సైట్ ఆఫీస్ వద్ద మరుగుదొడ్లను విస్తరించాలని సూచించారు. వర్క్ షాప్ మిషన్ షాపులో పిఒటి క్రేన్ ఏర్పాటు, డివిజన్లోని అన్ని విభాగాలకు కలిపి ఒక వెల్ఫేర్ ఆఫీసర్, జిఎం సెక్షన్కు ఆఫీసు బాయ్లను నియమించాలని కోరారు. శ్రీరాంపూర్ ఓసిలో కొత్త డోజర్లు, ఈపి ఫిట్టర్, ఫిట్టర్ల నియామకం, అన్ని గనులలో నాణ్యమైన డ్రిల్ రాడ్స్, టబ్ వీల్స్, చమ్మస్లు, చలి కోట్లు, గ్లాసులు, సాక్సులు, డాగ్ నేల్లను సమకూర్చాలన్నారు. ఎస్ఆర్పి 1, ఆర్కె న్యూ టెక్ గనులలో ఖాళీగా ఉన్న క్యాటగిరీ ప్రమోషన్లను ధ్రువపరిచి కార్పొరేట్కు ప్రతిపాదనలు పంపాలని, ఆర్కె 7 గని క్యాంటీన్లో ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటు, మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని విన్నవించారు. సమస్యల పరిష్కారం పట్ల జిఎం సానుకూలంగా స్పందించి, త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎస్ఒ టు జిఎం ఎన్ సత్యనారాయణ, ఆర్కె 5, 6 గ్రూప్ ఏజెంట్ శ్రీధర్, ఎస్ఆర్పి 1, 3 గ్రూప్ ఏజెంట్ జి రవి కుమార్, డిజిఎంలు అనిల్ కుమార్, రాజన్న, రవీందర్, మల్లయ్య, డివైసిఎంఒ డాక్టర్ పి రమేష్ బాబు, పర్సనల్ మేనేజర్లు ప్రశాంత్, ప్రశాంత్ రెడ్డి, నాయకులు కొట్టే కిషన్ రావు, కొమురయ్య, సంపత్, బాలకృష్ణ, ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

## టిపోల్ మొబైల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘంఓటర్ల సౌలభ్యం కోసం అందుబాటులోకి తెచ్చిన టిపోల్ మొబైల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. టిపోల్ యాప్ ద్వారా ఓటర్లు తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉందనే వివరాలను పరిశీలించుకోవటంతో పాటు ఓటరు స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. అలాగే టియాప్ ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలకుసంబంధించిన అంశాలపై ఏవైనా అభ్యంతరాలుంటే వాటిని కూడా తెలియజేవయచ్చన్నారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు ఎంపీడీఓలకు చేరుతాయని వాటిని పరిశీలించి తక్షణమే పరిష్కరిస్తారని కలెక్టర్ తెలిపారు. ప్లే స్టోర్ నుండి ఈ యాప్‌ను లింక్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకవచ్చని కలెక్టర్ సూచించారు.

## సింగరేణి క్వార్టర్లపై సౌర ఫలకాలను ఏర్పాటు చేయండి

**ప్రజాపక్షం/గోదావరిఖని :** సింగరేణి ఆర్‌జి1 ఏరియా సెక్టార్1, 2 పరిధిలోని అధికారుల క్వార్టర్లపై సౌర ఫలకాలను ఏర్పాటు చేసి విద్యుత్తు ఆదా చేయాలని కోరుతూ కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఇండియా నాయకులు శుక్రవారం ఆర్జీ1 ఏరియా జనరల్ మేనేజర్ డి.లలిత్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కాలనీల్లో అంతర్గత రోడ్ల నిర్మాణాలు, మరమ్మత్తులు, వేగ నియంత్రికలు, ఆర్‌వో ప్లాంటులు, సిసి కెమెరాలు, పూల తోటలు, సుందరీకరణలు, బెంచీలు, వాకింగ్ ట్రాక్‌లు, కోతుల నుండి రక్షణకై ఎన్‌సి క్వార్టర్లకు గ్రిల్స్ బిగింపు, లివింగ్ రూమ్‌లో ఫాల్స్ రూఫింగ్, వర్షపు నీరు లీకేజీ కాకుండా పైన టార్ షీట్‌లు, స్విమ్మింగ్ పూల్ చుట్టూ షెడ్, ఫెన్సింగ్ ఏర్పాటు వంటివి చేపట్టాలని కోరినట్లు అసోసియేషన్ ఏరియా అధ్యక్షుడు బి.మల్లేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం చంద్రశేఖర్, అసోసియేషన్ ఏరియా సెక్రటరి మల్లేశ్, శ్రీనివాస్, అంజనేయులు, వరప్రసాద్, జితేందర్‌సింగ్, ఎసిఎంవో డాక్టర్ అంబిక, ధనలక్ష్మి బాయి, వర్కుసల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, వేణు, శ్రావణ్‌కుమార్, విష్ణుమూర్తిలు పాల్గొన్నారు.

## నామినేషన్లు అడ్డుకుంటే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవం కోసం ఎవరైనా బెదిరింపులు, డబ్బుల ప్రలోభాలకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని జగదేవ్‌పూర్ తహసీల్దార్ నిర్మల,గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి హెచ్చరించారు. సర్పంచ్ ఏకగ్రీవం కోసం కొందరు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడుతున్నారని గురువారం మాందాపూర్, వెంకటాపూర్ గ్రామాలలో ఎన్నికల వేలం పాట నిర్వహించారన్న ఫిర్యాదు మేరకు శుక్రవారం మాందాపూర్, పలుగుగడ్డ, కొండాపూర్, వెంకటాపూర్(బిజ), అనంతసాగర్ గ్రామాలలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. ప్రతి గ్రామంలో ప్రజాస్వామ్య పద్ధతిలో నామినేషన్ పత్రాలు దాఖలు చేసి సర్పంచ్ ఎన్నికలు నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. ఓటు హక్కు కల్గి ఉన్న ప్రతి పౌరుడు పోటీ చేసే హక్కు ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తిని నామినేషన్ వేయకుండా అడ్డుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయితీల ఏకగ్రీవాల పేరిట వేలం పాటలు నిర్వహించే బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

## తండ్రి హత్యకు ప్రతీకారం... పగ తీర్చుకున్న కొడుకు



**ప్రజాపక్షం/వేములవాడ :** వేములవాడ అర్బన్ మండలం అగ్రహారంలో మాజీ నక్సలైట్‌ను హతమార్చిన నిందితుడు జగిత్యాల పోలీస్ స్టేషన్‌లో గురువారం రాత్రి లొంగిపోయాడు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం గుట్టలో మాజీ నక్సలైట్ బిఆర్ఎస్ నాయకుడు బల్లెపు నర్సయ్య (58) అలియాస్ పీపుల్స్ వార్ సిద్ధన్న దారుణ హత్యకు గురయ్యాడు. తంగలపల్లి మండలం గండిలచ్చపేటకు చెందిన నర్సయ్య అలియాస్ సిద్ధన్నను జగిత్యాల పట్టణానికి చెందిన సంతోష్ హతమార్చి తరువాత జగిత్యాల పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. సుమారు 46 ఏళ్ళ క్రితం అజ్ఞాతంలో ఉన్న సమయంలో సంతోష్ తండ్రి పెద్దన్నను పార్టీ ఆదేశాలతో హత్య చేసినట్లు ఇటీవల ఒక యూట్యూబ్ ఛానల్ ఇంటర్వ్యూలో నరసయ్య అలియాస్ సిద్ధన్న పేర్కొన్నారు. ఆ సమాచారంపై నమ్మకం వచ్చిన సంతోష్ పగ తీర్చుకునేందుకు పథకం వేసినట్లుగా తెలుస్తుంది. దీంతో నరసయ్య అభిమాని అంటూ పరిచయం చేసుకున్న సంతోష్ స్నేహం ముసుగులో మర్డర్‌కు ప్లాన్ చేశాడు. ఈ క్రమంలోనే గురువారం సాయంత్రం అగ్రహారం గుట్టకు పిలిపించి నర్సయ్యను హతమార్చినట్లు తెలుస్తోంది. అనంతరం నిందితుడు సంతోష్ జగిత్యాల టౌన్ పిఎస్‌కు వచ్చి జరిగిన విషయం చెప్పి లొంగిపోయాడు. వెంటనే వేములవాడ పోలీసులకు సమాచారం ఇచ్చి నిందితుడు సంతోష్‌ను అక్కడి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు సమాచారం.

## డిసెంబర్ 3న సిఎం బహిరంగ సభ



**ప్రజాపక్షం/హుస్నాబాద్:** డిసెంబర్ 3 బుధవారం హుస్నాబాద్‌లో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని సిద్దిపేట జిల్లా గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి పిలుపు నిచ్చారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని సీ ఎం పర్యాటన సందర్భంగా నాయులతో కలిసి ఏర్పాట్లును సభప్రాంగాణంను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రేస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలి సారిగా హుస్నాబాద్ వస్తున్న ముఖ్య మంత్రి రేవంతురెడ్డి పర్యాటనకు ఎంతో ప్రాధాన్యత ఉందని తెలిపారు. గత 60 ఏళ్లుగా హుస్నాబాద్ గడ్డలో ఎమ్మెల్యేగా గెలిచిన వారు మంత్రి కాలేదు నేడు మన ఎమ్మెల్యే మంత్రి పొన్నం ప్రభాకరర్ అధ్వర్యంలో హుస్నాబాద్ మెట్ట ప్రాంతం అభివృద్దికి బిజం పడిందని అన్నారు. ముఖ్య మంత్రి ప్రర్యాటనలో ముఖ్యంగా ఇంజనీరింగ్ కాలేజికి శంకుస్తాపన 250 పడకల అసుపత్రికితో శంకుస్తాపన , పాటు మరిన్ని అభివృద్ది పనులకు శంకుస్తాపన చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి దాదాపు 10 మంది మంత్రులతో పాటు హుస్నాబాద్ నియోజకవర్గం నాల్గు జిల్లా కరీంనగర్, హన్మకొండ, సిద్దిపేట, వరంగల్ జిల్లా ఎమ్యెల్యేలు, ముఖ్య నేతలు పాల్గోంటారని అన్నారు. హుస్నాబాద్ నియోకవర్గంలో 106 గ్రామాలు ఉన్నయని ప్రతి గ్రామం నుండి పెద్ద ఎత్తున ప్రజలు పాల్గోన్ని సభను విజయవంతం చేయాలని కొరారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మెన్ బి శివయ్య, అధికారప్రతినిది చిత్తారి రవిందర్, చిత్తారి పద్మ, నాయకులు అక్కన్నపేట మండల జంగపెల్లి ఐలయ్య, అధ్యక్షులు మడప జైపాల్‌రెడ్డి మాజి కౌన్సిలర్లు వల్లపు రాజు , మాజీ ఎంపిటీసి హసన్ లు ఉన్నారు.

## విద్యార్థులకు ప్రకృతి సమతుల్యతపై అవగాహన ఉండాలి



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలం పొలాస లోని ప్రొఫెసర్ జయశ్శంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల, పొలాసలో గ్రీన్ గ్రాడ్యుయేషన్ సేరిమోని లో భాగంగా శుక్రవారం విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఆల్దాస్ జానయ్య ఆదర్శ నిర్ణయాల మేరకు మొదటి సంవత్సర విద్యార్థులతో విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి నాలుగు సంవత్సరాల పాటు వాటి సంరక్షణను శ్రద్ధగా పాటిస్తామని ప్రతిజ్ఞ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతి నారాయణ్ భట్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న కాలుష్య సమస్యను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే విద్యార్థులు చైతన్యంగా ఉండి తమ పరిసరాల పట్ల మరియు ప్రకృతి సమతుల్యత పట్ల అవగాహనను కలిగి ఉండి వృక్షజాతులను కాపాడుక్కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ గ్రాడ్యుయేషన్ సేరిమోని ఛైర్ పర్సన్ డా. వేణు గోపాల్ మెంబర్స్ డా. సత్యనారాయణ రెడ్డి, డా.రాజేంద్ర ప్రసాద్, డా.అరుణ్ కుమార్, డా.సౌజన్య, ఇతర బోధన మరియు బోధనేతర సిబ్బంది, మొదటి సంవత్సర విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## నీటి వనరుల గణనపై శిక్షణ



**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి,బీర్పూర్ మండలాలలో ఉన్న చిన్న నీటి వనరుల లెక్కను పగడ్బందీగా శాస్త్రీయంగా చేపట్టాలని సిపిఓ సత్యం పేర్కొన్నారు.ధర్మపురి పట్టణంలోని రైతు వేదికలో శుక్రవారం చిన్న నీటి వనరుల గణనపై అన్యుమరేటర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీఓ సత్యం మాట్లాడుతూ ధర్మపురి, బీర్ పూర్ మండలాల్లోని చెరువులు, కుంటలు, వాగులు, లిఫ్ట్ ఇరిగేషన్ నీటి నిల్వ ప్రాంతాలు బోర్వెల్స్ కు సంబంధించిన జల వనరుల సహా ప్రతి నీటి వనరులకు సంబంధించిన వివరాలు సమగ్రంగా సేకరించాలని సూచించారు. 2000 హెక్టార్ల లోపు భూమికి సాగునీరు అందించే చెరువుల నుంచి చిన్న ఓపెన్ భావి వరకు అన్నింటి వివరాలను సర్వే సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఓ సత్యం,ధర్మపురి,బీర్ పూర్ తహసీల్దార్ లు ఏరుకొండ శ్రీనివాస్, సుజాత, డివైఎస్ఓ రామకృష్ణ, ఎంపీఎస్ఓ అశ్విని, బీర్పూర్ గిర్ధవర్ లు రాహుల్, శ్రీనివాస్, జీపీలు మరియు ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# సిఎంకు,మంత్రుల ధన్యవాదాలు





**ప్రజాపక్షం/గోదావరిఖని:** రామగుండం పట్టణంలో నూతనంగా 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రం, లింగాపూర్ సమీప సింగరేణి ఒసిపి4 ప్రాజెక్టు వద్ద 500 మెగావాట్ల హైడల్ పవర్ ప్లాంటులను నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం విదితమే. ఇటీవల సీఎం ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ విద్యుత్తు ప్లాంటుల నిర్మాణానికి ఆమోదం లభించింది. ఈ మేరకు శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ గౌడ్‌లతోపాటు రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ హైదరాబాద్‌లో సీఎం ఎ.రేవంత్‌రెడ్డిని, డిప్యూటి సీఎం భట్టి విక్రమార్కను వేర్వేరుగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. సీఎం, డిప్యూటి సీఎంలను కలిసిన వారిలో పీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, మహ్మద్ అజహరోద్దీన్‌లు ఉన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజల ఏన్నో దశాబ్దాల కలను నేరవేర్చడం పట్ల సీఎం, డిప్యూటి సీఎంలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేయడం వల్ల ఎంతో మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, రామగుండం ఇక పూర్తిస్థాయిలో పారిశ్రామిక హబ్‌గా మారనున్నదని ఎమ్మెల్యే మక్కన్ సింగ్ తెలిపారు.

## పకడ్బందీగా ఎన్నికల ప్రచార ఖర్చులు నమోదు: ఇన్‌చార్జి కలెక్టర్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం కోసం అభ్యర్థులు చేసే ఖర్చును పకడ్బందీగా నమోదు చేయాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యులు ప్రచారంలో భాగంగా చేసే వ్యయం వివరాల నమోదు పై శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సహాయ వ్యయ పరిశీలకులకు (ఏ. ఈ. ఓ)లకు శిక్షణ ఇవ్వగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, వ్యయ పరిశీలకులు రాజ్ కుమార్, నోడల్ అధికారి శేషాద్రి తో కలిసి మాట్లాడారు. ఎన్నికల్లో వ్యయ పర్యవేక్షణ ఎంతో ముఖ్యమని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఖర్చు విషయమై రిజిస్టర్లు నిర్వహించాలని ఆదేశించారు.

ప్రతి సర్పంచ్, వార్డు సభ్యులు ఈ ఎన్నికల వ్యయం కోసం ప్రత్యేక బ్యాంక్ ఖాతా ఓపెన్ చేయాలని, 5 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి వ్యయ పరిమితి రూ. 2,50,000 అని, 5 వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి వ్యయ పరిమితి రూ.1,50,000 అని వెల్లడించారు. అలాగే 5 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీ వార్డు అభ్యర్థి వ్యయ పరిమితి రూ. 50,000 అని, 5 వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీ వార్డు అభ్యర్థి వ్యయ పరిమితి రూ.30,000 అని తెలిపారు. రూ. 50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకువెళ్ళవద్దని వెల్లడించారు. ప్రతి అభ్యర్థికి సంబంధించిన రిజిస్టర్ నిర్వహించాలని ఆదేశించారు.

## పాఠ్యాంశాలపై ప్రయోగాలు చేయాలి: ఇన్‌చార్జి కలెక్టర్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** విద్యార్థులు పాఠ్యాంశాలపై ప్రయోగాలు చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు ఇచ్చారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతానగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో వికసిత్, ఆత్మ నిర్భర్ భారత్ లో భాగంగా పాఠశాలల విద్యార్థుల జిల్లాస్థాయి ఇన్ స్పైర్, విద్యా వైజ్ఞానిక ప్రదర్శన, రాజ్య స్థరీయ బాల్ వైజ్ఞానిక ప్రదర్శన (ఆర్ఎస్ బీవీపీ) శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. వివిధ పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్ ను పరిశీలించి, ఎలా తయారు చేశారు? వాటి వినియోగం, వచ్చే ఫలితాలను అడిగి తెలుసుకుని, విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ విద్యార్థులు తరగతిలో నేర్చుకున్న పాఠ్యాంశాలపై ప్రయోగాలు చేయాలని సూచించారు. ప్రయోగాలతోనే ఆ పాఠ్యాంశంపై మంచి అవగాహన వస్తుందని, అది ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. సీవీ రామన్, అబ్దుల్ కలాం స్ఫూర్తితో విద్యార్థులు ప్రణాళిక ప్రకారం ప్రయోగాలు చేసి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.సౌర విద్యుత్, పవన విద్యుత్, థర్మో డైనమిక్స్, కిరణజన్య సంయోగ క్రియ తదితర అంశాలపై విద్యార్థులకు ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. సైన్స్ మ్యూజియం కోసం కావలసిన స్థలం కోసం ప్రతిపాదనలు పంపాలని, వివిధ సైన్స్ పరికరాలపై విద్యార్థులకు అవగాహన వచ్చేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వినోద్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి దేవయ్య, స్కూల్ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిల్లెళ్ల చెక్ పోస్ట్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** గ్రామపంచాయతి ఎన్నికలు పురస్కరించుకొని తంగళ్ళపల్లి మండల పరిధిలోని జిల్లెల్ల చెక్ పోస్టును జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహన తనిఖీలు నిర్వహించి నమోదు చేసిన రిజిస్టర్ ను పరిశీలించడంతో పాటు ప్రత్యక్షంగా పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీలు చేస్తున్న తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. తనిఖీల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి వాహనాలను క్షుణ్ణముగా పరిశీలించి అక్రమ నగదు, మద్యం రవాణాను అరికట్టాలని సూచించారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం ఉంటే పోలీస్ స్టేషన్ వారికి సమాచారం అందించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపై ఎన్నికల నియమావళి ప్రకారం చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలో సి.ఐ మొగిలి, చెక్ పోస్ట్ సిబ్బంది ఉన్నారు.

# యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు

కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.శుక్రవారం సమీకృత కలెక్టరేట్ లో జిల్లా స్థాయి జాబ్ మేళా నిర్వహణ పై వివిధ కళాశాలల యాజమాన్యులు,సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ ,యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా టాస్క్ రీజనల్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జాబ్ మేళా (ప్లేస్ మెంట్ డ్రైవ్) నిర్వహించాలని నిర్ణయించామని అన్నారు.జాబ్ మేళా కార్యక్రమానికి వివిధ కంపెనీలు హాజర వుతాయని, షెడ్యూల్ ఖరారు కాగానే కళాశాలలకు సమాచారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. టాస్క్ రీజినల్ సెంటర్ ద్వారా వివిధ కోర్సులలో యువతకు ఉచితంగా నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని, వీటి ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. టాస్క్ అందించే వివిధ కోర్సుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. మంథని లో మరో టాస్క్ రీజినల్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని కంపెనీలు మన జిల్లాకు ఉపాధి కల్పించేందుకు వస్తాయని, దానికి అనుగుణంగా మన విద్యార్థులను తన అర్థం చేసుకొని వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని కలెక్టర్ తెలిపారు.జిల్లాలో ఉన్న వివిధ ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలో ఉన్న ట్రైనింగ్ & ప్లేస్ మెంట్ సెల్ విభాగం సిబ్బంది జాబ్ మేళా విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా లోని ప్రతి కళాశాల నుంచి డిగ్రీ పట్టా తీసుకున్న పూర్వపు విద్యార్థులు , ఫైనల్ ఇయర్ చదువుతున్న కనీసం 50 మంది జాబ్ మేళా కు హాజరు కావాలని, ప్రతి కళాశాల నుంచి ఒక కో ఆర్డినేటర్ ను నియమించాలని కలెక్టర్ తెలిపారు.గతంలో నిర్వహించిన జాబ్ మేళాలో ఉద్యోగం పొందేందుకు కొంతమంది అభ్యర్థులకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించేందుకు రుసుమును సైతం జిల్లా యంత్రాంగం చెల్లించిందని అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పడటం చాలా ముఖ్యమని,ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రైవేటు కళాశాలలు సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో టాస్క్ సెంటర్ ఇం చార్జి కౌసల్య, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సిందే

కోరుకంటి చందర్ డిమాండ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** బిసిలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి స్దానిక సంస్దల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని రామగుండం మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డి డిక్లరేషన్ సభలో బీసీలకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీ తీర్మానాలతోనూ బీసీ రిజర్వేషన్ సాధ్యం కాదని రేవంత్ సర్కార్ కు తెలసని ప్రాజ్యాంగ సవరణ ద్వారానే బీసీలకు న్యాయం జరుగుతది అనేది వాస్తవం ఇది అక్షర సత్యం అన్నారు. బిజెపికి కాంగ్రెస్ పార్టీ రాబోవు ఎన్నికల్లో తగిన బుద్ధి చేప్పాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త పనిచేయాలని మోసపూరిత కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ప్రజలంతా బుద్ధి చెప్పాలన్నారు. ఎన్నికల్లో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకోలేక పోయిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఓట్ల కోసం మీ వద్దకు వస్తే ఫెన్షన్ 4వేలు, కల్యాణలక్ష్మి తులం బంగారం, మహిళా విద్యార్థినులకు స్కూటీలు, రైతు బంధు, రైతు బీమా ఏదని నిలదీయాలని సూచించారు. ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీకి ప్రజల తిరస్కరణ తథ్యమని, బిఆర్ఎస్ విజయడంఖ మ్రోగించనుందని వెల్లడించారు. రామగుండం నియోజకవర్గంలో ఉన్న 27 గ్రామపంచాయిలకు బిఆర్ఎస్ పార్టీ నుండి ప్రతి గ్రామానికి ఇంచార్జీలను, కో ఆర్డినేటర్ లను ప్రకటించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఆముల నారాయణ, గోపు అయులయ్య యాదవ్, రవీందర్, శ్రీనివాస్, కృష్ణ వేణీ, విజయ, అంజలి, రవి, నారాయణ, దాసు మారుతి, సదానందం, శ్రీనివాస్, దేవరాజ్, తిరుపతి, బుర్ర శంకర్, రమేష్, శ్రీనివాస్, బస్వ రాజ్, గంగరాజు, రమేష్ , పాల్గొన్నారు.

# ఐకెపి కొనుగోలు కేంద్రాల్లో గన్ని సంచుల కొరత

రైతుల ఆందోళన

పట్టించుకోని నిర్వాహకులు



**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట:** ధూల్మిట్ట మండలంలోనిజాలపల్లితో పాటుగా పలు ఐకెపి కొనుగోలు కేంద్రంలో గన్ని సంచుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని జాలపల్లి గ్రామ తాజామాజీ సర్పంచ్ చొప్పరి వరలక్ష్మి సాగర్ అన్నారు. ధూల్మిట్ట మండలంలోని జాలపల్లిలో ఐకెపి ధ్యాన్యం కొనుగోలు కేంద్రం వద్ద గన్ని సంచుల కొరతతో రైతులు ఆందోళనకు దిగారు. వాతవరణ శాఖ రానున్న 24 గంటల్లో వర్షాలు పడనున్నాయని తెలపడంతో రైతులు మరింత ఆందోళనకు గురౌతున్నారు. కొనుగోలు కేద్రాలను ప్రారంభిచిన రోజు అధికారులు మాట్లాడుతు, రైతులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తామని, సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకరావాలని చెప్పినా, ఆచరణలో మాత్రం కనబడడం లేదని చొప్పరి వరలక్ష్మి సాగర్ అధికారులను ప్రశ్నించారు. రైతులు పండించిన పంటలో 100శాతం తాలు లేకుండా చూడాలని, మ్యాచర్ 17 ఉండాలని పదేపదే చెబుతున్నా, రైతుల సౌకర్యాల కల్పనలో మాత్రం పటించుకోకపోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. 24 గంటల్లో రైతులకు గన్న సంచులు అందిచాలని జాలపల్లి గ్రామ తాజామాజీ సర్పంచ్ చొప్పరి వరలక్ష్మి సాగర్ అధికారులను డిమాండ్ చేశారు.

# శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే ఉపేక్షించం

సిద్దిపేట సిపి విజయ్‌కుమార్



**ప్రజాపక్షం/హుస్నాబాద్:** శాంతి భద్రతల విషయంలో అటంకం కల్గిస్తే ఎవరిని ఉపేక్ష్మించబోమని సిద్దిసేట జిల్లా సీపి విజయ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం హుస్నాబాద్ లో అమర వీరుల స్తూపం ప్రాంగణంలో డిసెంబర్ 3 ముఖ్యమంత్రి సభ నిర్వహించ నున్నందున సీపి సభ స్థలిని పరీశిలించారు. ఈ సందర్భంగా సీపి మాట్లాడుతూ సీ ఎం పర్యాటన సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లును చేస్తున్నమని ఇప్పటికే పోలీస్ పార్టీ పర్యవేక్షనంలో ఉందని బందోబస్తు చేస్తున్నమని తెలిపారు. రాబోవు గ్రామ పంచాయితీ ఎన్నిక సందర్భంగా గ్రామల్లో వేలం పాటలను ఎవ్వరైన ప్రోత్సహిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకంటామని హెచ్చరించారు. బెదిరింపులకు పాల్పడి నట్లు మా దృష్టికి వస్తే వారిపై చర్చలు తీసుకుంటామని అన్నారు. అలాగే డబ్బుల భూములు ,ఓటర్లును ప్రలోభపెట్టిన అశ జూపిన ఏలాంటి ప్రలోభాలకు గురిచేసిన , ఏకగ్రీవంగా ఎన్నిక చేస్తే అట్టి ఎన్నిక చెల్లుబాబు కాదని తెలిపారు. పోలీసులకు గాని విధినిర్వహనలో ఉన్న ఏ ఓక్క అధికారిపైన దురుసుగా ప్రవర్థించిన చట్టరమైన చర్యలు ఉంటామని అన్నారు. ఇప్పటికే కొంత మంది అనూమానితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో శాంతి యుత వాతవరణంలో ఉన్నికల నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఏ సీ పి సదానందం, ఇంటలిజన్స్స సి ఐ కిరన్, హుస్నాబాద్ సి ఐ శ్రీనివాస్ ఎస్ . ఐ లక్ష్మ రెడ్డి, అర్‌డివో రాంమూర్తి . సిద్దిపేట జిల్లా గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగయూర్తి తో పాటు స్థానిక నాయకులు పాల్గోన్నారు.

## బాల్య వివాహాలను నిర్మూలించాలి




**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** బాల్యవివాహాలను నిర్మూలించి, బాలికల సంరక్షణకు పాటుపడాలని శుక్రవారం రోజున పెద్ద కల్వలలోని ఫిర్దౌస్ మస్జిద్ ఆవరణలో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలోబాల్య వివాహాలు చేయడం, ప్రోత్సహించడం చట్టరీత్య నేరమని ,బాల్య వివాహాల నిర్మూలన మన అందరి బాధ్యత అని జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయ కర్త దయా అరుణ అన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహల నిషేధ చట్టం 2006 గురించి వివరిస్తూ ఆడపిల్ల వయస్సు 18 సం లోపు ఆడపిల్లలకు,21సం లోపు మగపిల్లలకు వివాహాలు చేయటం చట్ట రీత్యా నేరమని ,బాల్య వివాహనికి అనుమతినిచ్చిన,వివాహాన్ని నిర్వహించిన, జరగటానికి సహకరించిన బాల్య వివాహానికి హాజరైన వారందరూ నిందితులుగానే పరిగణించబడతారనీ, సెక్షన్9,10,11,(1) మరియు13(10), ప్రకారం గరిష్టంగా 2 సంవత్సరాలు జైలు శిక్ష లేదా లక్ష రూపాయల వరకు జరిమానా లేదా రెండు విధించబడతాయనీ, బెయిల్ లభించని నేరమని,ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్1098, 112, 100 లకు ఉచితంగా ఫోన్ చేసి తెలుపాలని,బాలల హక్కులు, ఉన్నత విద్య, ఫోక్సో చట్టం, సఖి సేవలు మహిళల హక్కులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సుచరిత, సమత,యం.డి మోహిన్,యం.డి రహీం, సయ్యద్ నజీర్ .తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్‌టి శిబిరాన్ని సిపి తనిఖీ

**ప్రజాపక్షం/బెజ్జంకి:** మండల పరిధిలో తోటపల్లి శివారులోని రాజీవ్ రహదారి వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టి శిభిరాన్ని శుక్రవారం సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్ అకస్మికంగా తనిఖీ చేశారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతవరణంలో నిర్వహించే విధంగా చూడాలని ఆదేశించారు.అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి పరిశీలించారు.వీరి వెంట సిద్దిపేట రూరల్ సిఐ శ్రీను,ఎస్ఐ సౌజన్య,సిబ్బంది తదితరులున్నారు.

# క్రీడ

## రెండో టెస్టుకు ప్యాట్ కమిన్స్ దూరం..

### కెప్టెన్‌గా స్మిత్‌కు మరో ఛాన్స్..!



యాషెస్ సిరీస్‌లో అదిరే బోణీ కొట్టిన ఆస్ట్రేలియా రెండో మ్యాచ్‌లోనూ విజయంపై కన్నేసింది. పెర్త్ టెస్టులో సంచలన ప్రదర్శనతో ఇంగ్లాండ్‌ను రెండో రోజే మట్టికరిపించిన ఆసీస్ బ్రిస్బేన్‌లోనూ తడాఖా చూపేందుకు సిద్ధమవుతోంది. సిరీస్‌లో 10తో ఆధిక్యంలో ఉన్న ఆతిథ్య జట్టు స్టార్ పేసర్ల సేవల్ని కోల్పోనుంది. గాయం నుంచి కోలుకుంటున్న కెప్టెన్ ప్యాట్ కమిన్స్, ప్రధాన పేసర్ జోష్ హేజిల్‌వుడ్ కూడా ఇంకా ఫిట్‌నెస్ సాధించలేదు. దాంతో.. తొలి టెస్టు స్క్వాడ్‌తోనే కంగారూ టీమ్ రెండో మ్యాచ్ ఆడనుందని శుక్రవారం క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది. యాషెస్‌లో మొదటిదైన పెర్త్ టెస్టులో సంచలన విజయంతో ఆస్ట్రేలియా సిరీస్‌లో ముందంజ వేసింది. కెప్టెన్ కమిన్స్, హేజిల్‌వుడ్ వంటి ప్రధాన పేసర్లు లేకున్నా.. మిచెల్ స్టార్క్, బొలాండ్‌లు నిప్పులు చెరిగారు. 205 పరుగుల ఛేదనలో ట్రావిస్ హెడ్ విధ్వంసక శతకంతో రెండో రోజే ముగించిన ఆసీస్.. అదే ఉత్సాహంతో బ్రిస్బేన్ టెస్టులో బరిలోకి దిగనుంది. కానీ.. రెండో టెస్టు వరకూ కూడా కమిన్స్, హేజిల్‌వుడ్‌లు ఫిట్‌నెస్ సాధించేలా లేరు. దాంతో.. రెండో మ్యాచ్‌కు స్టీవ్ స్మిత్ సారథిగా కొనసాగనున్నాడు. అలానే.. తొలి మ్యాచ్‌లో వెన్నునొప్పితో ఇబ్బందిపడిన ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా కూడా స్క్వాడ్‌లో ఉన్నాడు. మ్యాచ్‌కు దూరమైనప్పటికీ జట్టుతోనే ఉంటూ ప్రాక్టీస్ కొనసాగించనున్నాడు కమిన్స్. డిసెంబర్ 3 నుంచి ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ మధ్య బ్రిస్బేన్‌లోని గబ్బాలో రెండో టెస్టు జరగనుంది.

**ఆస్ట్రేలియా స్క్వాడ్ :** స్టీవ్ స్మిత్(కెప్టెన్), ట్రావిస్ హెడ్ స్కాట్ బొలాండ్ అలెక్స్ క్యారీ, బ్రెండన్ డొగెటే, కామెరూన్ గ్రీన్, జోష్ ఇంగ్లిస్, ఉస్మాన్ ఖవాజా, మార్నస్ లబూషేన్, నాథన్ లియాన్, మైఖేల్ నాసిర్, మిచెల్ స్టార్క్, జేక్ వెదర్‌లాండ్ బ్యూ వెబ్‌స్టర్.

## డిసెంబర్ 13న హైదరాబాద్‌కు స్టార్ ఫుట్‌బాల్ ప్లేయర్ రాక

ప్రఖ్యాత ఫుట్‌బాల్ ప్లేయర్ లియోనల్ మెస్సి.. ఇండియాలో టూర్ చేయనున్న విషయం తెలిసిందే. అయితే ఆ లెజెండరీ ప్లేయర్ ఇప్పుడు హైదరాబాద్‌లో కూడా అడుగుపెట్టనున్నాడు. ఈ విషయాన్ని అతను కన్ఫర్మ్ చేశాడు. తన ఇన్‌స్టాగ్రామ్ పోస్టులో ఈ విషయాన్ని చెప్పాడు. మరికొన్ని వారాల్లో గోట్ టూర్ ప్రారంభంకానున్నదని, భారత్ ప్రదర్శిస్తున్న ప్రేమ పట్ల థ్యాంక్స్ చెబుతున్నట్లు పేర్కొన్నారు. తన విజిట్‌లో హైదరాబాద్ నగరాన్ని కూడా జోడించారని, ఇది సంతోషకరమైన విషయం అన్నారు. అర్జెంటీనా స్టార్ ఫుట్‌బాల్ ప్లేయర్ మెస్సి ఇండియాలోని కోల్‌కతా, ముంబై, ఢిల్లీ నగరాలతో పాటు హైదరాబాద్‌లోనూ టూర్ చేయనున్నారు. డిసెంబర్ 13న హైదరాబాద్ నగరానికి మెస్సీ వస్తున్నాడు. ఆ రోజు రాత్రి 7.30కు కార్యక్రమం జరగనున్నది. మెస్సీ రాకను స్వాగతిస్తూ శుక్రవారం తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. ఫుట్‌బాల్ ప్రేమికులకు, హైదరాబాద్ నగరానికి ఇది సంతోషకరమైన విషయం అన్నారు. మెస్సీకి ఘన స్వాగతం పలికేందుకు నగరం సిద్ధంగా ఉందన్నారు.





## స్వదేశంలో టీమిండియాకు శ్రీలంక సవాల్..

### వైజాగ్, త్రివేంద్రంలో మ్యాచ్‌లు..!





ఇటీవలే విశ్వ విజేతగా అవతరించిన భారత జట్టు తొలి సిరీస్‌కు సన్నద్ధమవుతోంది. స్వదేశంలోనే ప్రపంచకప్‌ను సగర్వంగా ముద్దాడిన టీమిండియా ఉపఖండ జట్టు శ్రీలంకను ఢీకొట్టనుంది. డిసెంబర్‌లో ఇరుజట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ జరగనుంది. దాంతో.. శుక్రవారం భారత క్రికెట్ నియంత్రణ మండలి షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ ఐదు మ్యాచ్‌లకు రెండు నగరాలను మాత్రమే ఎంపిక చేసింది బిసిసిఐ. వరల్డ్ కప్ తర్వాత కో హోస్ట్‌లు భారత్, శ్రీలంక తలపడుతున్న తొలి సిరీస్ ఇదే. డిసెంబర్ 21 నుంచి డిసెంబర్ 30 వరకూ జరుగబోయే ఐదు టీ20ల సిరీస్‌లో ఇరుజట్లు ఢీకొనున్నాయి.

తొలి టీ20 – డిసెంబర్ 21 ఆదివారం, విశాఖపట్టణం
రెండో టీ20 – డిసెంబర్ 23 మంగళవారం, విశాఖపట్టణం
మూడో టీ20 – డిసెంబర్ 26 శుక్రవారం, తిరువనంతపురం
నాలుగో టీ20 – డిసెంబర్ 28 ఆదివారం, తిరువనంతపురం
ఐదో టీ20 – డిసెంబర్ 30, మంగళవారం, తిరువనంతపురం

ఈ ఐదు మ్యాచ్‌లకు వైజాగ్, త్రివేంద్రం(తిరువనంతపురం)వేదిక కానున్నాయి. టీమిండియా ఈ ఏడాది జూన్‌లో చివరి పొట్టి సిరీస్ ఆడింది. అది కూడా ఇంగ్లండ్‌లో 32తో విజేతగా నిలిచింది హర్మన్‌ప్రీత్ సేన. లంక విషయానికొస్తే ఆ జట్టు మార్చిలో న్యూజిలాండ్‌తో ఆడిన సిరీసే ఆఖరు. ఆ సిరీస్‌ను ఇరుజట్లు 11తో సమం చేసుకున్నాయి.

## ఆసియా కప్ స్క్వాడ్‌లో వైభవ్..


డిసెంబర్ 12 నుంచి 21 వరకు దుబాయ్ వేదికగా అండర్19 ఆసియా కప్ జరగనుంది. ఈ నేపథ్యంలో బిసిసిఐ భారత అండర్19 జట్టును ప్రకటించింది. ఆయుష్ మాత్రే టీమ్‌కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఐపీఎల్ సంచలనం, ఇటీవల రైజింగ్ స్టార్స్ ఆసియాకప్‌లో అద్భుత సెంచరీ చేసిన వైభవ్ సూర్యవంశీ తిరిగి జట్టుకు ఎంపికయ్యాడు. విహాన్ మనోజ్ మల్హోత్రా వైస్ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. ఈ టోర్నమెంట్ అండర్19 వరల్డ్‌కప్‌నకు సన్నాహకంగా ఆయా జట్లు భావిస్తున్నాయి. ఈ మెగా టోర్నీ వచ్చే సంవత్సరం జనవరి ఫిబ్రవరి మధ్య జింబాబ్వే, నమీబియా వేదికగా జరగనుంది.



**అండర్ -19 ఆసియా కప్‌నకు భారత జట్టు:** ఆయుష్ మాత్రే (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, విహాన్ మల్హోత్రా (వైస్ కెప్టెన్), వేదాంత్ త్రివేది, అభిజ్ఞాన్ కుందు (వికెట్ కీపర్), హర్వంశ్ సింగ్ (వికెట్ కీపర్), యువరాజ్ గోహిల్, కాన్షిక్ చౌహాన్, ఖిలాన్ ఎ.పటేల్, నమన్ పుష్పక్, డి.దీపేశ్, హెనిల్ పటేల్, కిషన్ కుమార్ సింగ్, ఉద్ధవ్ మోహన్, అరోన్ జార్జ్ స్టాండ్ బైలు: రాహుల్ కుమార్, హేమ్‌చు దేశన్ జె, బీకే కిషోర్, ఆదిత్య రావత్

# ఫోకస్ సైన్స్

## కాకతాళీయం..



భూమిపై నుంచి చూసినప్పుడు సూర్యుడు, చంద్రుడు దాదాపు ఒకే పరిమాణంలో కనిపిస్తాయి. చంద్రుడి కంటే సుమారు 400 రెట్లు పెద్దదైన సూర్యుడు మనకు ఆకారంలో చంద్రుడి కంటే చాలా పెద్దగా కనిపించాలి కదా? ఎందుకు అలా జరగడం లేదనే ప్రశ్నకు సమాధానం ఆసక్తికరంగా ఉంటుంది. ఇది కాకతాళీయం కావచ్చుగానీ, చంద్రుడి కంటే సూర్యుడు 400 రెట్లు పెద్దదిగా ఉండడమేకాదు... భూమి నుంచి చంద్రుడికి ఎంత దూరమో, అక్కడి నుంచి సూర్యుడు సరిగ్గా 400 రెట్లు ఎక్కువ దూరంలో ఉన్నాడు. దూరంలోని వ్యత్యాసం, పరిమాణంలోని వ్యత్యాసం సుమారు ఒకటే కాబట్టి, భూమి పైనుంచి చూసినప్పుడు రెండూ దాదాపు ఒకే సైజ్‌లో కనిపిస్తాయి.


## విశ్వరూపం త్రికోణం



అనంత విశ్వాన్ని గోళాకారంగా పేర్కొంటారు. అయితే, ఇది త్రికోణాకారంగా ఉంటుందనే వాదన ఒకటి తెర పైకి వచ్చింది. కొంత మంది శాస్త్రవేత్తల అభిప్రాయాన్ని అనుసరించి విశ్వం అతి పెద్ద చదరపు ఆకారంలో లేదా ఫ్లాట్‌గా ఉంది. అంటే విశ్వంలో భారీ త్రికోణాన్ని గీస్తే, దాని అంతర్గత కోణాల మొత్తం ఖచ్చితంగా 180 డిగ్రీలుగానే ఉంటుంది. ఇది యుక్లిడ్ గణితంలోని సమతల భౌతిక శాస్త్ర నియమానికి సమానమైనది. దీనిలో త్రికోణం యొక్క మూడు కోణాలు జోడించి ఎప్పుడూ 180 డిగ్రీలు వస్తాయి. 'ఫ్లాట్ యూనివర్స్' అంటే విశ్వం యొక్క పెద్ద భాగం యుక్లిడియన్ జ్యామితి లేదా యుక్లిడియన్ జామెంట్రీకి అనుగుణంగా ఉంటుంది. ఇందులో సరిపడిన రెండు సమాంతర రేఖలు ఎప్పుడూ కలవవు. త్రికోణాకారంలోనే తిరుగుతాయి. మొత్తం 180 డిగ్రీల కోణాన్ని ఆవిష్కరిస్తాయి. మరో రకంగా చెప్పాలంట, స్ఫియరికల్ (గోళాకార) లేదా హైపర్బోలిక్ (సడిల్ ఆకార) విశ్వాలకు భిన్నంగా ఫ్లాట్ యూనివర్స్ ఉంటుంది. ఇందులోని కోణాల మొత్తం ఎక్కువ లేదా తక్కువ వంపుతో ఉంటాయి. కాస్మిక్ మైక్రోవేవ్ బ్యాక్‌గ్రౌండ్ (సిఎంబి) అనే విశ్వంలో పురాతన కిరణాలను గణితపరంగా అధ్యయనం చేసిన శాస్త్రవేత్తలు ఫ్లాట్ యూనివర్స్ భావనకు రూపకల్పన చేశారు. బూమెరాంగ్, డబ్ల్యుఎంఎపి, ప్లాన్ సికె వంటి ఉపగ్రహాలు, వివిధ ప్రయోగాలు విశ్వం 99 శాతం బల్లపరుపుగా ఉందని ఆధారాలు చూపాయి. సాధారణంగా, పెద్ద బహుళ కోణాన్ని అంచనా వేయడంలో వంపు లేదా వక్రత మొత్తం 180 డిగ్రీలు వస్తే, అది విశ్వం 'ఫ్లాట్' అని అర్థం. కాగా, విశ్వం త్రికోణాకృతిలో ఉందనే ప్రతిపాదిక సిద్ధాంతానికి ఇంకా ధ్రువీకరణ లేదు. ప్రస్తుతానికి ఇది ప్రారంభ దశలోనే ఉంది. అధ్యయనం మరింత లోతుగా జరిగితేగానీ, ఈ వాదనకు బలం చేకూరదు.

## కణాలకూ చెవులుంటాయ్!

చెవులు మాత్రమేకాదు.. మన శరీరంలోని కణాలు కూడా మన చుట్టూ ఉన్న శబ్దాలను వినగలవని శాస్త్రవేత్తలు ఇటీవల గుర్తించారు. వినికిడిపై ఇప్పటి వరకు మనిషికి ఉన్న అవగాహనకు, సంబంధిత సూత్రాలకు ఇది చాలా భిన్నం. సైన్స్ పత్రికలో సమాచారాన్ని అనుసరించి, మనిషిలో ప్రతి కణం ఒక సున్నితమైన శబ్ద గ్రహీతగా పని చేస్తోంది. అంటే మన చుట్టూ ఉన్న ప్రతి ధ్వనికంపనను ఏదో స్థాయిలో గుర్తించగల సమర్థత మన శరీరంలో ఉంది. ఈ ఆవిష్కరణతో శరీరశాస్త్రం, వైద్యశాస్త్రంలో ఇంత వరకూ ఉన్న వివరణలు, సిద్ధాంతాలను తిరిగి పరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది. కణాలు శబ్దాల మార్పులను గ్రహించగలవన్న వాస్తవం వైద్యరంగంలో కొత్త మార్గాలను తెరవవచ్చు. ఉదాహరణకు, భవిష్యత్తులో శబ్ద తరంగాలను ఉపయోగించి కణాల ఆరోగ్యాన్ని మార్చడం, అవయవాల పునరుద్ధరణ లేదా రోగనిర్ధారణ వంటి కొత్త సాంకేతికతలు అభివృద్ధి చెందే అవకాశం ఉంది. సూక్ష్మంగా చెప్పాలంటే, మన శరీరం స్వయంగా ఒక జీవ జైవరూప రికార్డింగ్ పరికరం లా వ్యవహరించగల సామర్థ్యం కలిగి ఉంది.



## గదిలో మబ్బు తునక!

ఇక్కడ కనిపిస్తున్నది ఎవరో వేసిన చిత్రం కాదు. డచ్ కళాకారుడు బెర్నాట్ స్మిల్డే ఆవిష్కరించిన ఓ అద్భుతం. అతను ఒక గదిలో మబ్బు తునకను సృష్టించి, అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాడు. 'నింబస్' అనే ప్రాజెక్టు కింద అతను గదిలో సరైన ఉష్ణోగ్రత, తేమ, కాంతి సమతౌల్యాన్ని సాధించాడు. వాటి ద్వారా క్రమంగా మబ్బుల రూపాన్ని సృష్టిస్తున్నాడు. ఇవి కొద్ది సేపటి తర్వాత తేలిపోతాయి. క్రమంగా పలుచబడి కనుమరుగవుతాయి. కంప్యూటర్ ఎఫెక్ట్స్‌గా కాకుండా, నిజమైన మబ్బులను సృష్టించడం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటున్నది. ఇది నీటి ఆవిరి, ధూళి కణాలతో రూపొందిన వాస్తవ మబ్బు తునక అని తెలుసుకొని అంతా నిర్ఘాంతపోతున్నారు. స్మల్డే ఈ కళా సృష్టులను ప్రపంచవ్యాప్తంగా గ్యాలరీస్‌లో ప్రదర్శిస్తున్నాడు. ఫొటోలు తీసి అందరిని మంత్రముగ్ధులను చేస్తున్నాడు. ఆలోచనల్ని, వైజ్ఞానిక నియంత్రణల్ని కలిపి, ఊహాశక్తి పరిమితి లేనిదని అతను ప్రత్యక్షంగా చూపించాడు. గదుల్లో కేవలం కొన్ని సెకన్లు మాత్రమే కనిపిస్తున్నప్పటికీ, ఈ మబ్బులను చూసేందుకు ప్రజలు క్యూ కడుతున్నారు. ఇది నిండైన ఉద్వేగాన్ని ప్రేక్షకుల మనసుల్లో నింపుతున్న సాంకేతిక విజ్ఞానంతో కూడిన కళాకృతి.



# మనువాదంపై తిరుగుబాటు చేసిన ఫూలే

### వర్ధంతి కార్యక్రమంలో సిపిఐ నేతలు తక్కళ్లపల్లి, బాగం

**ప్రజాపక్షం/ఖమ్మం :** తరతరాలుగా ప్రజలను అజ్ఞానం నుంచి దోపిడీ చేస్తున్న మనువాదంపై సామాజిక తిరుగుబాటు చేసిన విప్లవ వీరుడు మహాత్మా జ్యోతిబాఫూలే అని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని సిపిఐ గిరిప్రసాద్ భవన్‌లో శుక్రవారం మహాత్మా జ్యోతిబా ఫూలే వర్ధంతి సందర్భంగా ఫూలే చిత్రపటానికి బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాగం మాట్లాడుతూ మహిళలను చైతన్యవంతుల్ని చేయడానికి నాటి సామాజిక కట్టుబాట్లను ఎదిరించి ఫూలే విద్యా బోధన కోసం పాఠశాలను ప్రారంభించారన్నారు. ఇందు కోసం ఫూలేతో పాటు ఫూలే సతీమణి సావిత్రిబాయి ఫూలే అనేక అవమానాలను భరించారన్నారు. ఫూలే జీవితం నేటి తరానికి ఆదర్శం అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, సిహెచ్ సీతామహాలక్ష్మి, బిసి హక్కుల సాధన కమిటీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేకల శ్రీనివాసరావు, తాటి వెంకటేశ్వరరావు, మహిళ సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి నిర్మల, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మి నారాయణ, జిల్లా సమితి సభ్యులు పేరబోయిన మోహన్‌రావు, గాయకులు దాసరి రాము, నాయకులు జ్వాలా నర్సింహారావు, నంబూరి శంకర్‌రావు, వాడపల్లి యాకయ్య, కృష్ణమాచారి పాల్గొన్నారు.

**వరంగల్ :** వరంగల్‌లోని శివనగర్ తమ్మెర భవన్ సిపిఐ కార్యాలయంలో ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో జ్యోతిరావు ఫూలే వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఫూలే చిత్రపటానికి ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు ఫూలే సాంఘిక, దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. మహిళలకు విద్యా అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక పాఠశాలలు స్థాపించి తన భార్య సావిత్రిభాయ్ ఫూలేను మొదటి ఉపాధ్యాయురాలుగా నియమించి స్త్రీలకు, అన్నికులాల వారికి విద్య నేర్పించినటువంటి మహనీయుడు అన్నారు. కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. బాష్ మియా, రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె బద్రి, బుస్సా రవీందర్, తోట చంద్రకళ, వీరగోని శంకరయ్య, సంగి ఏలేంధర్, ఐతే యాకయ్య, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పార్థసారథి, ల్యాదల్ల శరత్, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్క సుధీర్, నాయకులు ఓర్సు రాజు, తాళ్ళపల్లి జాన్ పాల్, యండి అక్బర్ పాషా, తాళ్ళపల్లి రహేళ, జన్ను రవి, పరికిరాల రమేష్, తదితరులు పాల్గొన్నారు.





## 'రిమ్స్' కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అందించాలి

### మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ డిమాండ్

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** రిమ్స్‌లో పని చేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కాంట్రాక్ట్ కార్మికులకు కనీసం రూ.26000 వేతనాలు అందించాలని మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం రిమ్స్ డైరెక్టర్‌కు నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ ఒక నెల పెండింగ్ వేతనాలు, నాలుగు నెలల పిఎఫ్, ఇఎస్ఐ చెల్లింపులు కార్మికుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. లేని పక్షంలో డిసెంబర్ 2 నుంచి నిరసన,5న రాష్ట్రవ్యాప్తంగా ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రిమ్స్ బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సంగీత, ఎండి ఖాసీం, నాయకులు రాజేందర్‌సింగ్, శ్రీను, పద్మ, కృపకర్, ఆరీఫ్, రాణి, అలీం, సైఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



## కార్మికుల హక్కులు బలహీనపర్చే నాలుగు లేబర్ కోడ్‌లు

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్





**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** కేంద్రంలోని బిజెపి సర్కార్ అమలు చేస్తున్న నాలుగు కార్మిక కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ కార్మిక, రైతు సంఘాల పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కోడ్‌ల ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడుతూ కార్మికుల హక్కులు బలహీనపర్చేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లను దొంగచాటుగా ఆమోదించిందన్నారు. ఈ లేబర్ కోడ్‌ల అమలుతో వేతన లెక్కల్లో భత్యాల తొలగింపు, పని గంటల పెంపు, ఔట్‌సోర్సింగ్, ఫిక్స్‌డ్ టర్మ్ నియామకాలతో కార్మికుల హక్కులు బలహీనపడుతున్నాయన్నారు. మహిళా కార్మికుల హక్కులు, ప్రసూతి ప్రయోజనాలపై ఈ కోడ్‌లలో స్పష్టత లేదని ఆయన విమర్శించారు. 2019 నుంచి ఎన్నో సమ్మెలు చేసిన కేంద్రం స్పందించలేదని సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌లలో మోదీ ప్రభుత్వం వెనక్కు తగ్గే వరకు పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. కార్యక్రమంలో సిర్రా దేవేందర్, మంతెన కాంతారావు, సలీం, మోసిన్, మహేందర్, అశోక్, బామన్ జగన్, కాసిం రవి, వైఎండి ముజీబ్, ఐఎన్‌టియుసి, ఐఎఫ్‌టియు, టియుసిఐ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల కోసం పనిచేసే వారికే పట్టం

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు వెల్లడి

**ప్రజాపక్షం/వరంగల్ :** ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజల గొంతుకగా నిలుస్తున్న కమ్యూనిస్టులను పంచాయతీ ఎన్నికలలో పట్టం కట్టాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం వరంగల్ నగరంలోని సిపిఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్‌లో వరంగల్ జిల్లా సిపిఐ సమితి సమావేశం అక్కపల్లి రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు జరుగుతున్న ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీ చేసి గెలవాలనుకునే వారిని తిరస్కరించి, నిజాయితీపరులకు పట్టం కట్టాలని, ప్రజా సమస్యలను విస్మరించి పరస్పరం దూషణలు చేసుకుంటున్న పార్టీలను తిరస్కరించి నిబద్ధతతో ప్రజల కోసం పని చేసే కమ్యూనిస్టు పార్టీలను ఎన్నికలలో ఆదరించాలని తక్కళ్లపల్లి కోరారు. సమావేశంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె బాష్‌మియా, రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె బద్రి, బుస్సా రవీందర్, తోట చంద్రకళ, వీరగోని శంకరయ్య, సంగి ఏలేంధర్, ఐతే యాకయ్య, ఓర్సు రాజు, ల్యాదల్ల శరత్, పార్థసారది తాళ్ళపల్లి జాన్ పాల్, ఎండి అక్బర్ పాషా, తాళ్లపల్లి రహేళ, జన్ను రవి, పరికిరాల రమేష్, సుదీర్ తదితరులు పాల్గొన్నారు.





**చింతకాని :** సిపిఐ అభ్యర్థులను గెలిపించి గ్రామాభివృద్ధికి బాటలు వేయాలని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ కోరారు. శుక్రవారం చింతకాని మండలం బస్వాపురం గ్రామపంచాయతీ సిపిఐ సర్పంచి అభ్యర్థి ఆవుల నర్సింహారావు నామినేషన్ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ బస్వాపురం గ్రామం సిపిఐ కంచుకోట అన్నారు. తిరిగి సర్పంచ్ స్థానాన్ని కైవసం చేసుకోవాలన్నారు. అనంతరం అభ్యర్థి ఆవుల నర్సింహారావు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ సమర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శి మార్గం శ్రీను, నాయకులు రాసాల మోహన్‌రావు, బొడ్డు కొండలరావు, బద్దల నర్సింహారావు, చంద్రకాని రామ్మూర్తి, పెద్ద వెంకటి, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

**వలిగొండ :** గ్రామపంచాయతీ ఎన్నికలలో సర్పంచ్ స్థానాలకు సిపిఐ పోటీలో ఉంటుందని పార్టీ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని దుప్పల్లి గ్రామ శాఖ సమావేశం కట్ల యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో యానాల మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్యలో ఉండి సమస్యల కోసం వాటి పరిష్కారం కోసం పోరాడుతున్న పార్టీని గెలిపించాలని కోరారు. అనంతరం మెట్టు అంజయ్య, మెట్టు నరసింహాలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్, నాయకులు బాలగోని సత్యనారాయణ, మారోజు నరసింహాచారి, నరిగ యాదయ్య, కన్నెబోయిన పృథ్వీరాజ్, కనబోయిన రాములు, తాతయ్య, నోముల నరసయ్య, ఎర్ర కిరణ్ పాల్గొన్నారు.







# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## విఘాతం కలిగించే వారిపై కఠినవైఖరి:ఎస్‌పి రోహిత్ రాజ్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గ్రామపంచాయితీ ఎన్నికల్లో విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఎస్‌పి రోహిత్ రాజ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫిరెన్స్‌లో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు సరైన చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లను ప్రలోబాలకు గురిచేసే సంఘ విద్రోహక శక్తులపై అప్రమత్తంగా ఉండి నిఘా పెట్టాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లఘించిన వారిపై కఠినంగా వ్యవహరించే కేసులు నమోదు చేయాలన్నారు. అనంతరం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులపై ఆరా తీశారు. కేసులు త్వరితగతిన పరిష్కారానికి గురయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని, బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ వాహనాలతో రోడ్లపై సంచరిస్తూ నేరాల నిరోధనకు కృషి చేయాలన్నారు.

## ఏజెన్సీ ఆస్పత్రి సేవలు అభినందనీయం

టివివిపి కమిషనర్ అజయ్ కుమార్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఏజెన్సీ ప్రాంతమైన జిల్లాలోని టివివిపి ఆస్పత్రుల్లో చక్కటి సేవలు అందుతున్నాయని, జిల్లా కలెక్టర్ ప్రోత్సాహం, టిసిహెచ్ఎస్ రవిబాబుతోపాటు ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు చాలా కష్టపడి విధులు నిర్వహిస్తున్నారని టివివిపి కమీషనర్ అజయ్‌కుమార్ అన్నారు. ఇటీవలచర్ల ఆస్పత్రిలో క్లిష్టమైన పరిస్థితుల్లో రోగులకు వైద్యం అందించి కొన ఊపిరితో ఉన్న నెలలు నిండిన కవల పిల్లలతో ఉన్న గర్భిణీకు సాధారణ ప్రసవం చేసి కాపాడారని, అదే విధంగా కొనఊపిరితో ఉన్న వృద్ధునికి నాణ్యమైన వైద్యం చేసి ప్రాణం పోశారని అన్నారు. ఇందులో భాగంగా పాల్వంచకు అభినందించేందుకు కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి వచ్చినట్లు చెప్పారు. వైద్యులను కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తూ మెరుగైన వైద్యాన్ని జిల్లా ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తమకు ఎప్పటికప్పుడు సమాచారం అందుతుందన్నారు. ఇదే స్ఫూర్తితో మరింత మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందించాలని ఆయన కోరారు. వివిధ ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

## సిఎం పర్యటనకు ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి ఈనెల 2న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వస్తున్నందున అందుకు సంబందించిన ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారంయూనివర్సిటీ ప్రాంగణంలో అన్ని ఇంజనీరింగ్‌తో పాటు పలు శాఖల అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకోవడంతో పాటు భద్రతాచర్యలు కట్టుదిట్టంగా ఉండాలని సూచించారు. శిలాఫలకం ఏర్పాట్లు, అవరణ అభివృద్ధి, అంతర్గత రోడ్లు, మార్గదర్శక బోర్డులు, పార్కింగ్ ప్రదేశం, స్టేజీ నిర్మాణం వంటి అంశాలను పరిశీలించారు. సిఎం పర్యటన అత్యంత ప్రాధాన్యత కలిగిందని, అన్ని శాకలు పరస్పర సమన్వయంతో పనిచేసి పనులు పూర్తి చేయాలన్నారు. రూట్ మ్యాప్ రూపొందించడంతో పాటు అగ్నిమాపక చర్యలు, ట్రాఫిక్ మళ్లింపు, వైద్యబృందాల నియామకం, విఐపి ప్రోటోకాల్ వంటి అంశాలపై కూడా కలెక్టర్ ప్రత్యేక సూచనలు చేశారు. ఈ పరిశీలనలో ఆయన వెంట యూనివర్సిటి ప్రిన్సిపల్ డా. జగన్మోహన్ రాజు, మున్సిపల్ కమీషనర్ సుజాత, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన సర్వేశ్వరరెడ్డి



**ప్రజాపక్షం/భద్రాచలం :** గ్రామపంచాయితీ ఎన్నికల నామినేషన్ కేంద్రాలను చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో ఎన్నికల సాధారణ పరిశీలకుడు సర్వేశ్వరరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ క్రమంలో పర్వతాల, పెద్దనల్లబెల్లి, ఆర్ కొత్తగూడెం, పెద్దమిడిసిలేరు గ్రామపంచాయితీల్లో ఆయన పర్యటన సాగింది. ఆయన నామినేషన్ కేంద్రాల వద్ద ఉన్న ఏర్పాట్లు, సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎలాంటి సమస్యలు లేకుండా నామినేషన్ పక్రియ సజావుగా సాగుతోందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆయా మండలాల ఎంపిడిఓలు, తహశిల్దార్లు పాల్గొన్నారు.

## పదోన్నతులు బాధ్యతను మరింతగా పెంచుతాయి :ఎస్‌పి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పోలీసులు శాఖలో పొందె పదోన్నతులు వారి బాధ్యతను మరింతగా పెంచుతాయని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. జిల్లా పోలీస్ శాఖలో 14 మందికి హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. ఖమ్మం జిల్లాకు చెందిన వారు పదోన్నతి అనంతరం బదిలై భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చేరుకుని ఎస్‌పి కార్యాలయంలో రిపోర్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి వారిని అభినందించారు. అనంతరం ఎస్‌పి రోహిత్ రాజ్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో క్రమశిక్షణతో కూడిన విధులు నిర్వహించే వారికి మంచి గుర్తింపు లభిస్తుందని అన్నారు. ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తూ విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని ఎస్ పి వారికి సూచించారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో ఉన్న ఖాళీలను పరిశీలించి వారు పెట్టుకున్న అర్జీల ప్రకారం పోస్టింగ్‌లు కల్పిస్తామని ఎస్‌పి తెలిపారు. అదే విధంగా జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీస్ అధికారులు, సిబ్బందికి యోగా తరగతులు నిర్వహించారు. అనునిత్యం పోలీసులు ఒత్తిడితో కూడిన ఉద్యోగాన్ని చేస్తుంటారని, అలాంటి వారికి యోగా, మెడిటేషన్ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. డిఎస్‌పి రెహమాన్, సిఐ శివ ప్రసాద్, ఆర్ఐ లాల్‌బాబు పాల్గొన్నారు.



# స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణ

ఎంసిసి ఉల్లంఘన పట్ల
కఠినంగా వ్యవహరించాలి
ఫిర్యాదుల నమోదుకు ప్రత్యేక ఏర్పాటు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో పంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛ న్యాయబద్ధ నిర్వహణకు అన్ని చర్యలు చేపట్టాలని సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామరావు తెలిపారు. కలెక్టరేట్ లో సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామరావు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజతో కలిసి పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సంబంధిత ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సాధారణ ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని ఎక్కడ చిన్న పొరపాటు జరగడానికి ఆస్కారం ఇవ్వవద్దన్నారు. ఎన్‌సిసి నిబంధనలు ఉల్లంఘనలు జరగకుండా చూడాలని అభ్యర్థులు వినూత్న రీతిలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నిస్తారని దీనిని నిరోధించేందుకు పక్క నిఘా పెట్టాలన్నారు. అభ్యర్థుల ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ విధులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అనంతరం ఎన్నికల సిబ్బంది శిక్షణ, బ్యాలెట్ పేపర్, ప్రింటింగ్ మెటీరియల్ మొదలగు వివిధ అంశాలకు సంబంధించిన అంశాలను నోడల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి వచ్చే వివిధ ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించేందుకు డిఆర్‌వో ఆధ్వర్యంలో వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నిబంధన ఉల్లంఘనపై ఫిర్యాదు చేసేందుకు ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెం. 1077 పై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఎన్నికల ప్రచారాన్ని తహసీల్దార్, ఆర్డీవో రెగ్యులర్‌గా మానిటరింగ్ చేయాలన్నారు. సిపి సునీల్ దత్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చాలా తీవ్రంగా ఉంటుందని ఎక్కడ ఎటువంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఆర్‌వో పద్మశ్రీ, జెడ్పి సిఈవో దీక్షారైనా, డిఆర్‌డివో సన్యాసయ్య, డిసివో ఆశాలత, డిపిఆర్‌వో ఎంఎ గౌస్, డిఎస్‌డివో సునీల్ రెడ్డి, డిఈవో చైతన్య జైని, ఆర్టివో వెంకటరమణ, సిపివో శ్రీనివాస్, డిసివో గంగాధర్, ఆర్డీవో నర్సింహారావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం. అపూర్వ, డిప్యూటీ సిఈవో నాగపద్మజ, డిఎల్‌పివో రాంబాబు, ఈడిఎం దుర్గాప్రసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**మీడియా సెంటర్‌ను పరిశీలించిన అబ్జర్వర్లు**
పంచాయతీ ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూము, ఎంసి ఎంసి సెల్, మీడియ సెంటర్లను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదమరావు పరిశీలించారు.నిష్పక్షపాతంగా అమలు చేయడం మన కర్తవ్యమన్నారు. కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఆర్‌డివో సన్యాసయ్య, డిపివో ఆశాలత, డిపిఆర్‌వో ఎంఎ గౌస్, ఎంసిఎంసి కమిటీ సభ్యులు మురళీకృష్ణ, రమేష్, అధికారులు పాల్గొన్నారు.

## ముక్కోటి ఏర్పాట్లు భక్తులు మెచ్చేలా ఉండాలి

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లు భక్తులు మెచ్చేలా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం ఆయన రామాలయ పరిసరాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చేనెల 29 తెప్పోత్సవం, 30న ముక్కోటి ఏకాదశి ఉత్తర ద్వార దర్శనం సందర్శంగా భద్రాచలం రామాలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారని, ఈ నేపథ్యంలో తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఇందులో భాగంగా దేవస్థానం అధికారులతో సమగ్రచర్చ చేశారు. క్యూలైన్ల ఏర్పాటు, భక్తులు వచ్చి వెళ్ళే మార్గాలు, భద్రత సిబ్బంది చర్యలు, తాగునీరు, వైద్య సేవలు, శానిటేషన్, తాత్కాలిక మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించి సూచనలు చేశారు. సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, పనులు పట్ల నిర్లక్ష్యం వహించరాదని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఉత్తర ద్వార వద్ద బారికేడ్లు, క్యూలైన్లు, సిసి కెమోరాలు, సమాచార బోర్డులు ఏర్పాట్లను ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. భక్తులకు సులంభంగా దర్శనం కలిగేలా చూడటంతో రద్దీని నివారించవచ్చనాన్రు. దేవస్థాన పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, నేటి నుండి రోజువారీ పనుల వివరాలు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. ఇఓ కే దామోదర్ రావు, ఇఇ రవీంధర్, ఏఇఓలు శ్రావణ్ కుమార్, భవాని, రామకృష్ణారావు పాల్గొన్నారు.

## కుల వివక్షపై పోరాటాలు చేసిన యోధుడు పూలే

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కంచర్ల జమలయ్య

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** కుల వివక్ష, అంటరాని తనంపై అలుపెరగని పోరాటాలు చేసిన యోధుడు మహాత్మాజ్యోతిరావు పూలే అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఏఐటియూసి జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య అన్నారు. శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో పూలే 135వ వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వ్యవస్థ రాజ్యమేలు తున్న రోజుల్లో, అంటరాని తనం పట్టిపీడిస్తున్న కాలంలో సామాజిక అసమానతలపై రాజీలేని పోరాటాలు చేసిన విప్లవ కారుడు పూలే అన్నారు. ఆనాటి సనాతన ఆచారాలను ధిక్కరించి బహుజనులు, దళితులు, మహిళలకు విద్యను అందించడం ద్వారానే వారి విముక్తి సాధ్యమని నమ్మి, పాఠశాలలు స్థాపించారని చెప్పారు. సత్యశోధన సమాజ్ ద్వారా మూఢనమ్మకాలపై ఆయన చేసిన యుద్ధం నేటికీ ఆదర్శం అన్నారు. దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, మతోన్మాదం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీ కరణవిధానాలు పూలే ఆలోచనలకు పూర్తి విరుద్ధం అన్నారు. సామాజిక న్యాయం సమసమాజ స్థాపన కోసం పూలే చూపిన పోరాట పంథాలో ప్రతీ ఒక్కరూ పయనించాలని పిలుపునిచ్చారు. పూలే స్ఫూర్తితో రాబోయే కాలంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సిపిఐ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేయడమే పూలేకు ఇచ్చే ఘన నివాళి అన్నారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు భూక్యా శ్రీనివాస్, పట్టణ నాయకులు పి సత్యనారాయణ చారి, కొక్కెలగడ్డ రామకృష్ణ, కె సోమయ్య, భూపేష్ పాల్గొన్నారు.



## ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి,
పోలీస్ కమిషనర్ సునీల్



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఎన్నికల నిబంధనల ప్రకారం అప్రమత్తంగా ఉంటూ విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలని సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామరావు తెలిపారు. శుక్రవారం రఘునాథపాలెం మండలంలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి ఎన్నికల సాధారణ పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామరావు పరిశీలించారు. చిమ్మపుడి, కోయచలక గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను సందర్శించి అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను పరిశీలించారు. ఎన్నికల విధులు, బాధ్యతల పట్ల సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో నామినేషన్లు చాలా ముఖ్యమైన ఘట్టమని నామినేషన్ పత్రాల్లో ప్రతి అంశం సరిగ్గా ఉన్నాయో లేవో జాగ్రత్తగా చూడాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ పరిశీలన అప్పీళ్ల పరిష్కారం, గుర్తు కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులకు గోడప్రతులు, ప్రచార వాహనాలకు అనుమతులు తీసుకోవాలంటే సంబంధిత మండల అధికారులను సంప్రదించాలన్నారు. నామినేషన్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో డిపివో ఆశాలత, తహసీల్దార్ శ్వేత, ఎంపిడివో అశోక్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

## పరిష్కారానికి నోచుకోని జర్నలిస్టుల సమస్యలు

టియుడబ్ల్యూజె (ఐజెయు)
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంనారాయణ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ డిసెంబర్ మూడున హైదరాబాద్ సమాచార శాఖ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు జర్నలిస్టులను పట్టించుకోలేదని ఈ ప్రభుత్వ ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా పరిస్థితిలో మార్పు రాలేదని ఆయన తెలిపారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంనారాయణ మాట్లాడుతూ పుష్కర కాలంగా జర్నలిస్టు సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ప్రతిసారి జర్నలిస్టుల ప్రస్థావన తేవడం తప్ప చేసింది శూన్యమని ఆరోపించారు. అధికారంలోకి రాగానే జర్నలిస్టుల సమ్యలను పరిష్కరిస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు జర్నలిస్టుల సమస్యల గురించి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. దాదాపు మూడేళ్లు గడిచినా అక్రిడేషన్ కార్డులు మంజూరు కాలేదని నూతన పాలసీని ప్రకటిస్తున్నామని చెప్పిన అది జరగ లేదన్నారు. అనారోగ్యాల బారీనపడి అనేక మంది జర్నలిస్టులు చనిపోతున్నారని మరి కొందరు అనారోగ్యంతో వైద్యం కోసం అప్పుల పాలవుతున్నారని ఆయన తెలిపారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమాచార శాఖ కార్యాలయం ఎదుట జరిగే మహాధర్నాలో జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని రాంనారాయణ కోరారు. మీడియా సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సామినేని మురారి, నర్వనేని వెంకట్రావు, జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు, కార్యదర్శి మైసా పాపారావు, జిల్లా మాజీ అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు మామిడాల భూపాల్, మహేందర్, నగర అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ శ్రీనివాస్, జనార్థనాచారి, సత్యనారాయణ, ఆల స్యం అప్పారావు, వేణుగోపాల్, శీలం శ్రీనివాస్, కళ్యాణ్, మేడి రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రెండవ రోజు 85 నామినేషన్లు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం రఘునాథపాలెం మండలంలో సర్పంచ్, వార్డు స్థానాలకు 85 నామినేషన్లు దాఖలయ్యాయి. మండలంలో 37 గ్రామ పంచాయతీలకు గాను సర్పంచ్ స్థానాలకు రెండవ రోజు 28, 308 వార్డు స్థానాలకు గాను 57 నామినేషన్లు దాఖలయ్యాయి. వివిధ పార్టీల మద్దతుతో పలువురు సర్పంచ్ స్థానాలకు, వార్డు స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల దాఖలుకు శనివారం తుది గడువు కావడంతో నామినేషన్లు ఎక్కువ సంఖ్యలో పడే అవకాశం ఉంది. అధికార పార్టీ నుంచి పోటీ చేసేందుకు పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు. దీనితో ప్రతి పంచాయతీ నుంచి ముగ్గురు నలుగురు పేర్లతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వద్దకు అభ్యర్థుల ఎంపిక కోసం జాబితా పంపినట్లు సమాచారం. నామినేషన్ల కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ల స్వీకరణకు ఎటువంటి లోటుపాట్లు జరగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు.

## దేవాలయం పక్కనే.. మద్యం దుకాణమా!

ఎక్సైజ్ శాఖ అనుమతులు ఎలా ?



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మంలో జమ్మిబండ అంటే తెలియని వారు ఉండరు. దసరా ఉత్సవాలు ఇక్కడ అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. లక్ష్మి నర్సింహా స్వామి గుట్ట ఖమ్మంలోని ప్రముఖ దేవాలయాలలో ఒకటి. ఖమ్మం జెడ్పి సెంటర్‌కు అతి సమీపంలో ఉన్న ఈ ప్రాంతంలో వైన్ షాపు ఏర్పాటుకు సర్వం సిద్ధమవుతుంది. ప్రతి ఏడాది దసరా నవరాత్రోత్సవాల ముగింపు సందర్భంగా పాలపిట్ట దర్శనానికి జమ్మిబండ ప్రసిద్ధి. అటువంటి జమ్మిబండ ప్రహరీ గోడను అనుకుని మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేస్తున్నారు.అంతే కాదు ఖమ్మం నగరంలో అత్యంత రద్దీగా ఉండే రోడ్లలో బోనకల్ రోడ్డు ఒకటి. దేవాలయం పక్కనే మద్యం షాపు ఏర్పాటు విషయమై ఫిర్యాదు చేసినా ఎక్సైజ్ శాఖ స్పందించక పోవడంతో ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని మద్యం దుకాణం ఏర్పాటును రద్దు చేయాలని కోరుతున్నారు. ఇప్పుడు కూడా ప్రసిద్ధ పుణ్య క్షేత్రం పక్కనే విద్యాలయాలు అత్యంత రద్దీ గల రోడ్డులో మద్యం షాపు ఏర్పాటును ఉపసంహరించుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**మద్యం షాపు ఏర్పాటును ఉపసంహరించుకోవాలి :** బిజి క్లెమెంట్ జమ్మిబండ దగ్గర ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాన్ని తక్షణం వేరే ప్రాంతానికి మార్చాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, కార్పొరేటర్ బిజి క్లెమెంట్ డిమాండ్ చేశారు. ఎక్సైజ్ అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని స్థలం మార్చకపోతే ఆందోళన చేపడతామని దేవాలయం పక్కన మద్యం షాపును అంగీకరించబోమని క్లెమెంట్ హెచ్చరించారు.

# వైద్యుల నిర్లక్ష్యంతో పురిట్లోనే శిశువు మృతి

ఆసుపత్రి ఎదుట
బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన
పోలీసుల రంగ ప్రవేశం,
సద్దుమణిగిన వివాదం





**ప్రజాపక్షం/పాల్వంచ :** ఇద్దరు ఆడపిల్లల అనంతరం మూడో సంతానం మగబిడ్డ పుడతాడనే ఆనందంతో గర్భిణి కాన్పు కోసం ఆసుపత్రికి చేరింది. పుట్టబోయే తన కొడుకును కనులారా చూసుకొని మరిసిపోవాలనుకున్న ఆతల్లికి వైద్యుల నిర్లక్ష్యంతో చేదు అనుభవం ఎదురైనది. నవజాత శిశువు విగతజీవిగా మారిపోయాడు. వైద్యుల నిర్లక్ష్యం, సమయానికి వైద్య సేవలను అందించక పోవటంతోనే శిశువు పురిట్లోనే మృతిచెందాడని ఆరోపిస్తూ బాదిధిత కుటుంబ సభ్యులు ఆందోనకు దిగిన సంఘటన శుక్రవారం జరిగింది. పాల్వంచ పట్టణ పరిధి నెహ్రూనగర్‌కు చెందిన కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన కుంజా క్రాంతి, భవాని దంపతులకు మొదటి రెండవ సంతానం ఇద్దరు అమ్మాయిలు. దమ్మపేట సెంటర్‌లోని విజయ నర్సింగ్ హోమ్‌లో చికిత్స తీసుకోగా డెలివరి సమయం ఈ నెల 30వ, తేదీగా నిర్ధారించారు. అనంతరం ఆ తల్లికి నొప్పులు ప్రారంభమైనాయి. పురిటి నొప్పులు రవాడంతో బుధవారం 26వ, తేదీ రాత్రి 4 గంటల సమయంలో ఇంటి ఎదురుగా ఉన్న తమ బందువులకు చెందిన వారి ఆటోలో ఆసుపత్రికి చేరింది. సిబ్బంది గర్భిణీకి వైద్యుల సలహా మేరకు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం ఉదయం 9 గంటలకు ఆసుపత్రికి చేరుకొన్న వైద్యురాలు అన్ని పరీక్షలు జరిపి ఆపరేషన్ చేసి మగబిడ్డకు పురుడు పోశారు. కానీ అప్పటికే నవజాత శిశువు మృతి చెందాడు. దీనిని దాచిపెట్టిన డాక్టర్ బాధిత కుటుంబ సభ్యులతో పిల్లల డాక్టర్‌ను పిలిపిస్తున్నాను. వారికి రూ. 1800/ల ఫీజు చెల్లించాలని చెప్పారు. దీనికి వారు అంగీకరించారు. వచ్చిన పిల్లల డాక్టర్ శిశువును పరీక్షించి మృతి చెందాడని తెలిపారు. తమ బాబు మృతి చెందిన విషయాన్ని తెలుసుకొన్న ఆతల్లికి మూగరోదనే మిగిలింది. కాన్పు సమయంలో తల్లికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేశారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే నవజాత శిశువు పురిట్లోనే మృతి చెందాడంటూ, సకాలంలో చికిత్స అందిస్తే మా కొడుకు మాకు దక్కేవాడంటూ ఆరోపించారు. ఇదిలా ఉండగా ఎన్నో మొక్కుల ఫలితంగా కలిగిన మగ సంతానం మృతి చెందాడనే బాదతో ఉన్న ఆకుటుంబ సబ్యులకు వైద్యులు మరో షాక్ ఇచ్చారు. పూర్తి డబ్బులు చెల్లించి ఆసుపత్రి నుండి వెళ్ళాలనే హుకుం జారీ చేశారు. దీనితో ఒక్కసారిగా ఆకుటుంబ సబ్యులకు ఆగ్రహం పెల్లుబికింది. ఆసుపత్రికి చేరుకొన్న మృతురాలి బంధువులు, కుటుంబ సబ్యులు ఆసుపత్రి ఎదుట కూర్చొనిఆందోళన చేశారు. ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి నశించాలని, వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. సమాచారం అందుకొన్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. ఆందోళనను విరమింపజేశారు.

**మా తప్పు ఎంతమాత్రం లేదు :** భవాని కాన్పు సమయంలో మేం అన్ని జాగ్రత్తలు తీసుకొన్నామని సంతాన వైద్యురాలు విజయలక్ష్మి తెలిపారు. ఇందులో మా పొరపాటు ఎంతమాత్రం లేదని చెప్పారు. ఈ ఆందోళనలో ఆదివాసీ సంఘాల నాయకులు ఆరెం ప్రశాంత్, సోయం సత్యనారాయణ, కాకా పృథ్వీరాజ్, రమేష్, శెట్టుపల్లి వెంకట్, బాదిత కుటుంబ సబ్యులు, పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## సిపిఐ సీనియర్ సభ్యురాలు జయమ్మకు నివాళి



**ప్రజాపక్షం/మహబూబాబాదథ్:**మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు కొండపల్లి గోపాల్ రావు నగర్ కాలనీ వాస్తవ్యుడు దాసరోజు నాగేంద్ర చారి తల్లిగారు సిపిఐ సీనియర్ శాఖ సభ్యురాలు దాసరోజు జయమ్మ గారు మృతిచెందడంతో శుక్రవారం సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి పార్టీ జెండా కప్పి పూలదండ వేసి నివాళులు అర్పించారు. జయమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించిచారు. పరామర్శించినవారిలో సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారది రెడ్డి చిత్రంలో చింతకుంట్ల వెంకన్న కూరాకుల పాల్ నారాయణ తండా శ్రీనాథ్ పూర్ణాచారి శ్రీనివాసచారి ఉన్నారు.

## ఎసిబి వలలో తహసీల్దార్



**ప్రజాపక్షం/ తొర్రూరు :** మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల తహసీల్దార్ వీరంగంటి మహేందర్ ఓ రైతు నుండి రూ. 25వేలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు పట్టుబడ్డాడు. శుక్రవారం పెద్దవంగర మండలంలోని ఓ తండాకు చెందిన బాధిత రైతు వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ కోసం తహసీల్దార్‌ను సంప్రదించగా రూ.25వేలు డ్రైవర్‌కు ఇవ్వమని తహశీల్దార్ మహేందర్ చెప్పగా బాధిత రైతు డ్రైవర్‌కు డబ్బులు ఇస్తుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. ఈ ఘటనపై ఎసిబి అధికారులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకే
# వైజ్ఞానిక ప్రదర్శనలు

జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్



**ప్రజాపక్షం / జనగామ :**విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకే వైజ్ఞానిక ప్రదర్శనలు అని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. పుస్తకాలతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జనగామ పట్టణంలోని సాన్ మారియా ఉన్నత పాఠశాలలో సైన్స్ ఫేయిర్‌ను ఘనంగా ప్రారంభించారు. జిల్లా అడిషన్ కలెక్టర్, విద్యాశాఖ అధికారి పింకేష్‌కుమార్, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంచుకున్న లక్ష్యాలు తమ అభిరుచులకు తగ్గట్టుగా, ఈ కాలానికి మన దేశానికి అవసరమయ్యే విధంగా ఉండాలన్నారు. విద్యార్థులు కేవలం సైన్ చదవడమే కాకుండా ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని తమ జ్ఞానాన్ని ఇంకా పెంపొందించుకోవాలన్నారు. స్మార్ట్ ఫోన్ ద్వారా అందుబాటులో ఉన్నటువంటి ఎఐ ఆఫ్ ద్వారా ఎటువంటి సమాచారాన్ని ఐయినా సరైన సూచనలు చ్చి మనం పొందగలిగే అవకాశం ఉన్నందున విద్యార్థులు ఈ అవకాశాలను మంచికి ఉపయోగించుకొని పరిజ్ఞానం పెంపొందించుకొన్ని మంచి భవిష్యత్తు పొందాలని సూచించారు. ఈ సందర్భంగా సైన్స్ ఫేయిర్‌కు ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ప్రశంసించారు. అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి పింకేష్‌కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని మ అభిరుచి, ఆసక్తికి అనుగుణంగా తమ కోర్సులు ఎంచుకొని జీవితంలో రాణించాలన్నారు. ప్రాజెక్టులను అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ వీక్షించారు. ఈ సైన్స ఫేయిర్‌లో 77 ప్రాజెక్టులు 333 ఇన్స్‌పైర్‌లు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ మూర్తి, సైన్ అధికార ఉపేందర్, సైన్ ఫేయిర్ కోకన్వీనర్ ఏఎంవో శ్రీనివాస్, జాయింట్ కన్వీనర్ ఎంఈఓ శంకర్‌రెడ్డి, ఏసిజి రవికుమార్, సీఎంఓ నాగరాజు, ఎఎస్‌సి శ్రీకాంతరెడ్డి, డిసిపి సెక్రటరీ చంద్రబాను, పాఠశాల కరస్పాండెంట్ జగన్‌మోహన్‌రెడ్డి, మండలాల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

**రైతుల సంక్షేమం కోసమే కొత్త విత్తన చట్టం**

రైతుల సంక్షేమం కోసమే కొత్త విత్తన చట్టం తీసుకురావడం జరిగిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. నూతన వత్తన చట్టం 2025 ముసాయిదాపై అభిప్రాయ సేకరణ కార్యక్రమం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు ప్రజయోజనాలు కాపాడడమే నూతన విత్తన చట్టం లక్ష్యమన్నారు. మార్కెట్‌లో లభిస్తున్న విత్తనాల నాణ్యతను క్రమబద్ధీకరించడం, రైతులకు గిట్టుబాటు ధర, నాణ్యమైన విత్తనాలు అందుబాటులోక తేవడం, నాసిరకం విత్తనాలు అరికట్టడం, నవ కల్పనను ప్రోత్సహించడం వంటి ప్రాముఖ్యమైన అంశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఉమారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోని, మండల వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ సంచాలకులు పాల్గొన్నారు.

**ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు**

ప్రమాదాల నివారణకు ఎన్‌హెచ్ రోడ్, ఫ్లైఓవర్ల మీద పక్కాగా లైటింగ్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వయించారు. కలెక్టర్ మాట్లాడు తూ జాతీయ రహదారులపై జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు పోలీసు, రవాణ శాఖ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు.ఈ సమావేశంలో డిసిపి రాజమహేంద్రనాయక్, ఆర్అండ్‌బి, ఎక్సైజ్, మున్సిపల్, ఆర్‌టిఏ అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలి

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద



**ప్రజాపక్షం/ వరంగల్:** విద్యార్థి దశ నుండే సైన్స్ పై మక్కువ పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. వరంగల్ ఉర్సుగుట్ట తాళ్ళపద్మావతి ఇంటర్నేషనల్ పాఠశాలలో జరుగుతున్న ఇన్స్‌ఫైర్ అవార్డ్స్ మనక్, ఆర్‌బివిపి సైన్స్ ఎగ్జిబిషన్‌కి రెండవ రోజు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా హాజరై ఇన్స్‌ఫైర్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శించి విద్యార్థుల ప్రాజెక్టులను ఒక్కొక్కటిగా పరిశీలిస్తూ అభినందనలు తెలిపారు. ఉదయం నుంచే విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, శాస్త్రాభిమానులు బారులు తీరారు. వివిధ పాఠశాలల నుండి వచ్చిన బాలబాలికలు తమ ప్రతిభను శాస్త్రీయ ఆలోచనలతో సమన్వయం చేస్తూ, సమాజ సమస్యలకు పరిష్కారాలు చూపే విధంగా రూపొందించిన మోడళ్లు ప్రదర్శించారు. విద్యార్థులు సైన్స్ ఫెయిర్ స్ఫూర్తితో ముమ్ముందు మరిన్ని ఉత్తమమైన ప్రాజెక్టులు రూపొందించాలని, పాఠశాల స్థాయి నుండి సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ విభిన్న ఆలోచనలతో విద్యార్థులు వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించడం సంతోషదాయకమన్నారు. డిసెంబర్ రెండవ వారంలో రాష్ట్రస్థాయిలో జరిగే ప్రదర్శనలో జిల్లా స్థాయిలో ఉత్తమంగా ఎంపికైన ప్రాజెక్టులను పంపిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల వినూత్న ప్రాజెక్టులు ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నాయి. రైతులకు ఉపయోగపడే స్మార్ట్ సీడ్ ప్లాంటర్, అప్రమత్తత కలిగించే రోడ్ యాక్సిడెంట్ అలర్ట్ సిస్టమ్, నీటి కొరత నివారణకు గ్రౌండ్ వాటర్ రీచార్జ్ మోడల్, పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్, పారిశుద్ధ్యానికి సెన్సార్ ఆధారిత డస్ట్ బిన్, అనారోగ్యులను పర్యవేక్షించే హెల్త్ మానిటరింగ్ బ్యాండ్, శారీరక శ్రమ తగ్గించే శ్రామికుల కోసం బరువుల మోయు యంత్రం లాంటి ప్రాజెక్టులు సందర్శకుల ప్రశంసలు అందుకున్నాయి. పాఠశాల విద్యార్థుల్లో సమాజ సేవ భావన పెంపొందించేందుకు, సమస్యలను శాస్త్రీయ పద్ధతిలో విశ్లేషించి పరిష్కార మార్గాలను ఆచరణలోకి తేవడానికి ఈ వేదిక ఎంతగానో దోహదపడుతోందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థుల్లో టీమ్ వర్క్, పరిశోధనా దృక్పథం, ప్రదర్శన నైపుణ్యం, సాంకేతిక సామర్థ్యాల పెంపుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో కీలకమన్నారు.

## థాయిలాండ్ దేశంలో మనోళ్ల గెలుపు

షటిల్‌లో సత్తా చాటిన బొద్దిరెడ్డి, గడ్డం కేశవ మూర్తి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండకు చెందిన వెటరన్ షటిల్ క్రీడాకారులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, గడ్డం కేశవమూర్తి థాయిలాండ్ దేశంలోని పట్టాయా మహానగరంలో తమ ప్రతిభను చాటారు. ఈనెల 21 నుంచి 23 వరకు జరిగిన ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ సవాస్ ది కప్ 2025లో రన్నరపుగా నిలిచారు. కన్నుల పండుగగా జరిగిన ఈ అంతర్జాతీయ షటిల్ టోర్నమెంట్లో ప్రపంచ దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. 60 ప్లస్ డబుల్స్ లో బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, గడ్డం కేశవమూర్తి జంట చైనా, మలేషియా దేశాల క్రీడాకారులపై విజయం సాధించారు. నిర్వాహణ దేశమైన థాయిలాండ్ దేశ క్రీడాకారులతో నువ్వా నేనా అన్నట్లు సాగిన పోటీలో ఓటమిని చవిచూసి రన్నరప్ గా నిలిచారు. బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, గడ్డం కేశవ మూర్తిని జి డబ్ల్యూ ఎంసి ఇండోర్ స్టేడియంలో తోటి క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో వీరికి శాలువా కప్పి, బొకేలు ఇచ్చి అభినందించారు. కొత్తగట్టు సుధాకర్, మార్త శ్రీధర్, పూతాటి రవి, కొత్తగట్టు శివ, పూసల సంతోష్, కేతిరెడ్డి లక్ష్మి రెడ్డి, చదలవాడ నితిన్, చింతాకుల ప్రభాకర్, రోహన్ సింగ్, శివ , దుస్స వినయ్, పీసు రాజిరెడ్డి, కోట రమణారెడ్డి, పూజారి విజయ్, వైవీ రాజేందర్ తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.

## ప్లాస్టిక్ రహిత మార్కెట్‌గా తీర్చిదిద్దాలి

నగర మేయర్ గుండు సుధారాణి




**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:**బాలసముద్రం(ఎల్ఐసి) మార్కెట్‌ను పర్యావరణ హిత మార్కెట్‌గా తీర్చిదిద్దాలని నగర మేయర్ గుండు సుధారాణి అభిప్రాయపడ్డారు. హన్మకొండలోని బాల సముద్రం(ఎల్ఐసి) మార్కెట్‌లో శుక్రవారం బల్దియా శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ నిర్మూలన అవగాహన కార్యక్రమంలో నగర మేయర్ ముఖ్య అతిధిగా హాజరై ప్లాస్టిక్ వలన జరిగే అనర్థాలను తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బాల సముద్రం మార్కెట్‌ను ప్లాస్టిక్ రహిత మార్కెట్‌గా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని ఇందుకోసం మార్కెట్‌లో వ్యాపారాలు నిర్వహించుకునే ప్రతి ఒక్కరూ తన వంతు బాధ్యతగా సహకరించాలని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అనేక రకాల అనర్థాలకు కారణ భూతం అవుతుందని అన్నారు. ప్లాస్టిక్ భూమిలో కలిసి పోకుండా రసాయనాలను విడుదల చేయడం వలన పర్యావరణం కలుషితం అవుతుందని అన్నారు. మార్కెట్‌లో గల పలు దుకాణదారులకు ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలను తెలియజేసే కరపత్రాలను మేయర్ స్వయంగా అందజేసి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో సిఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, ఈఈ రవికుమార్, డిఈ రాగి శ్రీకాంత్, సానిటరీ సూపర్‌వైజర్ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

## ఫూలేకి 'కుడా' చైర్మన్ ఇనగాల నివాళులు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** సమసమాజ స్థాపన స్ఫూర్తి ప్రదాత, సామాజిక సంస్కరణల నాందికర్త, బడుగు జనద్దారకుడు మహాత్మా జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సందర్భంగా వరంగల్ ములుగు రోడ్డులోని విగ్రహానికి కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం హనుమకొండ డిసిసి కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం మొంథా తుఫాన్ బాదితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అనంతరం వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హనుమకొండ డీసీసీ అధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలియచేశారు.ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, పిసిసి మెంబర్ ఈ.వి. శ్రీనివాస్ రావు, హనుమకొండ మహిళా అధ్యక్షురాలు బంక సరళ, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ గార్లు, 52, 53,54 డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, డివిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల జిల్లా స్థాయి ఆటల పోటీలు

జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఎం సఖిత

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :**29న మహబూబాబాద్ ఎన్.టి.ఆర్ స్టేడియంలో దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారిని ఎం. సఖిత పత్రికా ప్రకటనలో తెలిపారు. పోటీలలో పాల్గొనే దివ్యాంగులు జూనియర్ విభాగం వయస్సు 10–18 సం.రాలు మరియు సీనియర్ విభాగంలో 18–54 సం.రాల వారికి రన్నింగ్, పాట్పుట్, చెస్, క్యారమ్, జావెలిన్ త్రో పోటీలు బాల బాలికలకు విడివిడిగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో స్పెషల్ స్కూల్ పిల్లలు, దివ్యాంగులు పాల్గొని జిల్లా స్థాయి ఆటల పోటీలను దిగ్విజయం చేయవలసినదిగా ఆమె తెలిపారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో ఉన్న వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఇతర వివరాలకు 8978698912, 9177 260816 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని జిల్లా సంక్షేమ అధికారిణి తెలిపారు.

## నిరుపేద కుటుంబాలకు బియ్యం పంపిణీ



**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 56వ డివిజన్ పరిధిలోని గోపాలపురం పలు కాలనీలు మొంథా తుఫాన్ ప్రభావంతో ఇళ్లు, జీవనోపాధి దెబ్బతినగా శుక్రవారం 272 నిరుపేద కుటుంబాలకు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు రేషన్ బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ "ప్రకృతి విపత్తులు ఊహించని విధంగా ప్రజలపై ప్రభావం చూపుతాయని, తుఫాన్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఆకలి అనే సమస్య ఎవరికీ రాకూడదన్న ఉద్దేశంతో తక్షణ సహాయంగా రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నామని,అవసరమైన చోట మరింత సహాయం అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారన్నారు. బాధిత కుటుంబాల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి కొనసాగుతుందని, ప్రజల కష్టం మా కష్టమే అన్న భావనతో ఎప్పుడూ మీ వెంటే ఉంటానని, ఎలాంటి ఆపద వచ్చినా తాను మీతోనే ఉంటాను" అని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, తాము అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం ఆర్టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఉచిత బస్సు ప్రయాణంపై కెటిఆర్, కొంతమంది నేతలు కావాలనే విష ప్రచారం చేస్తున్నారని, అధికారం పోయిన కెటిఆర్‌కు అహంకారం తగ్గలేదన్నారు. కెటిఆర్, హరీష్ రావులు చేసిన అక్రమాలపై వారి ఇంటి ఆడబిడ్డ కవితనే స్వయంగా ప్రశ్నిస్తుందన్నారు. మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని, మా అమ్మ నన్ను అనునిత్యం చదువుకో అని ప్రోత్సహించేవారని, మా అమ్మ ప్రోత్సాహం వల్లనే ఇప్పుడు నేను మీ అందరి మధ్య ఉన్నానని, మహిళ తలుచుకుంటే కుటుంబం బాగుపడుతుందని, కుటుంబం బాగుంటే గ్రామం బాగుంటుందని, గ్రామాలు బాగుంటే దేశం బాగుంటుందని, మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా లబ్ధి పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు నిరంతర ప్రక్రియ

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/కాజీపేట :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నదని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు శుక్రవారం నా డు ఎమ్మెల్యే నాయిని నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి 49 వ డివిజన్ ప్రగతి నగర్‌లో రూ.100 లక్షలతో, 48 డివిజన్లో రూ.209 లక్షలతో అంతర్గత రోడ్ల అభివృద్ధి,సైడ్ డ్రైన్ నిర్మాణం, దర్గా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.స్థానిక ప్రజలను మమేకం చేస్తూ సాగిన ఎమ్మెల్యే నాయిని పర్యటన ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలు నిరంతర ప్రక్రియ అని గత పాలకుల హయాంలో జరగని అభివృద్ధి పనులు గడిచిన రెండేళ్లలోనే చేపడుతున్నామని తెలిపారు. ఎక్కడ కూడా రాజకీయ భేదాలకు తావు లేకుండా అన్ని డివిజన్లను సమపాళ్లలో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.ఒకే రోజు సుమారు 300 లక్షలతో పనులకు శంకుస్థాపనలు చేయడంలో మా ప్రభుత్వం చిత్తశుద్ధి కనపడుతుందని ఆయన అన్నారు. అనంతరం దర్గా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే దర్గా పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం అధికంగా ఉండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాలలో ఆయా డివిజన్ ల కార్పొరేటర్లు సత్రాజ్ బేగం,మనసా రామ్ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ అబూబకర్,సీనియర్ నాయకులు అమర్,మట్టెడ కుమార్,లెంకలా శ్రీనివాస్ డివిజన్ అధ్యక్షులు మల్లారెడ్డి,సింగారపు రవి ప్రసాద్ ,అధికారులు ఈఈ రవి కుమార్,డీఈ శ్రీకాంత్,రవీందర్, అజీజ్,ప్రవలిక , పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఆదర్శ కమ్యూనిస్టు రాధారపు కట్టమల్లు

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి



**ప్రజాపక్షం/గీసుకొండ :** ఆదర్శ కమ్యూనిస్టు రాధారపు కట్టమల్లు అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, నాయకులు కూసం రాజమౌళి అన్నారు. సమాజంలో అసమానతలు, అవినీతి, లంచగొండితనం, దోపిడి పీడనలు నశించాలని గీసుకొండ మండలం మొగిలిచర్ల గ్రామంలో 1970లో కమ్యూనిస్టు పార్టీని నిర్మించి పేద ప్రజల హక్కుల కోసం నిస్వార్థంగా 60 సంవత్సరాలు ఎర్రజెండా అండతో పేదల హక్కుల కోసం అనేక పోరాటాలు చేసిన గొప్ప కమ్యూనిస్టు వీరుడు రాధారపు కట్టమల్లు అని తెలిపారు. శుక్రవారం గీసుకొండ మండలం మొగిలిచర్ల గ్రామంలో అనారోగ్యంతో రాధారపు కట్టమలు (80) మరణించగా కట్టమల్లు భౌతిక దేహం పై ఎర్ర గుడ్డ కప్పి జోహార్లు అర్పించారు. ఈ వారు సందర్భంగా మాట్లాడుతూ మొగిలిచర్ల గ్రామంలో దళిత, బహుజన పేదలకు 2000 మందికి నివాస స్థలాలు పోరాడి సాధించి గూడు, నీడ కల్పించిన భూపోరాట యోధుడు కట్టమల్లు అని పేర్కొన్నారు.మొగిలిచర్ల చుట్టుపక్కల ప్రాంతాలలో పోగుల ఆగయ్య నగర్, కారల్ మార్క్స్ నగర్, గోపాల్ రెడ్డి నగర్ కాలనీలు ఏర్పాటు చేసి నివాస స్థలాలు లేని పేద ప్రజలకు పెద్దదిక్కుగా నిలిచిన కట్టమల్లు మర ణం కమ్యూనిస్టు ఉద్యమానికి కుటుంబానికి తీరని లోటు పేర్కొన్నారు. కట్టమలు అకాల మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని,వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కట్టమల్లు అంతిమ యాత్రలో జ్యోతి తో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి, ఎదునూరి వెంకట్రాజం, జిల్లా సమితి సభ్యులు అలువాల రాజు, నేదునూరి సాంబయ్య నేదునూరి కుమార స్వామి, నేదునూరి రాజయ్య, బిళ్ళ రవి, ఎండి భషీర్, భద్రయ్య, కట్టమల్లు భార్య రాజ్యలక్ష్మి కూతుళ్లు విజయ, రమ, సుమ, అల్లుళ్లు సాంబయ్య,బుచ్చయ్య, మనోహర్, కాంచన పెల్లి శ్రీనివాస్, రాజు,సముద్రాల లక్ష్మీ నారాయణ బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకు ఖాతాలు ప్రారంభించడంలో ఆలస్యం కాకుండా చర్యలు

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీచేయు అభ్యర్థుల ఎన్నికల వ్యయ వివరాల కోసం నూతన బ్యాంక్ ఖాతా ప్రారంభించడంలో ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాల ని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ బ్యాంకర్లుకు సూచించారు. గ్రామ పంచాయ తీ ఎన్నికల్లో పోటీచేయు అభ్యర్థులు ఎన్నికలు వ్య య వివరాల ఖర్చులు నమోదుకు ప్రత్యేక బ్యాంక్ ఖాతా ప్రారంభించుటలో ఆలస్యం జరుగుతున్నదని జాప్యం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎల్డిఎంకు సూచించారు. జాప్యానికి అవకా శం లేకుండా బ్యాంకర్లు సహకరించాలని తెలిపా రు. ఎన్నికల సంగం ఆదేశాల ప్రకారం ఎన్నికల వ్యయాల నిర్వహణ కోసం ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా ప్రత్యేకంగా బ్యాంక్ ఖాతా ప్రారంభించాలని తెలిపారు. ఎన్నికల ఖర్చుల నిర్వహణ కోసం ప్రారంభించే నూతన బ్యాంక్ ఖాతా, తప్పనిసరిగా అదే బ్యాంక్‌లో ఉండాల్సిన అవసరం లేదని, ఇతర జాతీ యాకృత బ్యాంకుల్లో కూడా తెరవవ చ్చుఅభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా బ్యాంకులు తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. .

## గూడూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

నామినేషన్ దాఖలు చేసిన మాజీ ఎంపిపి, సర్పంచ్ రమేష్ నాయక్



**ప్రజాపక్షం/గూడూరు:** మళ్లీ దీవించి సర్పంచ్ గెలిపిస్తే గూడూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తా అని మాజీ ఎంపిపి, సర్పంచ్ నూనవత్ రమేష్ నాయక్ అనిత అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈసందర్భంగా రమేష్ నాయక్ మాట్లాడుతూ గతంలో గూడూరు గ్రామసర్పంచ్‌గా ఎన్నో అభివృద్ధి పనులు చేశానని ప్రజలలో తిరుగుతూ వారి కష్టసుఖాలు పాలుపంచుకున్న విషయం మీ అందరికీ తెలుసు అని అన్నారు. ప్రజాసేవ చేయడం మా తాతనుండే ప్రారంభమైందని మానాన్న కూడా ప్రజాసేవ చేసాడు నేను అనిత ప్రజల్లో ఉంటూ ప్రజల మన్ననలు పోందుకుంటున్నామని అన్నారు. గూడూరు గ్రామపంచాయతీ పరిధిలో ఎవరు ఆపదలో ఉన్న అదుకున్న కుటుంబం మాదని ప్రజల కోరకే మాజీవితాన్ని అంకీతం చేశామని ఆయన అన్నారు. మళ్లీ తనకు అవకాశం ఇస్తే గూడూరు మండలంలో ఇంకా అనేక అభివృద్ధి పథకాలను అమలయ్యేలా కృషి చేస్తానని అన్నారు.

## ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలు

ఎన్నికల పరిశీలకులు రవి కిరణ్



**ప్రజాపక్షం / జనగామ :**గ్రామ పంచాయతీ ఎన్నికలు సాఫీగా నిర్వయించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు రవి కిరన్ అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలపై జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్, అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, డిసిపి రాజమహేంద్రనాయక్‌లతో కలిసి ఎన్నికల పరిశీలకులు, నోడల్ అధికారులతో సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు రవి కిరణ్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను సాఫీగా నిర్వహించేందుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు ఉండాలన్నారు. జిల్లాలో మూడు దశల్లో ఎన్నికలు జరుగుతున్నందున పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సబ్బంది నియామకం, శిక్షణ బ్యాలట్ బాక్సులు, రవాణా, జోన్లు, రూట్ అన్ని అంశాల్లో పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు పూర్తి స్థాయిలో పారదర్శకతతో జరిగేలా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్థన నియమావలిని పక్కాగా అమలు చేయాలన్నారు. ఎన్నికల విధులు నిర్వయించే ప్రతి ఒక్కరు శిక్షణ పూర్తి చేసుకొని ఉండాలన్నారు. ఎన్నికల నిర్వాహణలో ఎలాంటి సందేహాలు ఉన్నా వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. జిల్లా పరిషత్ సీఈఓ మాధురి షా, ఇన్‌చార్జి డిపిఓ , డిఆర్‌డిఓ వసంత పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నకలకు సంబందించ పోటీ చేసే అభ్యర్థుల నుండి నామినేషన్ల స్వీకరణ ఎలాంటి తప్పిదాలు లేకుండా చూడాలన్నారు.

# రీల్

## అఖిల్ రాజ్‌తో 'అర్జునుడి గీతోపదేశం'



రాజు వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ రాజ్, దివిజ ప్రభాకర్, ఆదిత్య శశికుమార్, సదన్, వసంతిక మచ్చ, హీరో హీరోయిన్స్‌గా రూపొందుతున్న చిత్రం అర్జునుడి గీతోపదేశం. వరలక్ష్మి శరత్ కుమార్ ఇంపార్టెంట్ రోల్ ప్లే చేస్తున్నారు. సతీష్ గోగాడ ని దర్శకుడిగా పరిచయం చేస్తూ ఫస్ట్ కట్ ఫిలిం ఫ్యాక్టరీ బ్యానర్‌పై త్రిలోక్ నాథ్ కాళిశెట్టి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఎనభై శాతం షూట్ హైదరాబాద్, రాజమండ్రి, అమలాపురం పరిసర ప్రాంతాల్లో జరిగింది. ఆఖరి షెడ్యూల్ డిసెంబర్‌లో మొదలవుతుందని చిత్ర నిర్మాత త్రిలోక్ నాథ్ కాళిశెట్టి తెలిపారు. ఈ చిత్రానికి చరణ్ అర్జున్ సంగీతం అందిస్తున్నారు. ఛాయాగ్రహణం చైతన్య కందుల, ఎడిటర్ ఎంఎన్ అర్జున్.

## 'పతంగ్' లిరికల్ వీడియో విడుదల



న్యూ టాలెంట్‌ను ఎంకరైజ్ చేయడంలో ఎప్పుడూ ముందుండే సురేష్ ప్రొడక్షన్స్ అధినేత, ప్రముఖ నిర్మాత డి.సురేష్ బాబు తాజాగా 'పతంగ్' చిత్ర టీమ్‌తో చేతులు కలిపారు. సురేష్ ప్రొడక్షన్స్ డి.సురేష్ బాబు సమర్పణలో ఈ చిత్రం డిసెంబరు 25న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఇటీవల ఈ చిత్రంను ప్రత్యేక్షంగా వీక్షించి, చిత్ర టీంను ప్రశంసించిన ఆయన 'పతంగ్' చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్ పతాకంపై తన సమర్పణలో చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నారు. పతంగుల పోటీతో రాబోతున్న ఈ కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్'. సినిమాటిక్ ఎలిమెంట్స్, రిషన్ సినిమాస్, మాన్సూన్ సంస్థలు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నీ ఈ స్పోర్ట్స్ డ్రామా ఈ చిత్రానికి విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి, నాని బండ్రెడ్డి నిర్మాతలు. ఈ చిత్రానికి ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకుడు. ఈ చిత్రంలో ఇన్‌స్టాగ్రామ్ సెన్సేషన్ ప్రీతి పగడాల, జీ సరిగమప రన్నరప్ ప్రణవ్ కౌశిక్తో పాటు వంశీ పూజిత్ ముఖ్యతారలుగా నటిస్తున్నారు. మరికొంత మంది నూతన నటీనటులతో పాటు ప్రముఖ సింగర్, నటుడు ఎస్పీ చరణ్ ఈ చిత్రంలో కీలకమైన పాత్రలో కనిపించబోతున్నారు. సురేష్ ప్రొడక్షన్స్, డి.సురేష్ బాబు సమర్పణలో ఈ చిత్రం డిసెంబరు 25న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ చిత్రంలోని ఎమోషనల్ డ్రామా అంటూ కొనసాగే ఓ మాసివ్ పాటను చిత్ర సమర్పకుడు సురేష్‌బాబు విడుదల చేశారు. శుక్రవారం జరిగిన ఈ పాత్రికేయుల సమావేశంలో ఈ పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ.. 'కొత్తతరం అంతా కలిసి ఈ సినిమా చేశారు. ఎంతో డబ్బు ఖర్చు పెట్టి ఎంతో రిచ్గా చేశారు. నాని బండ్రెడ్డి మంచి క్రియేటివిటి ఉన్న పర్సన్. కెమెరా వర్క్ అన్ని బాగున్నాయి. ఈ సినిమా కోసం ఎంతో ఖర్చు పెట్టి క్లైమాక్స్ షూట్ చేశారు. ఓ స్టేడియంను తీసుకుని, పతంగుల పోటీ పెట్టి ఎంతో భారీగా ఆ పతాక సన్నివేశాలు తీశారు. సినిమా తప్పకుండా అందరికి నచ్చుతుంది. తప్పకుండా ఈసినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు.

## 'భీమవరం బల్మా' పాట ఆవిష్కరణ



నవీన్ పోలిశెట్టి హీరోగా వస్తున్న సినిమా 'అనగనగా ఒక రాజు'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో మారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మీనాక్షి చౌదరి కథానాయిక. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి మొదటి గీతం 'భీమవరం బల్మా' తాజాగా విడుదలైంది. 'భీమవరం బల్మా' గీతావిష్కరణ వేడుక భీమవరంలోని ఎస్.ఆర్.కె.ఆర్. ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా జరిగింది. యువత కోలాహలం నడుమ ఎంతో వైభవంగా జరిగిన ఈ వేడుకలో చిత్ర బృందం సందడి చేసింది. ముఖ్యంగా సంక్రాంతి పండుగను కాస్త ముందుగానే తీసుకొచ్చినట్టుగా ఎద్దుల బండిపై నవీన్ పోలిశెట్టి వేదిక వద్దకు రావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే మీనాక్షితో కలిసి 'భీమవరం బల్మా' పాటకు వేదికపై నవీన్ స్టెప్పులేసి అందరిలో ఉత్సాహం నింపారు.'భీమవరం బల్మా' పాటతో నవీన్ పోలిశెట్టి మొదటి సారి గాయకుడిగా మారడం విశేషం. గాయకుడిగా తొలి ప్రయత్నంలోనే ఆకట్టుకున్నారు. వినోదాన్ని పంచడంలోనే కాదు, పాటను ఆలపించడంలోనూ దిట్ట అనిపించుకున్నారు. కథానాయిక మీనాక్షి చౌదరితో కలిసి ఈ పాటలో ఆయన చేసిన నృత్య ప్రదర్శన కట్టిపడేసింది.. జనవరి 14న థియేటర్లలో అందరం హాయిగా నవ్వుకుందాం.

## 'పితాపురంలో' ముగ్గురు తండ్రుల కథ



తొలి చిత్రం 'ప్రేయసి రావే' తోనే దర్శకునిగా తన సత్తా చాటుకున్నారు మహేష్ చంద్ర. ఆ తర్వాత అయోధ్య రామయ్య, చెప్పాలని వుంది, జోరుగా హుషారుగా, ఒక్కడే, హనుమంతు, ఆలస్యం అమృతం, రెడ్ అలర్ట్ చిత్రాలతో మంచి పేరు తెచ్చుకున్నారాయన. తాజాగా మహేష్ చంద్ర రూపొందించిన చిత్రం 'పితాపురంలో'. దీనికి ఉప శీర్షిక 'అలా మొదలైంది'. 'నటకిరీటి' డా. రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, జయవాహిని, అన్నపూర్ణమ్మ తదితరులు ముఖ్య తారాగణంగా ఈ చిత్రం రూపొందింది. మహేష్ చంద్ర సినిమా టీమ్ బ్యాన్న దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్ఎం మురళి (గోదారి కిట్టయ్య) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఈ సందర్భంగా దర్శకుడు మహేష్చంద్ర మాట్లాడుతూ కుటుంబ భావోద్వేగాలు కలగలిసిన ప్రేమకథ ఇది. ఇందులో మూడు జంటల ప్రేమకథలు చూడొచ్చు. ముగ్గురు తండ్రుల పెంపకాల్లోని లోటుపాట్లనీ చూడొచ్చు. ప్రేక్షకులు ఏదో ఒకరకంగా ఈ కథతో కనెక్ట్ అవుతారు. ఈమధ్య కాలంలో 'పిఠాపురం' అనేది ఎంతలా మారుమోగిందో అందరికీ తెలిసిందే. ఆ పిఠాపురం నేపథ్యంలోనే సినిమా అంతా సాగుతుంది. పిఠాపురం పరిసర ప్రాంతాల్లో 80పెర్సెంట్ చిత్రీకరణ జరిపాం. ఇందులో మొత్తం మూడు పాటలు ఉంటాయి. పాటలు చాలా బాగా వచ్చాయి. గోవాలో కొన్ని సీన్స్, ఒక పాటను, హైదరాబాద్లో సెట్వేసి ఇంకో పాటను, సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్లో మరో పాటను చిత్రీకరించాం. దర్శకునిగా నాకు జీవితాన్ని ప్రసాదించిన 'మూవీమొఘల్' డి.రామానాయుడు స్ఫూర్తితో కథను నమ్మి, ఎక్కడా వేస్టేజ్ లేకుండా ఈ సినిమా తీశాం. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తాం' అని తెలిపారు.

## 'వానర' టీజర్ రిలీజ్

అవినాశ్ తిరువీధుల హీరోగా, దర్శకుడిగా పరిచయమవుతున్న సినిమా 'వానర'. ఈ చిత్రంలో సిమ్రాన్ చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. నందు ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. 'వానర' చిత్రాన్ని శంతను పత్తి సమర్పణలో సిల్వర్ స్క్రీన్ సినిమాస్ బ్యానర్‌పై అవినాశ్ బుయానీ, ఆలపాటి రాజా, సి.అంకిత్ రెడ్డి నిర్మిస్తున్నారు. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్ అందిస్తున్న 'వానర' సినిమా మైథలాజికల్ రూరల్ డ్రామా కథతో ప్రేక్షకుల్ని ఆకట్టుకునేందుకు రాబోతోంది. వివేక్ సాగర్ మ్యూజిక్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ కాబోతోంది. 'వానర' సినిమా టీజర్ ను రాకింగ్ స్టార్ మంచు మనోజ్ చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలోరాకింగ్ స్టార్ మంచు మనోజ్ మాట్లాడుతూ 'వానర' సినిమా టీజర్ లాంచ్ కు గెస్ట్‌గా రావడం హ్యాపీగా ఉంది. అవినాశ్ గురించి నాకు తెలుసు. చాలా కష్టపడే తత్వం ఉన్నవాడు. ఫస్ట్ సినిమాకే హీరోగా నటించడంతో పాటు డైరెక్షన్ కూడా చేశాడు. అది అంత సులువు కాదు. ఈ రోజు చిన్న సినిమా పెద్ద సినిమా లేదు. కంటెంట్ బాగుంటే ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. బాగున్న ప్రతి సినిమా భాషలకు అతీతంగా ఇండియన్ సినిమా అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో క్రియేటివ్ డైరెక్టర్ జానకీ రామ్, నటుడు హర్ష, ఎడిటర్ ఛోటా కె ప్రసాద్ స్టోరీ, స్క్రీన్ ప్లే రైటర్ విశ్వజిత్, నటుడు శివాజీ రాజా, చిత్ర సమర్పకులు శంతను పత్తి, డైలాగ్ రైటర్ సాయి మాధవ్ బుర్రా, డీవోపీ సుజాత సిద్ధార్థ్, హీరో, డైరెక్టర్ అవినాశ్ తిరువీధుల ఉన్నారు.



## 'లైఫ్ ఈజ్ ఎ గేమ్..' సాంగ్ రిలీజ్




ఈషా రెబ్బా, సత్య, హర్ష చెముడు, ప్రిన్స్ సిసిల్, హేమ, సత్యం రాజేశ్, కుషిత కల్లపు ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'త్రీ రోజెస్'. ఆహా ఓటీటీలో సూపర్ హిట్టయిన ఈ సిరీస్ సీజన్ 2 డిసెంబర్ 12వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కు రెడీ అవుతోంది. రాశీ సింగ్ మరో కీ రోల్ చేసింది. ఈ సిరీస్‌ను మాస్ మూవీ మేకర్స్ బ్యానర్ పై ఎస్ కేఎన్ నిర్మిస్తున్నారు. డైరెక్టర్ మారుతి షో రన్నర్‌గా వ్యవహరిస్తున్నారు. రవి నంబూరి, సందీప్ బొల్ల రచన చేయగా..కిరణ్ కె కరవల్ల దర్శకత్వం వహించారు. ఈ వెబ్ సిరీస్ నుంచి లైఫ్ ఈజ్ ఎ గేమ్ లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు.లైఫ్ ఈజ్ ఎ గేమ్ పాటకు భాస్కరభట్ల రవికుమార్ ఇన్స్ పైరింగ్ లిరిక్స్ రాయగా, లిప్సిక అందంగా పాడారు. అజయ్ అరసాడ ఛాట్ బస్టర్ ట్యూన్ చేశారు. 'త్రీ రోజెస్ సీజన్ 2' సిరీస్‌లో ఫీమేల్ లీడ్ రోల్స్ చేసిన ఈషా రెబ్బా, రాశీ సింగ్, కుషిత కల్లపు వెకేషన్‌లో ఎంజాయ్ చేస్తున్న సందర్భంగా ఈ సాంగ్‌ను రూపొందించారు.

## 'లవ్ డేస్' టైటిల్ గ్లింప్స్ విడుదల



నవీన్, కుసుమ చందక జంటగా ఆన్ క్యాన్ ఎంటర్టైన్మెంట్స్, క్రిసెంట్ సినిమాస్ బ్యానర్ల మీద మాదల వెంకటకృష్ణ ప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'లవ్ డేస్'. ఏ టాక్సిక్ లవ్ స్టోరీ అనేది ఉప శీర్షిక. ఈ మూవీని సురేష్ లంకలపల్లి తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన టైటిల్, గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమానికి దర్శకుడు సముద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు సముద్ర మాట్లాడుతూ .. 'గీతాంజలి', 'తొలి ప్రేమ', 'అందాల రాక్షసి' లాంటి అద్భుతమైన ప్రేమ కథల్లా ఈ 'లవ్ డేస్' నిలిచిపోతుంది. 'లవ్ డేస్' పెద్ద విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను. టీం అందరికీ ఈ మూవీ జీవితంలో ఎన్నో మెమోరీస్ను అందించాలని కోరుకుంటున్నాను. మనస్ఫూర్తిగా ఈ మూవీ బిగ్ సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.దర్శకుడు సురేష్ లంకలపల్లి మాట్లాడుతూ .. 'నిర్మాత వెంకట్ వల్లే ఈ కథ, ఈ సినిమా ఇక్కడి వరకు వచ్చింది. సర్ నన్ను హీరోగా ఎందుకు చేయాలని అనుకున్నారో నాకైతే తెలియడం లేదు. డిసెంబర్ నుంచి మా నిర్మాత కొత్త ప్రాజెక్ట్ ప్రారంభించబోతోన్నారు. ఆర్య సాయి కృష్ణ 'రాచరికం' నుంచి నాతో జర్నీ చేస్తున్నారు. ఎడిటర్ ప్రదీప్ ఎప్పుడూ కష్టపడుతూనే పని చేశాడు. వెంగి మ్యూజిక్ ఎప్పుడూ అద్భుతంగానే ఉంటుంది. రాం ప్రసాద్ డైలాగ్స్ అందరినీ ఆకట్టుకుంటాయి. నవీన్ కటౌట్ బాగుంటుంది. కుసుమకి సినిమా పట్ల ఎంతో ప్యాషన్ ఉంది. ఆదిత్యకి తెలుగు అంతగా రాకపోయినా కష్టపడి డైలాగ్స్ చెప్పాడు. ఈ మూవీలో ప్రతీ ఒక్కరి పాత్ర బాగుంటుంది అని చెప్పారు.

## ధనుష్ శ్రీకాంత్‌కు ఘన స్వాగతం



ప్రజాపక్షం/హైదరాబాద్: ఇటీవల టోక్యోలో జరిగిన డెఫలింపిక్స్ 2025లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో రెండు బంగారు పతకాలు సాధించిన ధనుష్ శ్రీకాంత్ హైదరాబాద్ నగరానికి చేరుకున్న సందర్భంగా, రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మరియు చైర్మన్ శివసేనారెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అధికారులు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ చంద్రారెడ్డి స్టేడియం అడ్మినిస్ట్రేటర్లు వెంకటేశ్వరరావు నందకిషోర్ గోకుల్ పి ఆర్ ఓ కాలేరు సురేష్ తదితరులు ఉన్నారు.

## డిజిటల్ పైరసీ నివారణకు జపాన్‌తో ఫిలిం ఛాంబర్ ఒప్పందం



హైదరాబాద్ : హైదరాబాద్‌ను సినిమా హబ్‌గా మార్చే క్రమంలో తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కంటెంట్ ఓవర్సీస్ డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ టోక్యో, జపాన్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు జపాన్ ప్రతినిధులతో, తెలుగు ఫిలిం ఛాంబర్ ప్రతినిధులతో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పలు అంశాలపై చర్చించారు. డిజిటల్ పైరసీని ఎదుర్కొనడానికి జపాన్ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకున్న తెలుగు ఫిలిం ఛాంబర్ ప్రతినిధులను భట్టి ప్రశంసించారు. డిజిటల్ పైరసీ నివారణకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి ఈ సందర్భంగా చెప్పారు. ముందుగా వారు ప్రజా భవన్‌లో ఉప ముఖ్యమంత్రికు కోడా సంస్థ జపాన్ ప్రతినిధులు తమ, ప్రపంచ వ్యాప్తంగా జపనీస్ కంటెంట్కు పెరుగుతున్న ప్రజాదరణ గురించి వివరించారు. జపాన్లో తెలుగు చిత్రాలకు పెరుగుతున్న ఆదరణ గురించి కూడా తెలిపారు. ఇటీవలి కాలంలో డిజిటల్ పైరసీ ఒక అంతర్జాతీయ క్రైమ్‌గా ఉద్భవించింది. చట్టవిరుద్ధమైన బెట్టింగ్, ఐడెంటిటీ థెఫ్ట్, ఆన్లైన్ మోసం, మాల్వేర్ వ్యాప్తి మరియు చాలా వైవిధ్యమైన స్వభావం గల సైబర్ నేరాలు డిజిటల్ పైరసీతో ముడిపడి ఉన్నాయి. ఈ పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ప్రపంచవ్యాప్తంగా పరిశ్రమలు, సంస్థలు మరియు ప్రభుత్వాలు ద్వైపాక్షిక, బహుళపాక్షిక ఒప్పందాలు మరియు సహకారాన్ని కలిగి ఉండవలసిన అవసరం ఉందని భట్టి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత దగ్గుబాటి సురేష్ బాబు, ఫిలిం ఛాంబర్ కార్యదర్శి దామోదర్ ప్రసాద్, నిర్మాత సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

# 42శాతం రిజర్వేషన్ల సాధనకు ప్రభుత్వాన్ని వెంటాడుతాం

### అప్పటివరకూ ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదు

### అమరవీరుల స్థూపం వద్ద నిరసనలో ఎంపి ఆర్.కృష్ణయ్య



ప్రజాపక్షం/హైదరాబాద్ : బిసిలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేసేంతవరకు రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటడుతామని, వేటాడుతామని, అంతవరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని తెలంగాణ బిసి జెఎసి చైర్మన్ ఎంపి ఆర్.కృష్ణయ్య తెలిపారు. పంచాయతీల్లో బిసిల రిజర్వేషన్లను తగ్గించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర బిసి విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పగిళ్ల సతీశ్, బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద వందలాది మంది విద్యార్థులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య, బిసి సంఘాల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బిసి రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధత కల్పించే విషయంపై త్వరలో ప్రధానిని కలిసి చర్చిస్తామన్నారు. పంచాయతీ ఎన్నికలపై హైకోర్టు స్టే ఇవ్వకపోడం విచారకరమన్నారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీనిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బీహార్ ఎన్నికలు ముగియగానే చడీచప్పుడు కాకుండా రిజర్వేషన్లను 22శాతానికి తగ్గిస్తూ మరో జిఒ 46ను జారీ చేసి, అమలులో 17 శాతానికే కుదించారని తెలిపారు. జిఒ 46తో పది జిల్లాల్లో, 27 మండలాల్లో ఒక్క సర్పంచ్ స్థానం కూడా బిసిలకు దక్కలేదన్నారు. పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి శాస్త్రీయత లేకుండా అధికారులు బిసి రిజర్వేషన్లను ఖరారు చేశారని ఆరోపించారు. గతంలో ఉన్న బిసి రిజర్వేషన్లను సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గండికొడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం నేతలు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, డాక్టర్. ఆర్.అరుణ్ కుమార్, కొండా దేవన్న, భూమన్న గౌడ్, గుజ్జ సత్యం, సి.రాజేందర్, జి.అనంతయ్య, మోదీ రాందేవ్, బాణాల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## సరిదిద్దాలి

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడది 21.39 శాతానికి తగ్గిందన్నారు. అనగా మొత్తంలో 1.39 శాతం తగ్గిందని, బిసిల సంఖ్య జనాభాలో 56.33 శాతమని ఇటీవల జరిగిన ఇంటింటి సర్వేలో తేలిన తర్వాత రిజర్వేషన్ల శాతం గతంలో కంటే తగ్గడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రిజర్వేషన్లను నిర్ధారించే ప్రక్రియలో జరిగిన పొరపాటు వల్లనే బిసి రిజర్వేషన్లు గతంలో కంటే తక్కువ అయ్యాయని, దీనిని సరిదిద్ది ఎన్నికలు జరపాలని లేకుంటే బిసిలకు తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిసి కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, అసిస్టెంట్ సెక్రటరి కె.మనోహర్ రావు, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, సెక్షన్ ఆఫీసర్ సతీష్ కుమార్‌తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## స్టే ఇవ్వలేం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వానికి మరోసారి నివేదిక ఇచ్చిందని దాని ఆధారంగానే రిజర్వేషన్లు కేటాయిస్తూ జిఒ విడుదల చేశారన్నారు. కానీ నివేదికలో ఏముందో బయటపెట్టడం లేదని వాదించారు. బిసిలలో కులాల జనాభా ఎంత అనే విషయం బయటికి రాలేదని ప్రభుత్వం దేన్ని ఆధారంగా చేసుకొని జిఒ విడుదల చేసిందనే విషయం తెలియాల్సి ఉందన్నారు. బిసిలలో వర్గాల ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించకపోవడం వల్ల అత్యంత వెనుకబడిన కులాలు రాజకీయంగా నష్టపోతున్నాయన్నారు. ఎన్నికలపై స్టే విధించాలని సుదర్శన్ కోరారు. ఈ దశలో జోక్యం చేసుకున్న సిజె ధర్మాసనం పంచాయతీ రాజ్ చట్టంలోని 285 'ఎ'ను సవరించిన తర్వాత 2019లో పంచాయతీ ఎన్నికలు జరిగాయి కదా అని పిటిషనర్ న్యాయవాదిని ప్రశ్నించింది. అప్పుడు లేని బిసి రిజర్వేషన్ల సమస్య ఇప్పుడు ఎందుకు తలెత్తిందని ప్రశ్నించింది. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు పిటిషన్ వేయకుండా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత రిజర్వేషన్లను సవాల్ చేస్తూ కోర్టును ఎందుకు ఆశ్రయించారంది. ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ ప్రారంమభమైనందును జోక్యం చేసుకోలేమని హైకోర్టు పేర్కొంది.

**బిసి రిజర్వేషన్లకు ఆరు వారాల గడువు :** బిసి రిజర్వేషన్ల అంశానికి సంబంధించి 6 వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు రిప్లై కౌంటర్ దాఖలు చేయడానికి పిటిషనర్‌కు 2 వారాల గడువు ఇచ్చిం ది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. ఎంపిటిసి, జెడ్‌పిటిసితో పాటు పురపాలక సంఘాల ఎన్నికలు కూడా జరగనున్నాయని, ఆ ఎన్నికల్లోపు ఈ అంశం తేల్చే విధంగా వీలైనంత త్వరగా విచారణను చేపట్టాలని పిటిషనర్ న్యాయవాది కోరారు. బిసి డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఇచ్చేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. తదుపరి విచారణలో ఈ అంశాన్ని పరిశీలిద్దామన్న హైకోర్టు విచారణను 8 వారాలకు వాయిదా వేసింది.

## ప్రకృతి విలయం

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం సెలవు ప్రకటించడంతో, సహాయక చర్యలు ముమ్మరంగా సాగడానికి అవకాశం ఏర్పడింది. ట్రింకోమలీ జిల్లాలోని దిత్వాలో శుక్రవారం కూడా భారీగా వర్షాలు కురిశాయి. ప్రాణ నష్టం జరిగినట్టు సమాచారం ఏదీ అందలేదు. ఇలావుంటే, ఇండోనేషియాకు ముందు ఊహించినట్టు సునామీ ముప్పు లేకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, వర్షాలు, మెరుపు వరదలతో నదులు ఉప్పొంగి ప్రవహించగా, శిథిలాల కింద నుంచి మృతదేహాలను వెలికితీశారు. ఉత్తర సుమత్రా, దాని చుట్టుపక్కల ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. రెండు వేలకుపైగా ఇళ్లు నీట మునిగాయి. ఐదు వేల మందికి ప్రభుత్వ పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్నారు.

### థాయిలాండ్‌లో 145 మంది మృతి

థాయిలాండ్‌లో భారీ వర్షాలు, ఆకస్మిక వరదల పరిస్థితి కొంత సద్దుమణిగింది. శుక్రవారం నాటి అధికారిక ప్రకటనను అనుసరించి, ఇప్పటి వరకూ 145 మంది మృతి చెందారు. కనీసం 12 లక్షల ఇళ్లు పూర్తిగా లేదా పాక్షికంగా ధ్వంసమయ్యాయి. 36 లక్షల మందిని ఈ ప్రతికూల వాతావరణం ప్రభావితం చేసింది. మొత్తం ఎనిమిది ప్రావిన్సుల్లో వరద ప్రభావం ఎక్కువగా ఉంది.

## సిఇసి చేతికి రక్తపు మరకలు

(మొదటి పేజీ తరువాయి)

ఇంటెన్సివ్ సవరణ (సర్) మధ్య టిఎంసి రాజ్యసభ నాయకుడు డెరెక్ ఓ బ్రియన్ నేతృత్వంలోని 10 మంది సభ్యుల ప్రతినిధి బృందం ఎన్నికల సంఘం అధికారులను కలిసింది. ఈ ప్రతినిధి బృందంలో లోక్‌సభ ఎంపిలు మహువా మోయిత్రా, సతాబ్ది రాయ్, కళ్యాణ్ బెనర్జీ, ప్రతిమా మండల్, సజ్దా అహ్మద్, రాజ్యసభ ఎంపిలు డోలా సేన్, మమతా ఠాకూర్, సాకేత్ గోఖలే, ప్రకాష్ చిక్ బారిక్ ఉన్నారు. సమావేశం ఓ బ్రెయిన్ విలేకరులతో మాట్లాడుతూ తమ పార్టీ ఐదు ప్రశ్నలను లేవనెత్తిందని, అయితే ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ ఎటువంటి సమాధానాలు ఇవ్వలేదన్నారు. సిఇసి చేతులపై రక్తం మరకలు ఉన్నాయని చెప్పడం ద్వారా మేము సమావేశాన్ని ప్రారంభించామని, ఐదు ప్రశ్నలు లేవనెత్తామన్నారు. ఆ తరువాత కళ్యాణ్ బెనర్జీ, మహువా మొయిత్రా, మమతా బాల ఠాకూర్ దాదాపు 40 నిమిషాలు మాట్లాడారని ఓ'బ్రియన్ అన్నారు. ఆ తరువాత సిఇసి ఒక గంట పాటు నిరంతరాయంగా మాట్లాడారని చెప్పారు. అయితే తాము లేవనెత్తిన ఐదు ప్రశ్నలలో దేనికీ మాకు సమాధానం రాలేదన్నారు. సర్ ప్రక్రియతో ముడిపడి ఉన్న 40 మంది మరణాల జాబితాను ప్రతినిధి బృందం సిఇసితో పంచుకున్నట్లు మోయిత్రా చెప్పారు. అయితే, కమిషన్ దానిని కేవలం ఆరోపణలుగా తోసిపుచ్చిందని లోక్‌సభ ఎంపి పేర్కొన్నారు. అయితే టిఎంసి సర్ భావనను వ్యతిరేకించడం లేదని, కానీ సిఇసి, ఇసి పని చేస్తున్న ప్రణాళిక లేని విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుందని బ్రియన్ చెప్పారు. సర్ పూర్తిగా ప్రణాళిక లేనిది, హృదయం లేనిదని విమర్శించారు.

## భారత్‌కు పుతిన్

(మొదటి పేజీ తరువాయి)

ద్రౌపది ముర్ము కూడా పుతిన్‌ను ఆహ్వానించి ఆయన గౌరవార్థం విందును ఏర్పాటు చేయనున్నారు. 'రాబోయే పర్యటన భారతదేశంరష్యా నాయకత్వానికి ద్వైపాక్షిక సంబంధాలలో పురోగతిని సమీక్షించడానికి ప్రత్యేక, విశేష వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి పరస్పర ఆసక్తి ఉన్న ప్రాంతీయ. ప్రపంచ అంశాలపై అభిప్రాయాలను మార్పిడి చేసుకోవడానికి అవకాశాన్ని అందిస్తుంది' అని ఎంఇఏ సంక్షిప్త ప్రకటన తెలిపింది. రక్షణ, భద్రత. వాణిజ్యం, పౌర అణుశక్తి రంగాలలో సహకారాన్ని మరింత పెంచుకోవడంపై మోదీపుతిన్ చర్చల దృష్టి కేంద్రీకరించబడుతుందని భావిస్తున్నారు. ఉక్రెయిన్ వివాదం కూడా ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆయుధాలు చాలా ప్రభావవంతంగా ఉన్నాయని నిరూపించబడినందున రష్యా నుండి ఎస్400 ఉపరితలం నుండి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించే క్షిపణి వ్యవస్థల అదనపు బ్యాచ్‌లను సేకరించాలని భారతదేశం చూస్తోంది. ప్రతిపాదిత సేకరణ రెండు వైపుల మధ్య ఒప్పందంలో భాగం కావచ్చని తెలిసింది. 'భారత ప్రధానమంత్రి, రష్యా అధ్యక్షుడు నేతృత్వంలో భారత దేశం, రష్యా మధ్య ఒక యంత్రాంగం ఉంది. ప్రతి సంవత్సరం ఒక శిఖరాగ్ర సమావేశాన్ని నిర్వహించి సంబంధాల మొత్తం పరిధిని సమీక్షిస్తారు. ఇప్పటివరకూ 22 భారతదేశ శిఖరాగ్ర సమావేశాలు భారతదేశంరష్యాలో ప్రత్యామ్నాయంగా జరిగాయి. రాబోయే శిఖరాగ్ర సమావేశం ద్వైపాక్షిక వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి గణనీయమైన ఫలితాలను ఇస్తుంది' అని భావిస్తున్నట్లు సంబంధిత వ్యక్తులు తెలిపారు.రష్యా అధ్యక్షుడు చివరిసారిగా 2021లో న్యూఢిల్లీని సందర్శించారు. కాగా, గత సంవత్సరం జులైలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ వార్షిక శిఖరాగ్ర సమావేశం కోసం మాస్కోకు వెళ్లారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com